RNI.No. APTEL/2014/57702 ESTD: 1999 www.voodayam.com




# వుదయం




గుంటూరు | 29-08-2026 శనివారం | సంపుటి : 13 | సంచిక : 167 | SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Guntur, Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Warangal | Postal Regd. No. GTR/117/2025-27 | Follow us on

## పెరిగిన డ్రగ్స్, ఆర్గనైజ్డ్ కేసులు



హైదరాబాద్, ఆగస్టు 28 (వుదయం)

తెలంగాణ రాష్ట్రంలో గడిచిన మూడేళ్ల కాలంలో మొత్తం నేరాల సంఖ్య 7.15 శాతం మేర పెరిగినట్లు రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. శుక్రవారం పోలీసు ఉన్నతాధికారులతో నిర్వహించిన రాష్ట్రస్థాయి నేర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పలు ఆసక్తికర గణాంకాలను పంచుకున్నారు. 202324లో 2,65,377గా ఉన్న కేసులు, 202526 నాటికి 2,84,363కు చేరుకున్నాయని తెలిపారు. ముఖ్యంగా డ్రగ్స్ కేసులు 46.10 శాతం పెరిగి 2,026 నుంచి 2,960కి ఎగబాకాయని, ఆర్గనైజ్డ్ క్రైమ్ కేసులు 25 నుంచి ఏకంగా 451కి చేరుకున్నాయని పేర్కొన్నారు. అలాగే ట్రాఫిక్ ఉల్లంఘనల నేరాల్లో 9.48 శాతం పెరుగుదల నమోదైందన్నారు. అయితే సైబరాబాద్ పరిధిలో డ్రగ్స్ కేసులు అత్యధికంగా 90.98 శాతం, ఆదిలాబాద్‌లో 57 నుంచి 219కి కేసులు పెరిగినట్లు స్పష్టం చేశారు.మరోవైపు ఊరటనిచ్చే అంశంగా కొన్ని ప్రధాన నేరాల రేటు తగ్గుముఖం పట్టిందని డీజీపీ వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా సైబర్ క్రైమ్స్ 13.29 శాతం, ఆర్థిక నేరాలు 13.28 శాతం, తీవ్రమైన నేరాలు 10.33 శాతం మేర తగ్గాయన్నారు. విశేషంగా హైదరాబాద్ మహానగరంలో తీవ్ర నేరాలు 26.23 శాతం మేర క్షీణించినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయని తెలిపారు.

## ఇందిరమ్మ ప్లాట్ల లక్కీడ్రా
# ఉచితంగానే రిజిస్ట్రేషన్

- పేదల సొంతింటి కల నెరవేర్చేందుకే 'ఇందిరమ్మ టవర్స్'
- 16 నియోజకవర్గాల్లో 8 వేల ఫ్లాట్ల కేటాయింపు
- రూపాయి ఖర్చు లేకుండా నిరుపేదలకు ఇందిరమ్మ ఫ్లాట్లు : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 28 (వుదయం)

మహానగరంలో నిరుపేదల సొంతింటి కలను సాకారం చేస్తూ, వారి ఆత్మగౌరవాన్ని పెంపొందించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ టవర్స్' ఫ్లాట్ల కేటాయింపు ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరుగుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. క్యూర్ (CURE) పరిధిలో అర్హతే ప్రామాణికంగా, రాజకీయాలు, కులమతాలకు అతీతంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం నాంపల్లి, కుత్బుల్లాపూర్, సికింద్రాబాద్, రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్వహించిన లక్కీడ్రా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. నాంపల్లిలోని రెడ్‌హిల్స్ పరిధికి సంబంధించి వెట్ గార్డెన్స్‌లో, రాజేంద్రనగర్‌లోని మైలార్‌దేవుపల్లి పరిధికి గానూ లక్ష్మీగూడలో జరిగిన ప్రత్యక్ష లక్కీడ్రాలో పాల్గొని స్వయంగా విజేతల పేర్లను మంత్రి వెల్లడించారు. మీడియా, లబ్ధిదారుల సమక్షంలో చేపట్టిన ఈ డ్రా ప్రక్రియ అంతటినీ సోషల్ మీడియా ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేసినట్లు ఆయన పేర్కొన్నారు.ఈ నెల 31వ తేదీ వరకు మొత్తం 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో రోజుకు నాలుగు నియోజకవర్గాల చొప్పున సుమారు 8 వేల ఫ్లాట్లకు లక్కీడ్రా నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి గానూ 480 ఫ్లాట్ల నిమిత్తం 600 మందిని ముందుగా ఎంపిక చేస్తారని, అనంతరం అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి అందులో ఎవరైనా అనర్హులు ఉంటే మిగిలిన 120 మందికి అవకాశం కల్పిస్తారని వివరించారు. ఈ నెల 13న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేపీహెచ్‌బీ కాలనీలో ఇందిరమ్మ టవర్స్‌కు శంకుస్థాపన చేసిన స్వల్ప వ్యవధిలోనే టెండర్లు పూర్తి చేసి, లక్కీడ్రా చేపట్టడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. తొలి విడతలో క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, మరో నాలుగు నియోజకవర్గాల్లో సెప్టెంబర్ 3వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదే రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని, ఇప్పటికే 2 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావొచ్చాయని మంత్రి పేర్కొన్నారు.



## అంతర్రాష్ట్ర జల వివాదాలపై
# తెలంగాణ గళం



హైదరాబాద్, ఆగస్టు 28 (వుదయం)

అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాలకు సంబంధించి ఎలాంటి లొంగుబాటు లేకుండా వివిధ వేదికలపై తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను బలంగా వినిపించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం (MCRHRD) లో నీటిపారుదల శాఖపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. వచ్చే నెల సెప్టెంబరు 1న తుమ్మిడిహట్టి ప్రాజెక్టుపై న్యూఢిల్లీలో జరగనున్న అధికారుల భేటీతో పాటు, సెప్టెంబరు 7న జరగబోయే కేంద్ర జల సంఘం (CWC) హైలెవెల్ కమిటీ సమావేశ ఎజెండాపై ఈ సందర్భంగా సుదీర్ఘంగా చర్చించారు. పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లతో ఉన్న వివాదాల విషయంలో న్యాయవాదులు, అధికారులు తెలంగాణ వైఖరిని స్పష్టం చేయాలని సీఎం ఆదేశించారు. అంతేకాకుండా సుప్రీంకోర్టుతో పాటు కేంద్ర జలవనరుల సంఘం, కృష్ణా మరియు గోదావరి నదీ జలాల యాజమాన్య బోర్డుల (KRMB, GRMB) ముందు విచారణలో ఉన్న వివిధ కేసుల ప్రస్తుత పరిస్థితిని సీఎం అడిగి తెలుసుకున్నారు. ఎదుటి రాష్ట్రాల వాదనలను తిప్పికొడుతూ రాష్ట్ర హక్కుల పరిరక్షణే ధ్యేయంగా ముందుకు సాగాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. మరోవైపు అమెరికాలోని సెయింట్ లూయిస్‌లో ఘనంగా జరిగిన ప్రతిష్టాత్మక 'గ్రాండ్ చెస్ టూర్' టైటిల్‌ను కైవసం చేసుకుని చరిత్ర సృష్టించిన భారత యువ చెస్ గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానందకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు. అంతర్జాతీయ క్రీడా వేదికపై భారత దేశ ఖ్యాతిని సగర్వంగా చాటిచెప్పిన ప్రజ్ఞానంద అపూర్వ విజయం ప్రతి ఒక్క భారతీయుడు గర్వించదగ్గ విషయమని సీఎం కొనియాడారు. ఈ విజయం దేశంలోని యువతకు, వర్ధమాన క్రీడాకారులకు ఎంతో స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ప్రజ్ఞానంద ఇలాంటి మరెన్నో అద్భుత విజయాలు సాధించి దేశానికి మరింత కీర్తిప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు అందజేశారు.

## నేరుగా రైతుల ఖాతాల్లోకే..



హైదరాబాద్, ఆగస్టు 28 (వుదయం)

:తెలంగాణ రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణను మరింత వేగవంతం చేయాలని, రైతులకు అవసరమైన మొక్కలను సకాలంలో అందుబాటులో ఉంచాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో వ్యవసాయ, సహకార శాఖల పరిధిలోని పలు కీలక అంశాలపై ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం నడుస్తున్న ఖరీఫ్ సీజన్ పురోగతి, ఆయిల్‌పామ్ సాగు విస్తరణ, ఎరువుల లభ్యత, వ్యవసాయ యాంత్రీకరణ, రైతు వేదికలపై సోలార్ ప్యానెల్స్ అమరిక తదితర అంశాలపై ఈ భేటీలో సమగ్రంగా చర్చించారు. రైతుల సాగు ఖర్చు తగ్గించడంతో పాటు పనులను సులభతరం చేసేందుకు ఉద్దేశించిన వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద అందించే పరికరాలను ఖరారు చేసినట్లు మంత్రి తెలిపారు.రైతుల స్థానిక అవసరాలకు అనుగుణంగా యాంత్రీకరణ పనిముట్లను ఎంపిక చేసి, వాటి పంపిణీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి సూచించారు. ఈసారి యాంత్రీకరణ పథకానికి సంబంధించి అందించే రాయితీ నిధులను (సబ్సిడీ) మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోనే డీబీటీ (DBT) ద్వారా జమ చేసేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మరోవైపు రాష్ట్రంలో యూరియా సరఫరా కొరత లేదని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫెర్టిలైజర్ యాప్‌లో వస్తున్న సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ రైతులకు సజావుగా ఎరువులను అందిస్తున్నామని వివరించారు.ఆగస్టు నెలకు సంబంధించి కేటాయించిన 1.50 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కోటాలో ఇప్పటికే 1.17 లక్షల మెట్రిక్ టన్నులను రాష్ట్రానికి తెప్పించి రైతులకు అందుబాటులో ఉంచామని మంత్రి తుమ్మల వెల్లడించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ఫెర్టిలైజర్ యాప్ వినియోగం, అందులో ఎరువుల బుకింగ్, లభ్యత తనిఖీ మరియు కొనుగోలు విధానంపై క్షేత్రస్థాయిలో రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

## రాయదుర్గంలో ఆకాశాన్నంటిన భూముల ధరలు
# ఎకరం రూ.269 కోట్లు!



- టీజీఐఐసీ వేలంలో ప్రభుత్వానికి రూ.1,447 కోట్ల ఆదాయం
- రియల్ ఎస్టేట్‌లో రాయదుర్గం సంచలనం
- రాయదుర్గం భూమి ధరల్లో మరొక ఆల్ టైమ్ రికార్డ్!

హైదరాబాద్, ఆగస్టు 28 (వుదయం)

మహానగరంలోని ప్రసిద్ధ ఐటీ కారిడార్ రాయదుర్గంలో రియల్ ఎస్టేట్ ధరలు మరోసారి ఆకాశాన్ని తాకాయి. రాయదుర్గంలో నిర్వహించిన టీజీఐఐసీ (TGIIC) ఆన్‌లైన్ వేలంలో ఎకరం భూమి ఏకంగా రూ. 269 కోట్ల రికార్డు స్థాయి ధరను పలికింది. సరిగ్గా వారం రోజుల క్రితమే ఇదే ప్రాంతంలో ఎకరం రూ. 264 కోట్లకు అమ్ముడుపోగా, తాజాగా దానికి పక్కనే ఉన్న ప్లాట్‌లో ఆ రికార్డు సైతం తుడిచిపెట్టుకుపోవడం విశేషం.రాయదుర్గం పరిధిలోని సర్వే నంబరు 83/1లో ఉన్న 5.38 ఎకరాల ప్రభుత్వ భూమి విక్రయానికి టీజీఐఐసీ ఇటీవల ఇవేలం నిర్వహించింది. ఇందులో ప్రారంభ ధరగా ఎకరానికి రూ. 175 కోట్లుగా నిర్ణయించగా, రూ. 10 కోట్లు ముందస్తు డిపాజిట్ (EMD) చెల్లించిన ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలు పోటీపడ్డాయి. తీవ్ర ఉత్కంఠ మధ్య సాగిన ఈ ఆన్‌లైన్ వేలంలో ప్రముఖ నిర్మాణ సంస్థ 'వంశీరామ్ బిల్డర్స్' ఎకరానికి రూ. 269 కోట్ల చొప్పున మొత్తం 5.38 ఎకరాలను దక్కించుకుంది. ఈ భారీ వేలం ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ. 1,447 కోట్ల భారీ ఆదాయం సమకూరింది.

## అమెరికాలో హత్య..
# భారత్‌లో ముగిసిన పరారీ



హైదరాబాద్, ఆగస్టు 28 (వుదయం)

అమెరికాలో కలకలం రేపిన తెలుగు యువతి నిఖిత గొడిశాల (27) దారుణ హత్య కేసులో అత్యంత కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అర్జున్ శర్మను తెలంగాణ పోలీసులు ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో అరెస్ట్ చేశారు. ఆగ్రాలోని ఒక అపార్ట్‌మెంట్‌లో తలదాచుకున్న అతడిని లాలాగూడ, హైదరాబాద్ పోలీసు బృందాలు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నాయి. అనంతరం నిందితుడిని ఢిల్లీలోని పాటియాలా హౌస్ కోర్టులో హాజరుపరిచారు. అమెరికా ప్రభుత్వ అధికారిక అభ్యర్థన మేరకు, అంతర్జాతీయ న్యాయ ప్రక్రియ ప్రకారం నిందితుడిని ఆ దేశానికి అప్పగించే చర్యలు వేగవంతం చేసినట్లు హైదరాబాద్ పోలీస్ అధికారులు వెల్లడించారు. హైదరాబాద్ లాలాగూడ విజయపురి కాలనీకి చెందిన ఆనంద్ కుమార్తె నిఖిత, ఉన్నత చదువుల (MS) నిమిత్తం నాలుగేళ్ల క్రితం అమెరికాకు వెళ్లారు. కాగా, ఈ ఏడాది జనవరి 2న నిఖిత కనిపించడం లేదంటూ ఆమె మాజీ రూమ్‌మేట్ అర్జున్ శర్మ అక్కడి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసి, వెంటనే భారత్‌కు తిరిగొచ్చాడు.

Estd : 2001

**SAI SPURTHI INSTITUTE OF TECHNOLOGY**
(Autonomous)
B. Gangaram , Sathupally – 507 303, Khammam Dist., Telangana.
Mobile Nos. 9963084558, 8688779999
(Approved by AICTE, New Delhi, Affiliated to JNTUH & Recognised by Govt. of Telangana)

**MBA SPOT ADMISSIONS 2026-27**

Few left-over seats are available in MBA Course. Eligible candidates can apply and attend with all original certificates in the college office from 31.08.2026 to 03.09.2026.

Selected candidates have to pay the Tuition Fee of Rs. 54,000/-. The seats will be filled as per the guidelines and norms of Convenor, TGICET-2026 and Govt. of Telangana.

PRINCIPAL

## నౌకా మార్గాలు ఇక సురక్షితం: అమెరికా



వాషింగ్టన్: వ్యూహాత్మక హర్మూజ్ జలసంధి తమ పూర్తి ఆధీనంలోనే ఉందనే విషయాన్ని స్పష్టం చేస్తూ అమెరికా అత్యంత కీలక నిర్ణయాన్ని వెల్లడించింది. అంతర్జాతీయంగా అత్యంత ప్రాధాన్యత కలిగిన ఈ నౌకా రవాణా మార్గం ఇకపై సురక్షితమని ప్రపంచ దేశాలకు అమెరికా భరోసా ఇచ్చింది. పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్న సమయంలో హర్మూజ్ జలసంధిని తమ అదుపులోకి తెచ్చుకున్న ఇరాన్, అక్కడి కీలక నౌకా మార్గాల్లో ప్రమాదకరమైన 'సీమైన్స్' (Sea Mines)ను అమర్చిన సంగతి తెలిసిందే. వీటి కారణంగా గతంలో అనేక నౌకలు ప్రమాదాలకు గురై పేలిపోయాయి. కాగా, రవాణాకు తీవ్ర విఘాతం కలిగిస్తున్న ఈ నౌకా విధ్వంసక మైన్లను అంతర్జాతీయ జలాల నుంచి పూర్తిగా తొలగించినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ తాజాగా సంచలన ప్రకటన చేసింది. అత్యంత గోప్యంగా, రహస్య ఆపరేషన్ ద్వారా ఈ మైన్లను తొలగించినట్లు ధ్రువీకరించింది. విశాలమైన సముద్ర గర్భంలో ఆవగింజను వెతకడం ఎంత కష్టమో, అగాధంలో అమర్చిన సీమైన్లను గుర్తించి తొలగించడం అంతటి సంక్లిష్టమైన ప్రక్రియ.

## సరిహద్దులు దాటుతున్న వరద మృతదేహాలు

- 547కి చేరిన మృతుల సంఖ్య
- గల్లంతైన వారిలో 320 మంది భారతీయులు



కాఠ్‌మాండూ, ఆగస్టు 28 (ఎఎంఎస్)

నేపాల్‌లో సంభవించిన భయానక వరదలు, కొండచరియలు విరిగిపడటంతో చెలరేగిన విపత్తు తీవ్ర వినాశనాన్ని మిగిల్చింది. సహాయక బృందాలు గాలింపు చర్యలను ముమ్మరం చేయగా, ఇప్పటివరకు ఏకంగా 547 మృతదేహాలను వెలికితీసినట్లు నేపాల్ పోలీసులు అధికారికంగా ప్రకటించారు. ఈ ఘటనల్లో మరో 1,473 మందికి పైగా తీవ్రంగా గాయపడగా, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరద తాకిడికి భీకరంగా ప్రవహిస్తున్న నదుల కారణంగా నదీ పరివాహక ప్రాంతాల్లో మృతదేహాలు కిలోమీటర్ల మేర కొట్టుకుపోతున్నాయి. ఈ క్రమంలో భారత సరిహద్దులోని ఉత్తరప్రదేశ్ మహారాజ్‌గంజ్ జిల్లాలో నాలుగు, కుషీనగర్ జిల్లాలో మూడు మృతదేహాలు లభ్యమయ్యాయని స్థానిక అధికారులు తెలిపారు.

## ఇంతే కదా...!




# భారత సైన్యానికి మరింత బలగాలు

## భారత అమ్ములపొదిలోకి అమెరికా ట్యాంక్ విధ్వంసక 'జావెలిన్' క్షిపణులు

న్యూఢిల్లీ, ఆగస్టు 28 (ఎఎంఎస్) :

న్యూఢిల్లీ:భారత రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తూ సైన్యానికి అదనపు బలాన్ని చేకూర్చేలా భారత్, అమెరికా మధ్య కీలక రక్షణ ఒప్పందం కుదిరింది. ప్రపంచంలోనే అత్యంత అధునాతన ట్యాంక్ విధ్వంసకర క్షిపణులైన 'జావెలిన్' (Javelin Missiles) కొనుగోలుకు భారత్ అంగీకారం తెలిపింది. అమెరికా 'ఫారిన్ మిలిటరీ సేల్స్' ప్రక్రియలో భాగంగా ఈ క్షిపణుల కొనుగోలుకు సంబంధించిన అధికారిక పత్రాలపై భారత సైన్యం సంతకాలు చేసినట్లు భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ శుక్రవారం ధ్రువీకరించారు. ఇరు దేశాల మధ్య పెరుగుతున్న ద్వైపాక్షిక రక్షణ భాగస్వామ్యానికి, వ్యూహాత్మక సంబంధాలకు ఈ ఒప్పందం స్పష్టమైన నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. అయితే, ఈ ఒప్పందంలో భాగంగా భారత్ ఎన్ని క్షిపణులను కొనుగోలు చేస్తోంది, ఇందుకోసం ఎంత వ్యయం చేయనుందనే వివరాలను అధికారులు ఇంకా వెల్లడించలేదు.అమెరికా రక్షణ దిగ్గజాలు రేథియాన్, లాక్‌హీడ్ మార్టిన్ సంస్థలు సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఈ 'జావెలిన్' ఒక శక్తివంతమైన యాంటీ ట్యాంక్ గైడెడ్ మిసైల్ (ATGM). దీనిని సైనికులు తమ భుజాలపై ఉంచుకుని శత్రువుల అధునాతన ట్యాంకులను క్షణాల్లో ధ్వంసం చేయవచ్చు. 3.7 అడుగుల పొడవు ఉండే ఈ క్షిపణి వ్యవస్థలో కమాండ్ కంట్రోల్ యూనిట్, డిస్పోజబుల్ లాంచ్ ట్యూబ్ ఉంటాయి. సాధారణంగా క్షిపణి ప్రయోగించినప్పుడు వెలువడే వేడి, పొగ ఆధారంగా ప్రయోగించిన స్థానాన్ని శత్రువులు గుర్తిస్తారు. అయితే జావెలిన్ వ్యవస్థలో ప్రాథమిక మోటార్ ద్వారా క్షిపణి కొంతదూరం నెట్టబడిన తర్వాతే ప్రధాన మోటార్ స్టార్ట్ అవుతుంది. దీనివల్ల ప్రయోగించిన ప్రదేశాన్ని శత్రువులు గుర్తించడం దాదాపు అసాధ్యం. ఆ లోపే సైనికులు సురక్షిత ప్రాంతానికి చేరుకోవచ్చు. ట్యాంకులపై ఉండే కఠినమైన 'రియాక్టివ్ ఆర్మర్' కవచాలను సైతం రెండు దశల పేలుడు వ్యవస్థ ద్వారా ఛేదించి ట్యాంక్‌ను సమూలంగా ధ్వంసం చేసే సామర్థ్యం దీనికి ఉంది. అత్యంత క్లిష్టమైన సాంకేతికతతో కూడిన ఒక్కో జావెలిన్ క్షిపణి విలువ దాదాపు 2 లక్షల డాలర్ల వరకు ఉంటుందని అంచనా.



## మానవ హక్కులు, అవినీతి వ్యతిరేక సఘం జిల్లా చైర్మన్‌గా ఎం.డీ. వహిద్ భాషా



**అయిజ ఆగస్టు 28 (వుదయం ప్రతినిధి)**

జోగులాంబ గద్వాల్ జిల్లా మానవ హక్కులు, అవినీతి వ్యతిరేక సంఘం జిల్లా చైర్మన్‌గా అయిజ పట్టణానికి చెందిన ఎం.డీ. వహిద్ భాషా నియమితులయ్యారు. ఎమ్.ఆర్. మానవ హక్కులు,అవినీతి వ్యతిరేక సంఘం స్థాపకులు, జాతీయ అధ్యక్షులు గుండారెడ్డి మల్లికార్జున రెడ్డి, జాతీయ, రాష్ట్ర స్థాయి కార్యవర్గ సభ్యుల సిఫార్సు మేరకు ఈ నియామకం చేపట్టినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. సమాజంలో మానవ హక్కుల పరిరక్షణ, అవినీతికి వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించడం, అన్యాయం, అక్రమాలు, దోపిడీకి గురవుతున్న బాధితులకు అండగా నిలవడం వంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టే లక్ష్యంతో వహిద్ భాషాకు జిల్లా బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో సంస్థ కార్యకలాపాలను విస్తరించడంతో పాటు, ప్రజలకు మానవ హక్కులపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలకు చట్టపరమైన హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించడం, బాధితుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, అవినీతి నిర్మూలనకు ప్రజలను భాగస్వాములను చేయడం వంటి అంశాల్లో సంఘం తరఫున కృషి చేయనున్నట్లు వెల్లడించారు. తనపై నమ్మకంతో జిల్లా చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షులు గుండారెడ్డి మల్లికార్జున రెడ్డి, జాతీయ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు ఎం.డీ. వహిద్ భాషా కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ జిల్లాలో మానవ హక్కుల పరిరక్షణ, అవినీతి వ్యతిరేక కార్యక్రమాల బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.జిల్లా చైర్మన్‌గా ఎం.డీ. వహిద్ భాషా నియామకం పట్ల అయిజ పట్టణానికి చెందిన పలువురు, సామాజిక సేవా కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# రాఖీతో ముడిపడిన అనుబంధం

- ఆత్మీయతతో వెల్లివిరిసిన వేడుకలు"
- చింతలగట్టులో ఘనంగా రక్షాబంధన్ సంబరాలు'



**కోహీర్, ఆగస్టు 28 (వుదయం ప్రతినిధి):**

రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని కోహీర్ మండల పరిధిలోని చింతలగట్టు గ్రామంలో రక్షాబంధన్ వేడుకలు అత్యంత వైభవంగా, ఆత్మీయతా రాగాల మధ్య సాగాయి. సోదరీమణులు తమ ప్రియమైన సోదరులకు ప్రేమగా రాఖీలు కట్టి ప్రేమాభిమానాలను చాటుకోగా, సోదరులు తమ అక్కాచెల్లెళ్లకు మిఠాయిలు తినిపించి, బహుమతులు అందజేస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. దీంతో చింతలగట్టు గ్రామంలో పండుగ సందడి మిన్నంటింది.ఈ ఆనందోత్సవాల్లో మల్లన్న పటేల్, సంగన్న సౌకారి, చంద్రశేఖర్ పాటిల్, విజయ్ కుమార్ పాటిల్, సంగమ్మ, లక్ష్మి, బిందుప్రియ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రక్షాబంధన్ అనేది కేవలం పండుగ మాత్రమే కాదని, అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య నమ్మకం, ఆత్మీయత మరియు పరస్పర రక్షణకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన బంధమని పేర్కొన్నారు. సోదరీమణులు ప్రేమతో రాఖీలు కట్టి, తమ సోదరులు జీవితంలో ఎల్లప్పుడూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించగా.. సోదరులు కూడా తమ సోదరీమణులకు జీవితాంతం అండగా నిలిచి, కష్టసుఖాల్లో తోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు.రాఖీ కట్టే ప్రతి క్షణం కుటుంబ సభ్యులలో అనురాగాన్ని, ఆప్యాయతను నింపింది. చిన్ననాటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ నవ్వులు, సరదాల మధ్య కుటుంబ సభ్యులంతా ఆనందంగా గడిపారు. రాఖీల రంగులు, మిఠాయిల తియ్యదనంతో వేడుకలు మరింత ఉత్సాహంగా, సందడిగా సాగాయి. కుటుంబ బంధాలను, ప్రేమను, సోదరభావాన్ని పెంపొందించే రక్షాబంధన్ ప్రతి ఒక్కరి జీవితంలో ఒక ప్రత్యేకమైన స్థానాన్ని కలిగి ఉందని కుటుంబసభ్యులు పేర్కొన్నారు.

## సోనూసూద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఓ పాజిటివ్ ప్లేట్లెట్స్ దానం

**మహబూబ్ నగర్, ఆగస్టు28 (వుదయం ప్రతినిధి):**

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం సోనూసూద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోను సూద్ ఫౌండేషన్ ట్రెజరర్ పాట్ల విజయ్ రెడ్డి ఓ పాజిటివ్ ప్లేట్లెట్స్ దానం చేశారు.మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో సోనుసూద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అత్యవసర పరిస్థితుల్లో ఉన్న 3 రోజుల పసికందుకు ఓ పాజిటివ్ ప్లేట్లెట్స్ దానం చేశారు.నారాయణపేట జిల్లాకు చెందిన నవీన్ కుమార్ 3రోజుల పసికందుకి వైద్యుల పరీక్షల నిర్వహించగా ప్లేట్లెట్స్ తక్కువగా ఉన్నట్లు గుర్తించారు.ఈ సమాచారాన్ని సోనూసూద్ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ మనోహర్ తెలుసుకొని సోను సూద్ ఫౌండేషన్ ట్రెజరర్ అయినటువంటి పాట్ల విజయ్ రెడ్డి కి సమాచారం ఇవ్వగా వెంటనే స్పందించి హుటాహుటిన పాలమూరు బ్లడ్ బ్యాంకుకు చేరుకుని ఓ పాజిటివ్ ప్లేట్లెట్స్ దానం చేసి మూడు 3రోజుల పసికందుకి అండగా నిలిచారు.ఇప్పటికే 31 వ సారి రక్తదానం చేసినట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో సోనూసూద్ ఫౌండేషన్ ట్రెజరర్ పాట్ల విజయ్ రెడ్డి,



అరుణ్ కుమార్ రెడ్డి, ఎల్లస్వామి గౌడ్, నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**సోనూసూద్ ఫౌండేషన్ ముఖ్య ఉద్దేశం.....**

రక్తం అందక ఏ ఒక్కరూ ఇబ్బంది పడకూడదు. రక్తం కొరత కారణంగా ఏ ఒక్క ప్రాణానికి కూడా ఎలాంటి ఇబ్బంది కలగకూడదు అనే మహోన్నత లక్ష్యంతో సోనూసూద్ ఫౌండేషన్ నిరంతరం సేవా కార్యక్రమాలు చేపట్టి స్తున్నట్లు ఆయన తెలిపారు.అత్యవసర సమయంలో రక్తదాతలను సమకూర్చి, అవసరమైన వారికి సకాలంలో రక్తం, ప్లేట్లెట్స్ అందేలా చేయడం ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమన్నారు.

## అలంపూర్ నియోజకవర్గం లో కాంగ్రెస్ సంస్థాగత నిర్మాణంపై దిశానిర్దేశం

- మండల, పట్టణ కమిటీలను త్వరితగతిన పూర్తి చేయాలి: డాక్టర్ ఎస్.ఏ. సంపత్ కుమార్



**అలంపూర్ ఆగస్టు 28 (వుదయం కరస్పాండెంట్)**

పీసీసీ ఆదేశాల మేరకు జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం లో నూతనంగా నియమితులైన మండల, పట్టణ అధ్యక్షులతో సంస్థాగత నిర్మాణంపై సమావేశం నిర్వహించారు. అలంపూర్ మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్.ఏ. సంపత్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి పీసీసీ వైస్ ప్రెసిడెంట్, నియోజకవర్గ ఇన్‌చార్జి కొండేటి మల్లయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డీసీసీ అధ్యక్షులు రాజీవ్ రెడ్డి, జిల్లా అబ్జర్వర్ శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడంపై నాయకులు, మండల అధ్యక్షులతో విస్తృతంగా చర్చించారు. నూతన మండల కమిటీల ఏర్పాటు, గ్రామస్థాయి కమిటీల నిర్మాణం, పట్టణ కాంగ్రెస్ కమిటీలను పూర్తి చేయడం వంటి అంశాలపై దిశానిర్దేశం చేశారు.

**సమావేశంలో ప్రధానంగా చర్చించిన అంశాలు**

నూతన మండల కమిటీలను త్వరితగతిన ఏర్పాటు చేయాలి.మండల పరిధిలోని అన్ని కమిటీలను ఈ నెల 30వ తేదీలోగా పూర్తి చేయాలి.గ్రామస్థాయి కాంగ్రెస్ కమిటీలను కూడా వెంటనే ఏర్పాటు చేయాలి.పట్టణాల్లో పెండింగ్‌లో ఉన్న కాంగ్రెస్ కమిటీలను పూర్తి చేయాలి. మండల కమిటీల్లో పనిచేయాలనుకునే నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా ముందుకు రావాలి.కొత్త, పాత మండల అధ్యక్షులు సమన్వయంతో పనిచేస్తూ పార్టీని బలోపేతం చేయాలి.సంస్థాగత నిర్మాణాన్ని పటిష్ఠం చేసి రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలి. ఎస్ఐఆర్ చివరి దశ ప్రక్రియపై మండల అధ్యక్షులకు అవగాహన కల్పించారు.ప్రతి ఓటు కీలకమని, ఎస్ఐఆర్ ప్రక్రియలో మండల అధ్యక్షులు చురుకుగా పాల్గొనాలని సూచించారు. మండల పరిధిలోని బీఎల్ఏలకు అవసరమైన సలహాలు, సూచనలు అందించి ఓటర్ల జాబితా ప్రక్రియను పర్యవేక్షించాలి.నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పార్టీ కార్యకలాపాలను విస్తృతం చేసి, కాంగ్రెస్ పార్టీకి బలమైన కేడర్‌ను నిర్మించాలని నాయకులు సూచించారు. పార్టీ శ్రేణులంతా ఐక్యంగా, సమన్వయంతో పనిచేస్తే రాబోయే ఎన్నికల్లో విజయాన్ని సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్.ఏ. సంపత్ కుమార్‌తో పాటు పీసీసీ వైస్ ప్రెసిడెంట్, నియోజకవర్గ ఇన్‌చార్జి కొండేటి మల్లయ్య, జిల్లా అబ్జర్వర్ శ్రీనివాస్ గౌడ్, డీసీసీ అధ్యక్షులు రాజీవ్ రెడ్డి, అలంపూర్ నియోజకవర్గంలోని నూతన, పాత మండల అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డప్ప, వైస్ చైర్మన్ కుమార్, పట్టణ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు బకాయిలు విడుదల చేయాలి కల్వకుర్తిలో సీఎం దిష్టిబొమ్మ దగ్ధం



**కల్వకుర్తి, ఆగస్టు 28 (వుదయం ప్రతినిధి):**

విద్యార్థులకు రావాల్సిన ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్స్ ను వెంటనే విడుదల చేయని అసమర్థ రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని నిరసిస్తూ కల్వకుర్తి పట్టణంలో సీఎం దిష్టిబొమ్మను బి జె వై ఎం నాయకులు దగ్ధం చేశారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు, బి జె వై ఎం రాష్ట్ర అధ్యక్షులు గుండె గణేష్ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఈ నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చారు. అందులో భాగంగా శుక్రవారం కల్వకుర్తి పట్టణంలో బి జె వై ఎం జిల్లా అధ్యక్షులు ధన్నోజు నరేష్ చారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా నరేష్ చారి మాట్లాడుతూ... విద్యార్థులకు రావాల్సిన ఫీజుల బకాయిలను వెంటనే రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు ఉద్యమాలు కొత్త కాదని, తెలంగాణ వచ్చిందే విద్యార్థుల ఉద్యమం నుండేనని అన్నారు. తెలంగాణ విద్యార్థులు అనుకుంటే ఏదైనా సాధించగలరని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫీజు రియంబర్స్మెంట్ వచ్చే వరకు విద్యార్థులకు మద్దతుగా బి జె వై ఎం ఉంటుందని తెలిపారు. తెలంగాణ ఏర్పడింది నీళ్లు, నిధులు, నియామకాల కోసమని, ఈ నియంత పాలనను పాతరేసి విద్యార్థులకు అండగా నిలుస్తామని అన్నారు.కార్యక్రమంలో కల్వకుర్తి మండల రూరల్ బి జె వై ఎం అధ్యక్షుడు శివ సేన, ఎస్సీ మోర్చా జిల్లా నాయకులు పానుగంటి శివ, బి జె వై ఎం జిల్లా నాయకులు లస్కర్ శివాజీ, బల్మూరి ప్రశాంత్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి అరవింద్, చింటూ, అరవింద్ రెడ్డి, ఆనంద్, నవీన్ జగదీష్, లక్ష్మీనరసింహ, సాయి పాల్గొన్నారు.



## చెట్లుగా పెంచే బాధ్యతను ప్రతి పౌరుడు స్వీకరించాలి

- రాంపూర్ సర్పంచ్ గోక మహిపాల్ రెడ్డి

**నంగునూరు, ఆగస్టు 28 (వుదయం):**

పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటి, వాటిని చెట్లుగా పెంచే బాధ్యతను ప్రతి పౌరుడు స్వీకరించాలని రాంపూర్ సర్పంచ్ గోక మహిపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. చెట్లు, అడవులు ప్రకృతికి రక్షణ కవచంగా నిలుస్తాయని, విచ్చలవిడిగా చెట్లను నరికివేయడం వల్ల వాతావరణ సమతుల్యత దెబ్బతింటోందని అన్నారు. నంగునూరు మండలం రాంపూర్ గ్రామంలో శుక్రవారం వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. చెట్లు నీడను అందించడంతో పాటు ఆక్సిజన్‌ను విడుదల చేసి, కార్బన్‌డయాక్సైడ్‌ను గ్రహిస్తాయని, నేల కోతను నివారించి భూసారాన్ని కాపాడుతాయని వివరించారు. పక్షులు, చిన్న జీవులకు చెట్లు ఆవాసాలు కల్పిస్తూ పర్యావరణ సమతుల్యతను కాపాడుతాయని పేర్కొన్నారు. అభివృద్ధి పేరుతో పెద్దఎత్తున చెట్లు, అడవులను నరికివేయడం వల్ల ప్రకృతి సమతుల్యత దెబ్బతింటోందని మహిపాల్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అడవుల విస్తీర్ణం తగ్గడం, భూ వినియోగంలో మార్పులు, నీటి వనరులపై పెరుగుతున్న ఒత్తిడి, కాలుష్యం తదితర కారణాలు వాతావరణ మార్పులను తీవ్రతరం చేస్తున్నాయని అన్నారు.ఈ నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణను ప్రభుత్వాలు, స్థానిక సంస్థల బాధ్యతగానే కాకుండా ప్రతి పౌరుడి సామాజిక బాధ్యతగా భావించాలని సూచించారు. గ్రామాల్లో విస్తృతంగా మొక్కలు నాటడంతో పాటు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, రహదారుల వెంట, చెరువుల పరిసరాల్లో, పొలాల గట్లపై స్థానిక వాతావరణానికి అనుకూలమైన మొక్కలను పెంచాలని కోరారు. వన మహోత్సవం కార్యక్రమాలు కేవలం ఒక్కరోజుకే పరిమితం కాకుండా "ఒక కుటుంబం-ఒక మొక్క, ఒక మొక్క-ఒక బాధ్యత" అనే స్ఫూర్తితో నిరంతర ఉద్యమంగా కొనసాగాలని ఆకాంక్షించారు. నేడు నాటే ప్రతి మొక్క రేపటి తరాలకు అందించే విలువైన ఆస్తి అని అన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు నాంపల్లి వెంకటేశ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఎనగందుల నితిన్ కుమార్, క్షేత్ర సహాయకురాలు గోక అమావాస్య తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలకు మొక్కలు పంపిణీ చేసి వాటి సంరక్షణపై అవగాహన కల్పించారు.

## గాడి తప్పిన ఐజ ట్రాఫిక్..ఆక్రమణలతో కుదించుకుపోతున్న ప్రధాన రహదారులు

- తోపుడు బండ్లు, ఇష్టానుసార పార్కింగ్‌తో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు

**అయిజ ఆగస్టు 28 (వుదయం ప్రతినిధి)**

ఐజ పట్టణంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు ప్రధాన రహదారులపై పెరుగుతున్న ఆక్రమణలు, ఇష్టానుసారంగా వాహనాల పార్కింగ్ కారణంగా మారుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకప్పుడు రాకపోకలకు అనుకూలంగా ఉన్న ప్రధాన రహదారులు ప్రస్తుతం తోపుడు బండ్లు, వ్యాపార కార్యకలాపాలు, వాహనాల పార్కింగ్‌తో క్రమంగా కుదించుకుపోతున్నాయి.

గతంలో అంబాభవాని గుడి నుంచి తెలంగాణ చౌరస్తా వరకు రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన తోపుడు బండ్లు ప్రధాన రహదారికి సుమారు 45 అడుగుల వెనుకకు ఉండేవని స్థానికులు గుర్తుచేస్తున్నారు. దీంతో ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు కొంత వెసులుబాటు ఉండేది. అయితే ప్రస్తుతం అనేక తోపుడు బండ్లు, తాత్కాలిక దుకాణాలు రహదారి వైపు ముందుకు రావడంతో వాహనాలు వెళ్లేందుకు అందుబాటులో ఉన్న స్థలం తగ్గిపోయింది.

**రోడ్డు విస్తీర్ణం తగ్గితే ప్రమాదం తప్పదా?**

ప్రధాన రహదారికి ఇరువైపులా వ్యాపార కార్యకలాపాలు ముందుకు రావడం, మరోవైపు వాహనాల పార్కింగ్ కొనసాగడం వల్ల రహదారి అసలు విస్తీర్ణం క్రమంగా తగ్గిపోతోందని పట్టణ ప్రజలు అంటున్నారు. ముఖ్యంగా రద్దీ సమయాల్లో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర సమయంలో అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాలు



వెళ్లేందుకు కూడా ఇబ్బంది ఏర్పడే పరిస్థితి లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

**పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం కేటాయించాలి**

కొత్త బస్టాండ్ ముందు ప్రత్యేక పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేసి, ప్రధాన రహదారిపై వాహనాలు నిలిపే విధానాన్ని నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు. నోపార్కింగ్ ప్రాంతాలను స్పష్టంగా గుర్తించి, ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ఐజ పట్టణ అభివృద్ధి, ప్రజల రాకపోకలు, వ్యాపారుల జీవనోపాధి—ఈ మూడు అంశాలను సమన్వయం చేసుకుంటూ రోడ్డు ఆక్రమణలు, తోపుడు బండ్ల స్థానం, పార్కింగ్ సమస్య, ట్రాఫిక్ నియంత్రణపై సమగ్ర ప్రణాళిక రూపొందించాల్సిన సమయం ఆసన్నమైంది.ఐజ మున్సిపాలిటీ, పోలీస్, సంబంధిత అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి, గతంలో ఉన్న రహదారి వెసులుబాటును పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# కేంద్ర మంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాటు

- ఈనెల 31న జోగులాంబ రైల్వే స్టేషన్‌ను పరిశీలించనున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**అలంపూర్ ఆగస్టు 28 (వుదయం కరస్పాండెంట్):**

కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఈనెల 31న అలంపూర్‌లో పర్యటించనున్న నేపథ్యంలో పర్యటనను విజయవంతం చేసేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. శుక్రవారం అలంపూర్‌లో పర్యటించిన కలెక్టర్, కేంద్ర మంత్రి పర్యటించే ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.ముందుగా శ్రీ



బాల బ్రహ్మేశ్వర జోగులాంబ రైల్వే స్టేషన్‌ను కలెక్టర్ సందర్శించారు. అమృత్ భారత్ స్టేషన్స్ పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులను కేంద్ర మంత్రి పరిశీలించనున్న నేపథ్యంలో స్టేషన్‌లో ప్రయాణికుల వేచి ఉండే హాళ్లు, టికెట్ కౌంటర్, ఇతర విభాగాలను పరిశీలించారు. జోగులాంబ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు, స్టేషన్ మీదుగా రైళ్ల రాకపోకల వివరాలను అసిస్టెంట్ రైల్వే డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాసరావు కలెక్టర్‌కు వివరించారు.

డబ్లింగ్ పనులకు అవసరమైన భూసేకరణ జిల్లా పరిధిలో పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. అనంతరం అలంపూర్ పట్టణంలోని హరిత హోటల్‌ను సందర్శించి, అక్కడ కేంద్ర మంత్రి రానున్న నేపథ్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. అనంతరం అలంపూర్ మండల తహసిల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. 22ఏ కింద ఉన్న వ్యవసాయ, వ్యవసాయేతర భూముల వివరాలను సమగ్రంగా సేకరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా మ్యాపింగ్ కాని ఓటర్లకు నోటీసుల పంపిణీ, హియరింగ్ ప్రక్రియలపై కూడా సంబంధిత అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు.ప్రసాద్ పథకంలో భాగంగా నిర్మించిన భవనాన్ని కూడా కలెక్టర్ పరిశీలించారు. అన్నప్రసాద కేంద్రంలో భక్తులకు అందుతున్న సేవలు, నిర్వహణ తీరుపై ఆరా తీశారు. భక్తులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అలంపూర్ ఆలయాల సమీపంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సౌండ్స్ అండ్ లైట్స్ ప్రదర్శనను కేంద్ర మంత్రి ప్రారంభించనున్న నేపథ్యంలో అక్కడ చేపట్టాల్సిన ఏర్పాట్లను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ పర్యటనలో పర్యాటక శాఖ అధికారులు పర్షవేది, వినోద్ కుమార్, విక్రమ్, అలంపూర్ తహసిల్దార్ ప్రభాకర్, ఎంపీడీవో చంద్రకళ, మున్సిపల్ కమిషనర్ రాజేష్, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు



**మిరుదొడ్డి, ఆగస్టు 28, వుదయం:**

మండల వ్యాప్తంగా రాఖీ పౌర్ణమి పండుగను శుక్రవారం అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. సోదర, సోదరీమణుల మధ్య ప్రేమానుబంధానికి, రక్షా బంధానికి ప్రతీక అయిన ఈ పండుగను మండల ప్రజలు సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. ఉదయం నుండే మహిళలు, చెల్లెళ్లు, అక్కలు తమ సోదరులకు రాఖీలు కట్టి, నిండు మనసుతో శుభాకాంక్షలు తెలిపారు. అన్నదమ్ములు తమ సోదరీమణులకు జీవితాంతం అండగా ఉంటామని, రక్షగా నిలుస్తామని మాట ఇచ్చారు. చెల్లెళ్లకు, అక్కలకు కొత్త బట్టలు, కానుకలు అందించి ఆనందాన్ని పంచుకున్నారు. రాఖీ పౌర్ణమి కేవలం రక్త సంబంధీకుల మధ్యనే కాకుండా సమాజంలో సోదర భావాన్ని, ఐక్యతను, పరస్పర గౌరవాన్ని పెంపొందించే పండుగ అని పేర్కొన్నారు. అన్నా చెల్లెలు, అక్కా తమ్ముళ్ల మధ్య ఉన్న ప్రేమ, ఆప్యాయతలను ఈ పండుగ మరింత బలపరుస్తుందని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పండుగ సందర్భంగా సందడి నెలకొంది. ఇళ్లలో మిఠాయిలు పంచుకుంటూ కుటుంబ సభ్యులంతా కలిసి వేడుకలను జరుపుకున్నారు.

## ప్రజల ప్రాణాలకు విలువ లేదా..?



- జహీరాబాద్ ఏరియా ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలి
- పోలీసుల తీరుపైనా సమగ్ర విచారణ జరపాలి: తెలంగాణ రక్షణ సేన జహీరాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ వేణుమాధవ్

**జహీరాబాద్/కోహీర్: వు దయం:**

సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం సజ్జాపూర్ గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దళిత కుటుంబానికి చెందిన ఇద్దరు మృతి చెందిన ఘటనలో వైద్య, పోలీసు శాఖల నిర్లక్ష్యంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రక్షణ సేన జహీరాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ నెమలికొండ వేణుమాధవ్ డిమాండ్ చేశారు .

కోహీర్ మండలం ఖానాపూర్‌లో జిల్లా నాయకులు జానమ్మ కృష్ణారెడ్డి నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రమాదంలో మృతి చెందిన వారి మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించేందుకు జహీరాబాద్ ఏరియా ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో కుటుంబ సభ్యులు గంటల తరబడి ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. అత్యవసర సమయంలో ప్రభుత్వ ఆసుపత్రిలో డ్యూటీ వైద్యులు, సంబంధిత అధికారులు అందుబాటులో లేకపోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

"ప్రజల ప్రాణాలకు విలువ లేదా?" అని వేణుమాధవ్ ప్రశ్నించారు. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలోనే ప్రభుత్వ ఆసుపత్రిలో ఇటువంటి పరిస్థితులు నెలకొనడం దురదృష్టకరమన్నారు. ఆసుపత్రిలో వైద్యుల కొరత, అత్యవసర సేవల నిర్వహణపై ఉన్నతాధికారులు వెంటనే దృష్టి సారించాలని కోరారు. అదేవిధంగా సజ్జాపూర్ రోడ్డు ప్రమాద ఘటనలో పోలీసుల వ్యవహారశైలిపై కూడా బాధిత కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయని తెలిపారు. కేసు నమోదు, దర్యాప్తు విషయంలో నిర్లక్ష్యం జరిగి ఉంటే ఉన్నతాధికారులు వెంటనే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు తగిన నష్టపరిహారం ఇప్పించాలని, ప్రభుత్వం తరఫున కూడా ఆర్థిక సహాయం అందించాలని కోరారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు వారి తరఫున పోరాటం కొనసాగిస్తామని వేణుమాధవ్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా నాయకులు మద్ది శ్రీనివాస్‌రెడ్డి, శంకర్ నాయక్, జానమ్మ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద చింతరేవులలో శాస్త్రోక్తంగా రక్షాబంధన్ వేడుకలు

- పాలిమర్ పీఠాధిపతులచే వరమహాలక్ష్మి వ్రతం....
- వేద పండితులచే యజుర్వేద ఉపకర్మ హోమ పూజలు...
- పీఠాధిపతులచే రామాయణ,భాగవత ప్రవచనాలు...

**ధరూర్ ఆగస్టు 28 (వుదయం కరస్పాండెంట్)**

జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల పరిధిలోని 15వ శతాబ్దంలో వ్యాసరాయుల వారిచే ప్రతిష్టింపబడి నేటికీ పూజలు అందుకుంటున్న ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రావణ పౌర్ణమి నాడు పీఠాధిపతులు శ్రీ 1008 శ్రీ విద్యా దీశ శ్రీపాదలవారు ఆంజనేయ స్వామి వారికి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్యా చక్రవర్తి కేశవాచార్యులు తెలిపారు. పెద్ద చింతరేవుల అన్న ప్రసాద భవనంలో ఉడిపి పాలిమర్ పీఠాధిపతులు శ్రీ 1008 శ్రీ



విద్యాదిశ శ్రీపాదలవారు, శ్రీ 1008శ్రీ విద్యా రాజేశ్వర శ్రీపాదల వారిచే మూల రాముల వారికి వేద యుక్తంగా ప్రత్యేక పూజలు ఉడిపి వేద పండితులచే నిర్వహించారు. కర్ణాటక, తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులందరికీ పీఠాధిపతులు ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం పెద్ద చింతరేవుల ఆంజనేయస్వామి అన్నప్రసాద ట్రస్ట్ వారిచే భక్తులందరికీ అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ఆధ్య వామనాచారి, ఆద్య కిష్టాచారి, ఆద్య మద్వాచారి, దేవాలయ చైర్మన్ గిరి రావు, భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సీసీ కెమెరాల సాయంతో పోగొట్టుకున్న బంగారం గుర్తింపు

- పుల్కాల్ ఎస్ఐ విశ్వజన్

**పుల్కల్ న్యూస్ :**

ఆటోలో ప్రయాణిస్తుండగా పోగొట్టుకున్న బంగారు నగలు, నగదు, మొబైల్ ఫోన్‌ను సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా పోలీసులు గుర్తించి బాధితుడికి అప్పగించారు.

పుల్కల్ మండలం గొంగ్లూరు గిరిజన తండాకు చెందిన పోస్టుమ్యాన్ రమావత్ అమర్‌సింగ్ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం ఆటోలో ప్రయాణిస్తుండగా, సుమారు 15 తులాల బంగారు నగలు, రూ.15 వేల నగదు, మొబైల్ ఫోన్ ఉన్న బ్యాగ్ రోడ్డుపై పడిపోయింది. ఈ విషయమై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు గంగోజిపేట, తాడ్డానిపల్లి పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించారు.పుటేజీల ఆధారంగా ఇషోజిపేట గ్రామానికి చెందిన ఇద్దరు యువకులకు బంగారు నగలు దొరికినట్లు పోలీసులు గుర్తించారు. వారిని సంప్రదించి పోయిన



బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఎస్సై నల్లా విశ్వజన్ బాధితుడు అమర్‌సింగ్‌కు బంగారు నగలను అప్పగించారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్సై విశ్వజన్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని గ్రామ సర్పంచ్‌లను కోరారు. సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాల నియంత్రణతో పాటు తప్పిపోయిన వస్తువులు, వ్యక్తుల ఆచూకీ గుర్తించడంలో కూడా ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.

## జర్నలిస్టు శేరుపల్లి నరేష్ కు సన్మానం



- జర్నలిస్టు వృత్తిలో 19 ఏళ్లుగా అంకితభావంతో సేవలు
- ఘనంగా సన్మానించిన ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య
- ప్రజా సమస్యల పరిష్కారానికి నరేష్ చేస్తున్న కృషి అభినందనీయం

**మిరుదొడ్డి, ఆగస్టు 28, వుదయం :**

జర్నలిస్టు వృత్తిలో అంకితభావంతో 19 సంవత్సరాలుగా సేవలందిస్తున్న సీనియర్ జర్నలిస్టు శేరుపల్లి నరేష్ ను రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య శాలువాతో సన్మానించారు. శుక్రవారం అక్బర్ పేటభూంపల్లి మండల కేంద్రంలోని బక్కి వెంకటయ్య స్వగృహంలో ఈ సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ, పేద ప్రజల పక్షాన గొంతుకగా ఉంటూ ప్రభుత్వానికి సమస్యలను తెలియజేయడంలో జర్నలిస్టు నరేష్ ముందుంటారని కొనియాడారు. ప్రతి జర్నలిస్టు ఆదర్శంగా ఉంటూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలవాలని సూచించారు. నిస్వార్థంగా పనిచేసే జర్నలిస్టులకు ప్రజల అండదండలు ఎల్లవేళలా ఉంటాయని తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో దుబ్బాక, మిరుదొడ్డి, అక్బర్ పేటభూంపల్లి మండల చెందిన ప్రజాప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.



## అన్నాచెల్లెళ్ల అనుబంధం
# ప్రేమ, నమ్మకం, రక్షణకు ప్రతీక

- **సోదర సమానులైన సీనియర్ నాయకులకు రాఖీలు కట్టిన మాజీ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్**

**ముషీరాబాద్, ఆగస్టు 28 (వుదయం):** అన్నాచెల్లెళ్ల అనుబంధం కేవలం రక్త సంబంధానికే పరిమితం కాదని, ప్రేమ, నమ్మకం, పరస్పర రక్షణకు ప్రతీకగా నిలిచే ప్రపంచంలోని అత్యంత స్వచ్ఛమైన బంధమని గాంధీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఎ. పావని వినయ్ కుమార్ అన్నారు.శుక్రవారం రాఖీ పౌర్ణిమ సందర్భంగా గాంధీనగర్ డివిజన్‌లోని సోదర సమానులైన సీనియర్ నాయకులకు ఆమె రాఖీలు కట్టి రాఖీ పౌర్ణిమ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "నీవు నాకు రక్ష.. నేను నీకు రక్ష.. మనం దేశానికి, ధర్మానికి రక్ష" అనే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ పరస్పర ప్రేమాభిమానాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.రాఖీ పౌర్ణిమ సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో జరిగింది. అన్నాచెల్లెళ్ల అనుబంధం, దేశం మరియు ధర్మం పట్ల బాధ్యతను గుర్తుచేస్తూ నాయకులు, కార్యకర్తలు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ శ్రీ ఎ. వినయ్ కుమార్, సీనియర్ నాయకులు మొహమ్మద్ మహమూద్, రత్న సాయి చంద్, ఎం. ఉమేష్, రవిమన్యు, యాదగిరి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# మహాధర్నా విజయవంతం
# ఉద్యోగులకు ఉద్యమ అభినందనలు

- **9 వేల మందితో ఇందిరాపార్క్ వద్ద భారీ నిరసన – ఐక్యతతో హక్కుల సాధనకు ఉద్యమం కొనసాగిస్తాం**

**ముషీరాబాద్,ఆగస్టు 28(వుదయం)**



TGEJAC రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు ఈ నెల 27న హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌లో నిర్వహించిన భారీ మహాధర్నాను విజయవంతం చేసిన ఉద్యోగులు, అధికారులు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, పెన్షనర్లకు TGEJAC నాయకత్వం హృదయపూర్వక ఉద్యమ అభినందనలు, కృతజ్ఞతలు తెలిపింది.హైదరాబాద్ నగరంతో పాటు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నలుమూలల నుంచి ఉద్యోగులు, అధికారులు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సుమారు 9,000 మంది ఉద్యోగులు, పెన్షనర్లు పాల్గొని మహాధర్నాను విజయవంతం చేశారని నాయకులు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన ఈ మహాధర్నా ప్రభుత్వం దృష్టిని ఆకర్షించేలా విజయవంతమైందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా TGEJAC హైదరాబాద్ సిటీ చైర్మన్ కట్కూరి శ్రీకాంత్, హైద రాబాద్ జిల్లా చైర్మన్ విక్రమ్, రంగారెడ్డి జిల్లా చైర్మన్ వూటు యశ్వంత్, హైదరాబాద్ సిటీ కన్వీనర్ డా. G. గందూరి వెంకటేష్, జిల్లా కన్వీనర్ MB. కృష్ణ యాదవ్, రంగారెడ్డి జిల్లా కన్వీనర్ డా. K. రామారావు పాల్గొన్న ఉద్యోగులు, అధికారులు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఐక్యంగా ముందుకు సాగాలని, సమస్యలు పరిష్కారమయ్యే వరకు ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు."ఉద్యోగుల ఐక్యతే మన బలం.. న్యాయమైన డిమాండ్ల సాధనే మన లక్ష్యం. హక్కుల కోసం జరిగే ప్రతి పోరాటంలో ఉద్యోగులంతా ఐక్యంగా ముందుకు సాగాలి" అని TGEJAC నాయకులు పిలుపునిచ్చారు.

# అన్నదమ్ములకు రాఖీ కట్టిన అడ్వకేట్ గాజుల సంగీత

- **తెలంగాణ ప్రజలందరికీ రక్షాబంధన్ శుభాకాంక్షలు**

**ముషీరాబాద్, ఆగస్టు 28(వుదయం)**



రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని అడ్వకేట్ గాజుల సంగీత తన అన్నదమ్ములు రాజేష్, శరణ్ కు రాఖీ కట్టి రక్షాబంధన్ వేడుకలను కుటుంబ సభ్యుల మధ్య ఆనందంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదమ్ముల మధ్య ఉన్న ఆత్మీయ అనుబంధం, ప్రేమానురాగాలకు ప్రతీకగా రాఖీ పండుగ నిలుస్తుందని ఆమె పేర్కొన్నారు.ఈ రక్షాబంధన్ సందర్భంగా అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్లు పరస్పరం ప్రేమ, ఆప్యాయతలను పంచుకోవడం భారతీయ సంస్కృతిలో ఎంతో ప్రత్యేకమైన సంప్రదాయమని అడ్వకేట్ గాజుల సంగీత అన్నారు. కుటుంబ సభ్యులంతా కలిసి పండుగను సంతోషంగా జరుపుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ రక్షాబంధన్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ప్రేమానురాగాలు వెల్లివిరియాలని, అన్నాచెల్లెళ్ల బంధం మరింత బలపడాలని ఆకాంక్షించారు.రక్షాబంధన్ పండుగ కేవలం రాఖీ కట్టుకునే సంప్రదాయం మాత్రమే కాకుండా, కుటుంబ బంధాలను, పరస్పర నమ్మకాన్ని, ఆప్యాయతను గుర్తుచేసే పవిత్రమైన పండుగ అని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు సభ్యులు రమ్య , అశిణి, చిన్ను, చిన్నారులు పాల్గొన్నారు.

# ఘనంగా శంకర్‌పల్లి ఏఎంసీ మాజీ చైర్మన్ సభావత్ రాజు నాయక్ జన్మదిన వేడుకలు

- **మోకిలలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు, అభిమానులు**

**శంకర్‌పల్లి, ఆగస్టు 28 (వుదయం)**



శంకర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సభావత్ రాజు నాయక్ జన్మదిన వేడుకలను శుక్రవారం శంకర్ పల్లి మండలంలోని మోకిలలో నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సభావత్ రాజు నాయక్ కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఆయనకు పలువురు నాయకులు, అభిమానులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. రాజు నాయక్‌తో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ పలువురు నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం సందర్భంగా కేక్ కట్ చేసి ఒకరికొకరు మిఠాయిలు పంచుకున్నారు. మోకిలలో జరిగిన ఈ వేడుకలు సందడిగా కొనసాగింది.జన్మదిన వేడుకల సందర్భంగా సభావత్ రాజు నాయక్‌కు శుభాకాంక్షలు తెలిపేందుకు పలువురు నాయకులు, సన్నిహితులు, అభిమానులు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయన సహోదరుడు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సభావత్ రాజా నాయక్ పాల్గొని రాజు నాయక్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కైలాష్, నయీమ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొని కేక్ కట్ చేసి వేడుకల్లో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా రాజు నాయక్‌తో కలిసి పనిచేసిన నాయకులు, అభిమానులు ఆయన సేవలను గుర్తుచేసుకుంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సభావత్ రాజు నాయక్ కృతజ్ఞతలు తెలిపారు. దీంతో మోకిలలో జరిగిన జన్మదిన వేడుకలు ఉత్సాహంగా, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా ముగిశాయి.

# రాజరాజేశ్వరి స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు





- **అన్నదాన కార్యక్రమం నిర్వహించిన కౌన్సిలర్ అశోక్ ...**

**శంకర్ పల్లి ఆగస్టు 28 (వుదయం)**

శంకర్ పల్లి మండల కేంద్రంలోనీ (చిన్న శంకర్ పల్లి) లో కొలువు దీరిన శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం లో,13 వ వార్డు కౌన్సిలర్ చాకలి అశోక్ స్వామి వారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కౌన్సిలర్ అశోక్ మాట్లాడుతూ శంకర్ పల్లి మండల ప్రజలకు , రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు మరియు కమిటి సభ్యులు అశోక్ గారిని స్వామి వారి శేష వస్త్రం తో సన్మానించి చిత్ర పటం బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, భజన భక్తులు, తదితరులు పాల్గొన్నారు

# రాఖీ పౌర్ణమి ని ఘనంగా నిర్వహించిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు మిరియాల రాఘవరావు

**శేర్లింగంపల్లి ఆగస్టు 28 (వుదయం):**



శేర్లింగంపల్లి శేర్లింగంపల్లి నియోజకవర్గంలోని చందానగర్ లో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మిర్యాల రాఘవరావు మరియు యువ నాయకులు మిరియాల ప్రీతం ఆధ్వర్యంలో రాఖీ పౌర్ణమి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు మిరియాల రాఘవరావు మాట్లాడుతూ కుటుంబ సభ్యులందరూ కలిసి జరుపుకునే గొప్ప సాంప్రదాయ పండుగని ఆయన తెలిపారు. ఆడపిల్లలు తమ అన్నల రక్షణ కోసం మరియు ఆరోగ్యం కోసం కట్టే రక్షాబంధనమే ఈ రాఖీ పౌర్ణమి అని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అందరం ఆడబడుచులను గౌరవించుకోవాలని వారి ఆశీర్వచనాలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా పార్టీ ఆఫీసుకు వచ్చిన మహిళ నాయకురాళ్లతో కలసి మిరియాల రాఘవరావు మరియు మిర్యాల ప్రీతం రాఖీ పౌర్ణమిని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో రజిని, కుమారి తులసి, ధనలక్ష్మి, మరియు బ్రహ్మకుమారి సమాజం సిస్టర్స్ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ద్విపడక గదుల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలి

- **జిల్లా కలెక్టర్ కె. హైమావతి**

**సిద్దిపేట, ఆగస్టు 28 (వుదయం బ్యూరో)**



జిల్లాలో నిర్మాణంలో ఉన్న రెండు పడక గదుల (డబుల్ బెడ్‌రూమ్) ఇండ్ల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో గృహనిర్మాణ, వివిధ ఇంజనీరింగ్ శాఖల అధికారులతో కలెక్టర్ సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ఇండ్ల నిర్మాణాలపై కాంట్రాక్టర్లతో మాట్లాడి పనులను త్వరగా ముగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన పేమెంట్లను కూడా సకాలంలో అందించేలా చూడాలని తెలిపారు. నిర్మాణం పూర్తయిన ప్రాంతాల్లో వెంటనే గ్రామసభలు నిర్వహించి, అర్హులైన అసలైన లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేసి ఇండ్లను ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. లబ్ధిదారులకు అందించే ఇండ్లకు ఎలాంటి తాగునీటి సమస్య లేకుండా చూడటంతో పాటు విద్యుత్ సదుపాయం,

సీసీ రోడ్లు, సెప్టిక్ ట్యాంకుల నిర్మాణం వంటి అన్ని మౌలిక వసతులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. గృహ నిర్మాణ శాఖ, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇతర ఇంజనీరింగ్ విభాగాల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి లక్ష్యాలను పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ భగవంత్ రావు, పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాస్, టీఎస్ఈడబ్ల్యూఐడీసీ ఈఈ శ్రీనివాస్ రెడ్డి, ఆర్అండ్ బి డీఈలు, ఏఈలు మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రాఖి పౌర్ణమి రోజు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కు రాఖి కట్టి ఆశీర్వదం తీసుకున్న

- **సోదరీమణులు బియ్యాల నళిని దేవి , తక్కేళపల్లి వారిజా**

**పర్వతగిరి , ఆగష్టు 28 ( వుదయం ప్రతినిధి ):**



అన్నాచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధానికి, ప్రేమకు ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి పర్వదినం సందర్భంగా హైదరాబాద్ లోని వారి నివాసం లో మాజీ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు గారికి ఆయన సోదరీమణులు శ్రీమతి బియ్యాల నళిని దేవి , తక్కేళపల్లి వారిజా రాఖీ కట్టి ఆశీర్వాదాలు అందించారు.

ఈ సందర్భంగా మాజీ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ..అన్నాచెల్లెళ్ల అనురాగం, ఆత్మీయత, అనుబంధం ఎల్లప్పుడూ ఇలాగే చిరస్థాయిగా ఉండాలని అన్నాచెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల ఆత్మీయ అనుబంధానికి, ప్రేమానురాగాలకు ప్రతీక "రాఖీ పౌర్ణమి" సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. తోబుట్టువుల మధ్య ప్రేమ, నమ్మకం, జీవితాంతం నిలవాలనే వాగ్దానానికి ప్రతీకగా ఈ పండుగ నిలుస్తుందని పేర్కొన్నారు. కుటుంబంలో మధుర జ్ఞాపకాలను గుర్తుచేస్తూ బంధాల విలువను చాటిచెప్పే శుభదినం ప్రతి ఇంటా ఆనందాన్ని ఆత్మీయతను నింపాలని కోరుకున్నారు. ఈ పవిత్రమైన రాఖీ బంధం పౌరులందరి జీవితాల్లో ప్రేమ, ఐక్యత, సామరస్యాన్ని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.కోరుకున్న అన్నాచెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల ఆత్మీయ అనుబంధానికి, ప్రేమానురాగాలకు ప్రతీక "రాఖీ పౌర్ణమి" సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. తోబుట్టువుల మధ్య ప్రేమ, నమ్మకం, జీవితాంతం నిలవాలనే వాగ్దానానికి ప్రతీకగా ఈ పండుగ నిలుస్తుందని పేర్కొన్నారు.

ఈ పవిత్రమైన రాఖీ బంధం పౌరులందరి జీవితాల్లో ప్రేమ, ఐక్యత, సామరస్యాన్ని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.టూ...అన్నాచెల్లెళ్ల ప్రేమానుబంధానికి ప్రతీక రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపినారు.

# చేయూత పింఛన్ల దరఖాస్తులకు
# ఆగస్టు 31 ఆఖరు తేదీ జిల్లా కలెక్టర్ కె. హైమావతి



**సిద్దిపేట, ఆగస్టు 28 (వుదయం బ్యూరో)**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'చేయూత' పథకం కింద కొత్త సామాజిక భద్రతా పింఛన్లకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 31వ తేదీయే చివరి రోజని, అర్హులైన ప్రజలందరూ త్వరితగతిన అప్లై చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి తెలిపారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 'చేయూత సామాజిక భద్రత కొత్త పెన్షన్ల మంజూరు 2026' ప్రచార పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..

సమాజంలోని వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత మరియు చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులు, తీవ్ర అనారోగ్యంతో ఉన్న దివ్యాంగులకు ఆర్థిక చేయూత అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కొత్త పింఛన్లను మంజూరు చేస్తోందన్నారు. అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 31 వరకు మాత్రమే గడువు ఉందని వెల్లడించారు.

ఆన్‌లైన్‌లో పూర్తి చేసిన దరఖాస్తుల కాపీలను గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శి లేదా ఎంపీడీవో కార్యాలయంలో, పట్టణ ప్రాంతాల్లో వార్డు అధికారులు లేదా మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో సమర్పించాలని స్పష్టం చేశారు. గడువు ముగిసేలోగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జ్ డీఆర్డీఓ రమేష్, అడిషనల్ డీఆర్డీఏ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లతో
# పేదల సొంతింటి కల సాకారం



- **నూతన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన :చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య**

**చేవెళ్ల,ఆగస్టు28(వుదయం)**



పేద, నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు.చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రాహీంపల్లి 11వ వార్డులో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ఎమ్మెల్యే కాలే యాదయ్య శుక్రవారం ప్రారంభించారు.బ్యాగరి వరలక్ష్మి-బ్యాగరి సత్యం నూతన గృహానికి ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. సొంత ఇల్లు నిర్మించుకోవడం ప్రతి కుటుంబానికి జీవితంలో సంతోషకరమైన సందర్భమని ఎమ్మెల్యే అన్నారు.బ్యాగరి వరలక్ష్మి-బ్యాగరి సత్యం నూతన గృహంలో సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం కావడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే కాలే యాదయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, వార్డు ప్రజలు,కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# అక్క తమ్ముల ప్రేమకు నిదర్శనం రాఖీ పండుగ

**కోహీర్ ఆగస్టు 28 (వుదయం ప్రతినిధి )**


కోహీర్ మండలం లో రాఖీ వేడుకలు అత్యంత , ఉల్లాసంగా జరిగాయి. అన్నాతమ్ముళ్లు, అక్కాచెల్లెళ్ల మధ్య ఉన్న పవిత్రమైన బంధానికి, అనురాగానికి ఈ పండుగ ప్రతీకగా నిలిచింది . ఉదయం నుండే ఇళ్లలో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు, యువతులు తమ సోదరుల కోసం రంగురంగుల రాఖీలను, మిఠాయిలను సిద్ధం చేసుకున్నారు. సోదరుల నుదుట తిలకం దిద్ది, హారతి ఇచ్చి, కుడి చేతికి రాఖీలు కట్టారు. రాఖీ కట్టిన అనంతరం సోదరుల ఆశీస్సులు తీసుకుని, మిఠాయిలు తినిపించారు. సోదరులు తమ అక్కాచెల్లెళ్లకు కానుకలు సమర్పించి, వారిని ఎల్లప్పుడూ రక్షిస్తామని వాగ్దానం చేశారు. గ్రామాలు, పట్టణాలు అన్న తేడా లేకుండా అన్ని చోట్లా ఈ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యంగా పాఠశాలల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థినులు తమ తోటి విద్యార్థులకు రాఖీలు కట్టి సోదర భావాన్ని చాటారు. చాలా చోట్ల బహిరంగ మైదానాల్లో, పార్కుల్లో కూడా వేడుకలు కనిపించాయి. ఈ సందర్భంగా రంగురంగుల రాఖీలతో విపణులు కళకళలాడాయి. వివిధ రకాల డిజైన్లు, పరిమాణాలలో లభించే రాఖీలను కొనుగోలు చేసి రాఖీలు కట్టారు రాజకీయ నాయకులు, ప్రముఖులు కూడా తమ సోదరీమణులతో రాఖీ పండుగను జరుపుకున్నారు. ప్రజలకు రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ కుటుంబ సభ్యులందరినీ ఒకచోటకు చేర్చి సంతోషాన్ని పంచుకునేలా చేసింది. సోదర సోదరీమణుల మధ్య ఉన్న అనుబంధం



మరింత బలోపేతం కావడానికి ఈ పండుగ దోహద పడుతుంది. సోషల్ మీడియాలో కూడా 'హ్యాపీ రక్షా బంధన్' అనే హ్యాష్‌ట్యాగ్‌లు ట్రెండ్ అయ్యాయి. ప్రజలంతా రాఖీ వేడుకల ఫోటోలను, వీడియోలను షేర్ చేస్తూ తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఇలా మండలం రక్షా బంధన్ వేడుకలు ఎంతో ఆనందోత్సాహాల మధ్య, శాంతియుతంగా జరిగాయి

# అక్కాచెల్లెళ్లతో రాఖీ పండుగ జరుపుకున్న అచ్చంపేట ఎమ్మెల్యే

**అచ్చంపేటఆగస్టు 28: (వుదయం ప్రతినిధి )**



రాఖీ పౌర్ణమి పండుగను అచ్చంపేట ఎమ్మెల్యే తన అక్కాచెల్లెళ్లతో కలిసి ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తన అక్కాచెల్లెళ్లు ఎమ్మెల్యేకు రాఖీ కట్టి, నిండు మనసుతో ఆశీర్వదించారు. అన్నదమ్ముల అనుబంధానికి, ఆప్యాయతకు ప్రతీక అయిన రాఖీ పండుగను ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

అక్కాచెల్లెళ్ల చేత రాఖీ కట్టించుకుంటున్న అచ్చంపేట ఎమ్మెల్యే

# అనారోగ్యంతో బస్టాండ్ వద్ద వ్యక్తి మృతి

**సిద్దిపేట/జగదేవ్‌పూర్, ఆగస్టు 28 (వుదయం ప్రతినిధి)**

తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఓ వ్యక్తి సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండల బస్టాండ్ వద్ద స్పృహ తప్పి ప్రాణాలు కోల్పోయిన విషాదకర సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...

ఇటిక్యాల గ్రామానికి చెందిన శ్రీపతి కనకయ్య (40, తండ్రి: బాలమల్లయ్య) గత కొంతకాలంగా టీబీ, కిడ్నీ వ్యాధి, మధుమేహం (షుగర్), ఫిట్స్ వంటి తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. శుక్రవారం ఉదయం ఆయన ఆరోగ్య పరిస్థితి మరింత విషమించడంతో, మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు ఆయనను జగదేవ్‌పూర్‌కు తీసుకువచ్చారు. ఆయన తీవ్ర అస్వస్థతతో నడవలేని స్థితిలో ఉండటంతో, ఆయన భార్య కళ్యాణి కనకయ్యను బస్టాండ్ ఆవరణలో కూర్చోబెట్టి సహాయం కోసం పక్కకు వెళ్లారు. ఉదయం సుమారు 10:00 గంటల ప్రాంతంలో ఆమె తిరిగి వచ్చేసరికి, కనకయ్యకు తీవ్రమైన ఫిట్స్ వచ్చి కిందపడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు.తన భర్త మరణంపై ఎవరిపైనా ఎటువంటి అనుమానాలు లేవని, దీర్ఘకాలిక అనారోగ్య కారణాల వల్లే ఆయన ప్రాణాలు విడిచారని మృతుడి భార్య కళ్యాణి వెల్లడించారు.

సమాచారం అందుకున్న జగదేవ్‌పూర్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.




ఆ రెండు దేశాలదే కీలక పాత్ర

"పశ్చిమాసియా వివాదాన్ని పరిష్కరించడంలో భారత్, చైనా సాయపడగలవు. ఈ పరిస్థితి నుంచి ట్రంప్ బయటపడాలనుకుంటే.. చైనా, భారత్ కీలక పాత్ర పోషించగలవు. ఎందుకంటే ఇరాన్ నుంచి అత్యధికంగా చమురు, గ్యాస్‌ను ఈ దేశాలే కొనుగోలు చేస్తున్నాయి. ముఖ్యంగా ఇరాన్‌పై చైనా ఎక్కువ ఒత్తిడి తీసుకురాగలదు. బెదిరింపులకు బదులుగా దౌత్యనీతిని అనుసరించేందుకు ట్రంప్ సిద్ధంగా ఉంటే.. ఇది సాధ్యమవుతుంది. వ్యూహాత్మక స్థాయిలో వేసిన తప్పుడు అంచనాలే అమెరికాను ఈ పరిస్థితికి చేర్చాయి.."

-హిల్లరీ క్లింటన్, అమెరికా విదేశాంగశాఖ మాజీ మంత్రి

## వే'మన' పద్యం

**పాము కన్న లేదు పాపిష్టి జీవంబు**
**అట్టి పాము చెప్పినట్లు వినును**
**ఖలుని గుణము మాన్ప ఘనులెవ్వరును లేరు**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**



# సంపాదకీయం

## వేధింపులకు వ్యతిరేకంగా పోరాటం

ప్రపంచవ్యాప్తంగా తమ హక్కుల కోసం ఆందోళనలు చేస్తున్న కార్మికులపై అణిచివేత పెరిగిందని గ్లోబల్ రైట్స్ ఇండెక్స్ (ప్రపంచ హక్కుల సూచిక) తెలిపింది. ప్రభుత్వాలు కార్మికుల హక్కులను రక్షించడంలో విఫలమవుతున్నాయని, పైగా చాలాచోట్ల వారిని అణిచివేస్తున్నాయని 2026 ప్రపంచ హక్కుల సూచిక చెప్తోంది. అంతర్జాతీయ ట్రేడ్ యూనియన్ కాన్ఫడరేషన్ ప్రతి యేటా ఈ నివేదికను విడుదల చేస్తుంది. ఇందులో ప్రపంచ వ్యాప్తంగా కార్మికుల హక్కుల ఉల్లం ఘనలను వివరిస్తుంది. వరుసగా నాలుగో సంవత్సరం కూడా కార్మికుల హక్కుల మరింత దిగజారాయని ఈ నివేదిక తెలిపింది. ఆందోళన కలిగించే అంశాలు ఏమిటంటే? 72శాతం దేశాల్లో కార్మికులకు న్యాయం దొరకడం లేదు. సగం దేశాల్లో యూనియన్ హక్కుల కోసం పోరాడినందుకు కార్మికులను అరెస్టు చేస్తున్నారు లేదా జైల్లో పెడుతున్నారు. అన్ని దేశాల్లో కార్మికుల మాట్లాడే హక్కు, కలిసి సమావేశమయ్యే హక్కుపై దాడులు జరుగుతున్నాయి. కార్మికులపై హింస 6శాతం పెరిగి, 32శాతం దేశాలకు చేరింది. కార్మిక సంఘ నాయకులను అరెస్టు చేయడం, వేధించడం, చంపడం వంటివి పెరి గాయి. కార్మికుల హక్కులు, స్వేచ్ఛల విషయంలో అత్యంత అధ్వాన్నమైన పది దేశాల్లో బెలారస్, ఈక్వెడార్, ఈజిప్ట్, ఎస్వాటిని, మయన్మార్, నైజీరియా, ట్యునీ షియా, టర్కీ ఉన్నాయి. ఈ జాబితాలోకి కొత్తగా అర్జెంటీనా, పనామా కూడా చేరాయి. అమెరికా, గినియాబిస్సావు, ఇజ్రాయెల్, లైబీరియా, ఫిలిప్పీన్స్, మోల్డోవా, జింబాబ్వే దేశాలను "వాచ్ లిస్ట్"లో పెట్టారు. యూరప్, అమెరికా ఖండాల్లో కూడా పరిస్థితి బాగా దిగజారింది. 2014లో ఈ సూచిక మొదలైనప్పటి నుండి ఈ ఏడాది స్కోర్లు అత్యంత తక్కువగా ఉన్నాయి. ఇది ప్రపంచంలో ప్రజాస్వామ్యం, కార్మిక హక్కులు దెబ్బతింటున్నాయని చూపిస్తోంది. ఉపాధ్యాయ సంఘాలపై జరుగుతున్న దాడుల గురించి కూడా ఈ నివేదిక చెప్పింది. "ప్రపంచవ్యాప్తంగా ఉపాధ్యాయులు కేవలం మంచి విద్య, గౌరవం కోసం పోరాడుతున్నందుకు వారి గొంతు నొక్కుతున్నారు, అరెస్టు చేస్తున్నారు, దాడులు చేస్తున్నారు. ఇరాన్ నుండి యెమెన్ వరకు, నేపాల్ నుండి ఎస్వాటిని వరకు ఉపా ధ్యాయులపై కావాలనే దాడులు జరుగుతున్నాయి. ఉపాధ్యాయుల హక్కులు దెబ్బతింటే, అది విద్య హక్కుపై దాడి చేసినట్లే" అని ఎడ్యుకేషన్ ఇంటర్నేషనల్ స్పందించింది .ఎస్వాటినిలో స్వాజి లాండ్ నేషనల్ అసోసియేషన్ ఆఫ్ టీచర్స్ (ఎస్ఎన్ఎటి)పై ప్రభుత్వం నిరంతరం వేధింపులకు పాల్పడుతోంది. ఆ సంఘ అధ్యక్షుడు మ్బోంగ్వా డ్లామినిని ఉద్యోగం నుంచి తీసేశారు. ప్రధాన కార్యదర్శి లాట్ విలకాటిని అరెస్టు చేసి పోలీసులు తీవ్రంగా కొట్టారు. పనామాలో ఎంపియు అనే ఉపాధ్యాయ సంఘం మంచి పింఛను కోసం సమ్మె చేసింది. చర్చలు జరపకుండా ప్రభుత్వం వారిని కొట్టింది, అరెస్టు చేసింది, జీతాలు ఆపేసింది. ఉపాధ్యాయులతో పాటు నిరసనలో పాల్గొన్న అరటి కార్మికులు, గిరిజనులను కూడా వేధించింది. ఇరాన్‌లో చాలా ఏళ్లుగా ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘం నాయకులను (సిసిఐటిటిఎ) లక్ష్యంగా చేసుకుం టోంది. కేవలం తమ హక్కుల కోసం మాట్లాడినందుకు వారిని వేధిస్తోంది, అరెస్టు చేస్తోంది, జైల్లో పెడుతోంది. ఐటియుసి ప్రతినిధి మాట్లాడుతూ "కార్మికుల హక్కుల సమస్య ఇప్పుడు చిన్న విషయం కాదు, అది ప్రజాస్వామ్యా నికే ప్రమాదంగా మారింది. కానీ కార్మికులు, వారి సంఘాలు పోరాడుతూనే ఉన్నాయి. కార్మికుల హక్కుల కోసం పోరాటమే ప్రజాస్వామ్యం కోసం పోరాటం. బలమైన సంఘాలు లేకుండా నిజమైన ప్రజాస్వామ్యం ఉండదు" అన్నారు. మానవ హక్కులు, ప్రజాస్వామ్య సమాజాలకు విద్య ఒక మూల స్తంభం అనే ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ, "ఉపాధ్యాయులను మాట్లాడ నివ్వకుండా, జైల్లో పెడుతూ మీరు ప్రజాస్వామ్యాన్ని నిర్మించలేరు. దాడులకు గురవుతున్న ప్రతి ఉపాధ్యాయుడికి మేము అండగా ఉంటాం. మేము భయపడము. సంఘటితమై, గొంతు విప్పి, న్యాయం కోసం పోరాడుతూనే ఉంటాం. ప్రభుత్వాలు ఉపాధ్యాయ సంఘాలను గౌరవించాలి" అని ఎడ్యుకేషన్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు అన్నారు. "ప్రభుత్వాలు కార్మిక సంఘాల హక్కులను గౌరవించి, సమర్థించాలని, నాణ్యమైన విద్యకు, మరింత న్యాయ మైన సమాజాలకు బలమైన, స్వతంత్ర ఉపాధ్యాయ సంఘాలు అత్యవసరం" అని గుర్తించాలని పిలుపునిచ్చింది. ఈ నిరాశాజనకమైన నేపథ్యంలో, కొన్ని దేశాలు కార్మిక హక్కుల విషయంలో తమ రికార్డును మెరుగుపరుచుకుని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న కార్మికులకు ఒక ఆశాకిరణాన్ని అందించాయి.

ఇది ముఖ్యంగా ఉరుగ్వే విషయంలో నిజం. అక్కడ కొత్త అధ్యక్షుడు యమండూ ఓర్సీ ఒక చరిత్ర ఉపాధ్యాయుడు మరియు ఫెనాపెస్ విద్యా సంఘం మాజీ సభ్యుడు - మరియు అతని ప్రభుత్వం, సమ్మె చేసే హక్కుతో సహా కార్మిక హక్కులను గౌరవించడానికి, అలాగే సామాజిక సంభాషణ, సంప్రదింపులకు ప్రాధాన్యత ఇవ్వడా నికి కట్టుబడి ఉన్నాయి. ఆగష్టు 2025లో, ఫెనాపెస్ ఒక ముఖ్యమైన విజయాన్ని సాధించింది. ఇది గత ప్రభుత్వం నుంచి ట్రేడ్ యూనియన్లపై జరిగిన వేధింపులకు వ్యతిరేకంగా సాగిన సుదీర్ఘ పోరాటానికి ముగింపు పలికింది.

**రచనలు పంపండి**

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# తెలుగు మన అస్తిత్వం, మన భవిష్యత్తు

ఒక మనిషి ప్రపంచాన్ని మొదటిసారి ఏ భాషలో అర్థం చేసుకుంటాడో, అదే అతని అంతరంగ ప్రపంచానికి తొలి ప్రతిరూపం. తల్లి పలికిన మొదటి మాట నుంచి, ఇంటి గడప దాటి సమాజాన్ని చూసే వరకు మనిషి తన అనుభవాలకు అర్థాలను వెతుక్కునేది మాతృభాష ద్వారానే. అందుకే భాష అనేది కేవలం సంభాషణకు ఉపయోగించే సాధనం కాదు; అది ఒక జాతి జ్ఞాపకం, ఒక సమాజపు చైతన్యం, తరతరాల అనుభవ సంపదను మోసుకొచ్చే సజీవ ప్రవాహం.

ఆగస్టు 29న జరుపుకునే తెలుగు భాషా దినోత్సవం మనకు కేవలం ఒక ఉత్సవ సందర్భం మాత్రమే కాదు. మనం మాట్లాడుతున్న తెలుగు గురించి, మారుతున్న కాలంలో మనం కోల్పోతున్న మన భాషా సౌందర్యం గురించి, రాబోయే తరాలకు అందించబోయే భావి తెలుగు గురించి మనల్ని మనం ప్రశ్నించుకునే ఒక ఆత్మపరిశీలన సమయం.

**ప్రపంచాన్ని చూసే తొలి చూపు**

పిల్లవాడు పుట్టిన వెంటనే వ్యాకరణం నేర్చుకోడు, నిఘంటువు చదవడు. తల్లి స్వరంలో వినిపించే భాష ద్వారానే ప్రేమను గుర్తిస్తాడు. ఇంట్లో వినిపించే మాటల ద్వారానే సంబంధాలను, తన చుట్టూ ఉన్న పరిసరాలను అర్థం చేసుకుంటాడు. మాతృభాష మనిషికి నేర్పేది కేవలం పదాలను కాదు; ప్రపంచాన్ని చూడటానికి ఒక దృక్పథాన్ని.అందుకే మాతృభాషను కోల్పోవడం అంటే కొన్ని పదాలను మరచిపోవడం మాత్రమే కాదు. ఒక సమాజం తన అనుభవాలను చెప్పుకునే విధానాన్ని, భావోద్వేగాల సున్నితత్వాన్ని, తన చరిత్రతో ఉన్న అంతరంగ సంబంధాన్ని క్రమంగా కోల్పోవడమే. తెలుగు భాష ఈ నేలలో శతాబ్దాలుగా కేవలం సాహిత్యాన్ని మాత్రమే సృష్టించలేదు. రైతు పొలంలో, కూలీ చెమటలో, జానపద గీతంలో, అమ్మ జోలపాటలో, తత్వవేత్త ఆలోచనలో, కవి ఊహాలో జీవితంలోని అనేక రూపాలకు తన మాటలను ఇచ్చింది. అందుకే తెలుగు ఒక పాఠ్యాంశం కాదు, అది ఒక నాగరికత నిరంతర సంభాషణ.

**గిడుగు వెలిగించిన వ్యావహారిక భాషా దీపం**

తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గిడుగు వెంకట రామమూర్తి పంతులును స్మరించుకోవడం కేవలం ఒక మహనీయునికి అంజలి ఘటించడం కాదు. 'భాష ఎవరి కోసం?' అనే అత్యంత ప్రాథమికమైన ప్రశ్నను గుర్తుచేసుకోవడం.

భాష ప్రజల నోళ్లలో జీవిస్తుంది. ప్రజలకు అర్థం కాని గ్రంథస్థ భాష ఎంత గొప్ప సాహిత్య సంపదను కలిగి ఉన్నప్పటికీ, అది ప్రజా జీవితానికి దూరమైతే తన సజీవత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. వ్యావహారిక భాష కోసం గిడుగు చేసిన పోరాటం వెనుక ఉన్న అసలు తాత్వికత ఇదే భాష పండితుల గదుల్లో బందీగా ఉండకూడదు, అది ప్రజల అనునిత్య జీవితంతో కలిసి నడవాలి. ఈ ఆలోచన నేటి కాలంలో మరింత ప్రాసంగికం.భాషను ప్రేమించడం అంటే దాన్ని కేవలం గతానుభవాల ప్రదర్శనగా గ్రంథాలయాల్లో, మ్యూజియంలలో దాచిపెట్టడం కాదు; కొత్త తరాల ఆలోచనలను, నూతన విజ్ఞానాన్ని, ఆధునిక సాంకేతికతను తనలోకి ఆహ్వానిస్తూ ముందుకు నడిపించే సజీవ శక్తిని భాషకు అందించడం.

**ఇంగ్లీషు అవసరం... తెలుగు అస్తిత్వం**

నేటి ప్రపంచం అవకాశాల మయం. విజ్ఞానం, ఉపాధి, అంతర్జాతీయ సంబంధాల కోసం ఇంగ్లీషు వంటి ప్రపంచ భాషల ప్రాధాన్యాన్ని ఎవరూ తిరస్కరించలేరు. సమస్య ఇతర భాషలను నేర్చుకోవడంలో లేదు; మాతృభాషను వెనుకబాటుతనానికి గుర్తుగా భావించే సామాజిక దృక్పథంలో ఉంది.

ఒక వ్యక్తి అనేక భాషలు నేర్చుకోవచ్చు, నేర్చుకోవాలి కూడా. కానీ తన మాతృభాషను వదులుకుని మాత్రమే ఆధునికుడవుతానని భావించడం ఒక విచిత్రమైన అపోహ. ప్రపంచంతో సంభాషించడానికి మనకు ఇతర భాషలు అవసరం కావచ్చు; కానీ మనతో మనం సంభాషించుకోవడానికి, మన భావాలను లోతుగా ఆవిష్కరించడానికి మాతృభాష తప్పనిసరి. భాషల మధ్య పోటీ ఉండాల్సిన అవసరం లేదు. ఇంగ్లీషు నేర్చుకోవడం తెలుగును కోల్పోవడానికి కారణం కాకూడదు. మన విద్యా వ్యవస్థలో, కుటుంబంలో, సామాజిక జీవితంలో మాతృభాషకు తగిన గౌరవ స్థానాన్ని ఇవ్వడమే నేటి అవసరం.తదుపరి తరంపై తెలుగు భవిష్యత్తు భాష భవిష్యత్తును నిర్ణయించేది ప్రభుత్వ ప్రకటనలో, పెద్ద పెద్ద వేదికలపై చేసే ఉపన్యాసాలో కాదు. ఆ భాషను తదుపరి తరం ఎలా ఉపయోగిస్తుందనేదే అసలు ప్రమాణం.wఇంట్లో పిల్లలతో మనం ఏ భాషలో మాట్లాడుతున్నాం? వారికి తెలుగు చదవడం, రాయడం మాత్రమే కాదు, తెలుగులో స్వతంత్రంగా ఆలోచించే అవకాశం ఇస్తున్నామా? ఆధునిక విజ్ఞానాన్ని తెలుగులో అందించడానికి ప్రయత్నిస్తున్నామా? డిజిటల్ ప్రపంచంలో తెలుగు కోసం కొత్త వేదికలను సృష్టిస్తున్నామా? ఇవే మన ముందున్న అసలైన ప్రశ్నలు.

తెలుగు భవిష్యత్తు కేవలం గ్రంథాలయాల్లో భద్రపరచిన పుస్తకాలకు పరిమితం కాకూడదు. అది మొబైల్ తెరలపై కదలాలి, సాంకేతిక వేదికలపై వెలగాలి, పరిశోధనలోనూ, విజ్ఞాన శాస్త్రంలోనూ జీవించాలి. కొత్త తరాల సృజనాత్మకతకు తెలుగు వేదిక కావాలి.రేపటి అవకాశాలకు తెలుగు వేదిక కావాలితెలుగుపై ప్రేమ ఉంటే కేవలం గతాన్ని కీర్తించడం సరిపోదు. నన్నయ నుంచి గురజాడ వరకు, వేమన నుంచి శ్రీశ్రీ వరకు, తెలుగు భాష ఎన్నో కాలాల మార్పులను తనలో జీర్ణించుకుని నిలిచింది. ప్రతి యుగం తన సవాళ్లను తీసుకొచ్చినప్పుడు, తెలుగు వాటికి తనదైన స్వరాన్ని ఇచ్చింది.ఇప్పుడు మన యుగం కృత్రిమ మేధస్సు (AI), డిజిటల్ సంస్కృతి, ప్రపంచీకరణ వంటి కొత్త ప్రశ్నలతో మన ముందుంది. ఈ మార్పుల మధ్య తెలుగు తన స్థానాన్ని ఎలా నిర్మించుకుంటుందనేదే మన బాధ్యత. తెలుగును గతానికి చెందిన భాషగానే కాకుండా, భవిష్యత్తును వ్యక్తపరచగల సజీవ భాషగా తీర్చిదిద్దాలి.భాషపై ప్రేమ అంటే కేవలం 'తెలుగు తల్లి' అని నినదించడం మాత్రమే కాదు; తెలుగులో మంచి పుస్తకం చదవడం, పిల్లలకు తేలికైన తెలుగు కథలు చెప్పడం, సాంకేతిక విషయాలను తెలుగులో రాయడం, విజ్ఞానాన్ని మాతృభాషలో పంచడం. భాషను కాలానికి తగ్గట్టు మార్చుకుంటూనే దాని ఆత్మను నిలబెట్టుకోవడమే అసలైన భాషా సేవ.



యండి. ఉస్మాన్ ఖాన్
9912580645

## చక్కెర చేదెక్కితే...

చక్కెర ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించిన మన దేశం ఇప్పుడు ముడి చక్కెరను దిగుమతి చేసుకోవాల్సిన దుస్థితికి చేరుకోవడం విచారకరం. కీలకమైన విషయాల్లోనూ కేంద్ర ప్రభుత్వ ప్రణాళిక లేమికి ఇది నిదర్శనం. దేశ వ్యాప్తంగా చక్కెర ధరలు అనూహ్యంగా పెరగడం వంటి పరిణామాలు ప్రజానీకంలో కలకలం రేపాయి. పండగ సీజన్ ప్రారంభంలోనే చక్కెర చేదెక్కడం చర్చనీయాంశంగా మారింది. ధరలను అదుపు చేసే పేరిట తీసుకున్న చర్యలు సత్ఫలితాలు ఇవ్వకపోవడంతో పది లక్షల టన్నుల ముడి చక్కెర దిగుమతి చేసుకోవాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. చక్కెర విషయంలో ఈ తరహా నిర్ణయం తీసుకోవడం పది సంవత్సరాల తరువాత ఇదే మొదటిసారి కావడం గమనార్హం. నిజానికి దేశంలో ఏటా సుమారు 280-290 లక్షల టన్నుల చక్కెర వినియోగమవుతుండగా, సాధారణంగా 320-340 లక్షల టన్నుల ఉత్పత్తి ఉంటుంది. దేశీయ అవసరాలు పోనూ అదనంగా ఉన్న ఉత్పత్తిని విదేశాలకు ఎగుమతి చేస్తారు. 2025-26 సీజన్ ప్రారంభంలో సాధారణం కన్నా ఎక్కువ ఉత్పత్తి ఉంటుందనే అంచనా వేశారు. కానీ వాతావరణ పరిస్థితులు, అధిక వర్షాలు, నీరు నిలిచిపోవడంతో పాటు తెగుళ్ల వ్యాప్తితో ఉత్పత్తి 306 లక్షల టన్నులకు పడిపోయింది. అంటే ప్రారంభ అంచనాతో పోలిస్తే దాదాపు 35 లక్షల టన్నుల ఉత్పత్తి తగ్గింది. ఈ పరిస్థితి స్పష్టమవుతున్నప్పటికీ కేంద్రం చక్కెర ఎగుమతులను ఏ మాత్రం తగ్గించలేదు. పైగా తొలుత 15 లక్షల టన్నుల ఎగుమతికి అనుమతించి, ఆ తరువాత దానిని 20 లక్షల టన్నులకు పెంచింది. ఉత్పత్తి తగ్గుతుందని తెలిసినా, దేశీయ నిల్వలను కాపాడటంలో ఆలస్యం చేసింది. ఫలితంగా జులై 20 నుంచి చక్కెర ధర భారీగా పెరగడం ప్రారంభమైంది. కిలో రూ.48.18 నుంచి 70 రూపాయలకు చేరింది.

ఈ సంక్షోభంలో ఇ20 ఇథనాల్ విధానం కూడా కీలకమైన అంశమే. 2025-26లో చెరకు రసం, సిరప్, బి-హెవీ మొలాసిస్ వంటి ముడిపదార్థాలను ఇథనాల్ ఉత్పత్తికి మళ్లించడం ద్వారా సుమారు 28-30 లక్షల టన్నుల చక్కెరకు సమాన పరిమాణం ఉత్పత్తికి దూరమైంది. ఇది కూడా చక్కెర ఉత్పత్తిపై ప్రభావం చూపింది. చెరకు ఉత్పత్తి తగడం, ఇథనాల్ కోసం వినియోగించడం వంటి అంశాలను ఏమాత్రం పరిగణలోకి తీసుకోకుండా కేంద్ర ప్రభుత్వం చక్కెర ఎగుమతులను కొనసాగించింది.దీంతో ప్రజల వినియోగానికి అవసరమైన చక్కెర అందుబాటులో లేకపోవడంతో ధరలకు రెక్కలు రావడం ప్రారంభమైంది. దీనికి బ్లాక్ మార్కెటింగ్ కూడా తోడు కావడం, పండగ సీజన్ కూడా రావడంతో సామాన్యులు భయపడే పరిస్థితి ఏర్పడింది. చక్కెర ఉత్పత్తి గణనీయంగా తగ్గుతున్న సమయంలో ఇ20 లక్ష్యాలు, దేశీయ చక్కెర అవసరాలు, ఎగుమతులు, కనీస నిల్వలను సమన్వయం చేయడంలో ముందుస్తు ప్రణాళికలే కీలకం. ఈ కీలక అంశాల్లోనే కేంద్రం విఫలం చెందిందన్నది స్పష్టం. అందువల్ల



ప్రస్తుత సంక్షోభాన్ని కేవలం వర్షాలు, తెగుళ్లు, పండుగల డిమాండ్‌కు ఆపాదించి చేతులు దులుపుకోవడం సరికాదు. తగ్గుతున్న ఉత్పత్తికి అనుగుణంగా ఎగుమతులను పునఃసమీక్షించడం, ఇథనాల్‌కు మళ్లింపును అవసరానికి తగ్గట్టుగా నియంత్రించడం, కనీస భద్రతా నిల్వలను కాపాడటం వంటి చర్యలను కేంద్ర ప్రభుత్వం తీసుకోని ఉండాలి. ధరలు పెరుగుతుండటం గమనించి వెనువెంటనే అదుపు చేసే చర్యలు చేపట్టి ఉండాల్సింది. ముఖ్యంగా నిఘా వేసి దొంగ నిల్వలకు మళ్లకుండా చూడాల్సింది. కానీ కేంద్ర ప్రభుత్వం అటువంటి చర్యలేమీ తీసుకోలేదు. పైగా అంతర్జాతీయ మార్కెట్‌లో చక్కెర ధర టన్నుకు 474 డాలర్ల నుంచి 552 డాలర్లకు పెరిగిన సమయంలో దిగుమతులకు వెళ్లాల్సి రావడం వల్ల దేశం అదనంగా ఆర్థిక భారాన్ని మోయవలసి వస్తోంది. ఇదే తరహా విధానాలను కొనసాగిస్తే దేశ ఆహార భద్రతకు సైతం ముప్పు వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా కార్పొరేట్ల కొమ్ము కాయడం మాని, ప్రజలను దృష్టిలో ఉంచుకుని విధానాలను రూపొందించి అమలు చేయాలి.

# వ్యావహారిక బాషకు పితామహుడు గిడుగు రామమూర్తి

తెలుగు వ్యావహారిక బాషకు పితామహుడిగా, అభినవ వాగను శాసనునిగా పేరెన్నిక గన్న గిడుగు రామమూర్తి పంతులు జన్మదినమైన ఆగస్టు 29 ను 'తెలుగు భాషా దినోత్సవము'గా తెలుగు రాష్ట్రాలు పరిగణిస్తున్నాయి. గిడుగు వెంకట రామమూర్తి (18631940) తెలుగు ప్రజలు స్మరించదగ్గ ప్రథమ స్మరణీయుడు గిడుగు రామమూర్తి. ఆధునిక విజ్ఞాన వ్యాప్తికి, వచన రచనకు కావ్యభాష పనికి రాదనీ, సామాన్య జనానికి అర్థమయ్యే సమకాలీన "శిష్టవ్యావహారికం"లో ఉండాలనీ ఆనాటి సాంప్రదాయిక పండితులతో హోరాహోరీగా యుద్ధంచేసి ఆధునిక ప్రమాణ భాషను ప్రతిష్టించటానికి మార్గదర్శకుడైన వాడు గిడుగు రామమూర్తి. గిడుగు వారి వ్యవహారిక భాషోద్యమం వల్ల ఆధునిక సాహిత్యం కొత్త సొగసులు సంతరించుకుంది. రచనావైవిధ్యం, వైశిష్ట్యంతో పుష్టి చేకూరింది. విశ్వ విద్యాలయాలలో వాడుకభాష రాజ్య మేలుతోంది. పత్రికలు ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి. అక్షరాస్యత పెరిగింది. తెలుగు అధికార భాషగా, పరిపాలనా భాషగా కీర్తికెక్కింది. దీనికంతటికీ గిడుగు పిడుగే మూలకారకుడు.

గ్రాంధికభాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకు వచ్చి, నిత్య వ్యవహారం లోని భాషలో ఉన్న అందాన్నీ, వీలునూ తెలియ జెప్పిన మహనీయుడు. ఆంధ్ర దేశంలో వ్యావహారిక భాషోద్యమానికి మూల పురుషుడు. బహుభాషా శాస్త్రవేత్త, చరిత్రకారుడు, సంఘసంస్కర్త, హేతువాది. శిష్టజన వ్యవహారిక భాషను గ్రంథరచనకు స్వీకరింప జేయడానికి చిత్తశుద్ధితో కృషిచేసిన అచ్చ తెలుగు చిచ్చర పిడుగు గిడుగు. గిడుగు ఉద్యమంవల్ల ఏ కొద్దిమందికో పరిమితమైన చదువు వ్యావహారిక భాషలో సాగి, అందరికీ అందుబాటు లోకి వచ్చింది. పండితులకే పరిమితమైన సాహిత్య సృష్టి, సృజనాత్మకశక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ వీలైంది. తెలుగు భాష గురించి ఆధునిక పద్ధతిలో ఆలోచించిన తొలి భాషా విజ్ఞాని గిడుగు రామమూర్తి. ఈ వాడుక భాషా వాదాన్ని చేపట్టినందుకు గిడుగువారు పండితులతో యుద్ధం చేయవలసి వచ్చింది. దీన్ని గ్రామ్య వాదమనీ, గిడుగు వారు గ్రామాచార్యులనీ గ్రాంధికవాదులు హేళన చేస్తూ పద్యాలూ, వ్యాసాలు రాశారు. జయంతి రామయ్య పంతులు, కాశీభట్ట బ్రహ్మయ్య శాస్త్రి, వేదం వెంకటరామ శాస్త్రి, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి మొదలైన వాళ్ళతో ఢీకొనవలసి వచ్చింది. ఆంధ్రసాహిత్య పరిషత్తు గ్రాంధిక భాషా వాదానికి అండగ నిలిచింది. గిడుగువారు 'తెలుగు' పత్రిక ద్వారా గ్రాంధిక వాదాన్ని ఖండిస్తూ వ్యావహారిక వాదాన్ని బల పరిచారు. పండితులే తప్పులు లేకుండా రాయలేని గ్రాంధికం బలవంతాన రుద్దడం ఎందుకంటూ "ఆంధ్ర పండిత బిషక్కుల భాషా భేషజం" అనే పుస్తకం ప్రచురించారు.




తెలుగు సాహిత్యంపై పండితుల గుత్తాధి కారాన్ని పోగొట్టాడు. ప్రజలలో ఒక్కరు కూడా నిరక్షరాస్యులు కాకూడదని, అందుకు వాడుక భాషసాధనం కానీ... గ్రాంధికమని తమకే రాని, తమకే తెలియని, భాషను పిల్లలు ఉపయోగించాలనీ అందులోనే పుస్తకాలు రాయాలనీ, దానిలోనే పాఠ్య పుస్తకాలుండాలని శాసించడం అవివేకమని ఉద్యమించారు. చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి, తాతా సుబ్బరాయుడు శాస్త్రి వంటి ఉద్దండ పండితులే ఆయన వాదంలోని సబబు గుర్తించారు. బల పరచారు. కుండలాల, శాలువాల పండితుల సాహిత్యాధికారం, అసంబద్ధమైన వ్యాకరణ, ఛందశ్శాస్త్ర దండనాధికారం చెల్లదన్నాడు.

సాహిత్య ఫ్యూడల్ సంప్రదాయాన్ని ధిక్కరించి, నిరాకరించి నిర్మూలించి ప్రజాస్వామ్య పద్ధతిని తెలుగు సాహిత్యంలో ప్రతిష్ఠించాడు.

తప్పు ఒప్పులు నిర్ణయించే అధికారం ఎవరికీ లేదన్నాడాయన.

భాషకైనా, మనిషికైనా మార్పు కూర్పు చేర్పు సహజమని బోధించాడు, నచ్చచెప్పాడు.

వ్యావహారిక భాషోద్యమం

తెలుగు భాషలో వచ్చిన చారిత్రాత్మకమైన మార్పుకు ప్రధాన కారణం గిడుగు రామమూర్తి సారధ్యంలో నడిచిన వ్యావహారిక భాష ఉద్యమం లేదా వ్యావహారిక భాషోద్యమం. ఇది 20వ శతాబ్దపు పూర్వార్ధంలో ప్రాచీనమైన గ్రాంథిక భాషకు మరియు వ్యావహారిక లేదా వాడుక భాషకు మధ్య జరిగిన భాషా ఉద్యమం. పూర్వం తెలుగులో పాఠ్యాంశాలు అన్నీ గ్రాంధిక బాషలోనే ఉండేవి. 1907లో ఉత్తర కోస్తా జిల్లాలకు పాఠశాలాల ఇన్స్పెక్టర్‌గా వచ్చిన జె.ఎ.యేట్స్ అనే బ్రిటీష్ అధికారి ప్రజలు వ్యవహరించే భాష, పుస్తకాల భాష మధ్య ఉన్న తేడాలు చూసి ఆవేదన చెందారు. ఆయన అదే విషయాన్ని గిడుగుతో చర్చించారు. ఆ విధంగా గిడుగు జీవిత ఉత్తరార్థంలో ఈ విషయాన్ని గురించి గాఢంగా ఆలోచించి తెలుగు విద్యా విధానంలో అన్యాయం జరుగుతున్నదని గుర్తించాడు. గురజాడ, గిడుగులు, శ్రీనివాస అయ్యంగారు, యేట్సు —— ఈ నలుగురి ఆలోచనల వల్ల వ్యావహారిక భాషోద్యమం ఆరంభమైంది. 191920ల మధ్య వ్యావహారిక భాషోద్యమ ప్రచారం కొరకు 'తెలుగు' అనే మాసపత్రిక నడిపాడు. వ్యవహారిక భాషను ప్రతిఘటించిన ఆంధ్ర సాహిత్య పరిషత్తు సభలో (1925, తణుకులో) నాలుగు గంటలపాటు ప్రసంగించి గ్రంథాల్లోని ప్రయోగాల్ని ఎత్తి చూపి తన వాదానికి అనుకూలంగా సమితిని తీర్మానింప జేసాడు "గిడుగు". సాహితీ సమితి, నవ్య సాహిత్య పరిషత్తు మొదలైన సంస్థలు కూడా గిడుగు వాదాన్ని బలపరచాయి. స్కూలు కాలేజీ పుస్తకాల్లో గ్రాంధికభాషే పాతుకు పోయింది; కొన్నిటిలో వీరేశలింగంగారు ప్రతిపాదించిన సరళ గ్రాంధికం కూడా వచ్చింది. గిడుగు రామమూర్తి ఊరూరా ఉపన్యాసాలిస్తూ గ్రాంధికంలో ఏ రచయితా నిర్దిష్టంగా రాయలేడని నిరూపించాడు. 1919లో గిడుగు "తెలుగు" అనే మాసపత్రికను స్థాపించి తన శాస్త్రీయ వ్యాసాలతో, ఉపన్యాస పాఠాలతో అవిశ్రాంతంగా పోరాటం సాగించాడు. కాని ఆ పత్రిక ఒక ఏడాది మాత్రమే నడిచింది. చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి, తల్లావఝ్ఝల శివశంకరశాస్త్రి, కందుకూరి వీరేశలింగం, పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి, వఝ్ఝల చిన సీతారామశాస్త్రి మొదలైన కవులు, పండితులు వ్యావహారిక భాషావాదం వైపు మొగ్గు చూపారు. 1919 ఫిబ్రవరి 28న రాజమహేంద్ర వరంలో కందుకూరి వీరేశలింగం అధ్యక్షులుగా, గిడుగు కార్యదర్శిగా "వర్తమానాంధ్ర భాషా ప్రవర్తక సమాజం" స్థాపించారు.

1924లో కాకినాడలోని ఆంధ్ర సాహిత్య పరిషత్తు అధికారికంగా వ్యావహారిక భాషా నిషేధాన్ని ఎత్తివేసింది. 1933లో గిడుగు రామమూర్తి సప్తతి మహోత్సవం ఆయన అభిమానులు, శిష్యులు రాజమహేంద్ర వరంలో బ్రహ్మాండంగా జరిపారు. తెలికచెర్ల వెంకటరత్నం సంపాదకుడుగా ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన 46 పరిశోధక వ్యాసాలతో వ్యాస సంగ్రహం అనే ఉద్గ్రంథాన్ని ఆయనకు సమర్పించారు. 1936 లో నవ్యసాహిత్య పరిషత్తు అనే సంస్థను ఆధునికులు స్థాపించి సృజనాత్మక రచనల్లో శిష్ట వ్యావహారికాన్ని ప్రోత్సహించే "ప్రతిభ" అనే సాహిత్యపత్రికను ప్రచురించారు. 1937లో తాపీ ధర్మారావు సంపాదకులుగా "జనవాణి" అనే పత్రిక కేవలం ఆధునిక ప్రమాణ భాషలోనే వార్తలు, సంపాదకీయాలు రాయటం మొదలు పెట్టింది.

తెలుగు భాషలో వచ్చిన చారిత్రాత్మకమైన మార్పుకు ప్రధాన కారణం గిడుగు రామమూర్తి సారధ్యంలో నడిచిన వ్యావహారిక భాష ఉద్యమం లేదా వ్యావహారిక భాషోద్యమం. ఇది 20వ శతాబ్దపు పూర్వార్ధంలో ప్రాచీనమైన గ్రాంథిక భాషకు మరియు వ్యావహారిక లేదా వాడుక భాషకు మధ్య జరిగిన భాషా ఉద్యమం. పూర్వం తెలుగులో పాఠ్యాంశాలు అన్నీ గ్రాంధిక బాషలోనే ఉండేవి. 1907లో ఉత్తర కోస్తా జిల్లాలకు పాఠశాలాల ఇన్స్పెక్టర్‌గా వచ్చిన జె.ఎ.యేట్స్ అనే బ్రిటీష్ అధికారి ప్రజలు వ్యవహరించే భాష, పుస్తకాల భాష మధ్య ఉన్న తేడాలు చూసి ఆవేదన చెందారు. ఆయన అదే విషయాన్ని గిడుగుతో చర్చించారు. ఆ విధంగా గిడుగు జీవిత ఉత్తరార్థంలో ఈ విషయాన్ని గురించి గాఢంగా ఆలోచించి తెలుగు విద్యా విధానంలో అన్యాయం జరుగుతున్నదని గుర్తించాడు. గిడుగు "తెలుగు" అనే మాసపత్రికను స్థాపించి తన శాస్త్రీయ వ్యాసాలతో, ఉపన్యాస పాఠాలతో అవిశ్రాంతంగా పోరాటం సాగించాడు.

వాడుక భాష గ్రామ్యభాష కాదు. సజీవ భాష. తెలుగు భాష మారుతోంది. కాబట్టి కొత్త వ్యాకరణాలు, సవరణలు వెలువడ్డాయి. నన్నయ భాషకి, తిక్కన భాషకి, ప్రబంధ బాషకి, దక్షిణాంధ్ర యుగం నాటి భాషకి చాలా భేదాలున్నాయి. వ్యావహారిక భాషావాదం ప్రాచీన సాహిత్యానికి వ్యతిరేకంగా ఏర్పడలేదు. ప్రాచీన కావ్యాలను, వ్యాకరణాలను గౌరవిస్తూనే వాడుక భాషకి ప్రాచుర్యం కల్పించాలి.

వాడుక భాషలో కూడా ఉత్తమ సాహిత్యాన్ని సృష్టించవచ్చును. ఉదాహరణ: గురజాడ అప్పారావు గారి కన్యాశుల్కం. గ్రాంథిక భాష పండితులకే అర్థం కాదు. గొప్ప పండితులు కూడా తప్పులు లేకుండా రాయలేరు. మారుతున్న కాలానికి అనుగుణంగా శాస్త్ర, సాంకేతిక రంగాలలో విజ్ఞానం పెంపొందించు కోవాలంటే పాఠ్య గ్రంథాలు వాడుక భాషలోనే ఉండాలి. వాడుక భాష ప్రజల భాష. గ్రాంథిక భాష పండితుల భాష. ఆ రోజుల్లోనే అతనికి దగ్గర అడవుల్లో ఉండే సవరల భాష నేర్చుకొని వాళ్ళకు చదువు చెప్పాలనే కోరిక కలిగి, తెలుగు, సవర భాషలు రెండూ వచ్చిన ఒక సవర వ్యవహర్తను ఇంట్లోనే పెట్టుకొని చాలా ఏళ్ళు సవర భాష నేర్చుకున్నాడు. సవర భాషలో పుస్తకాలు రాసి సొంతడబ్బుతో స్కూళ్ళు పెట్టి అధ్యాపకుల జీతాలు చెల్లించి సవరలకు వాళ్ళ భాషలోనే చదువు చెప్పే ఏర్పాట్లు చేశాడు. మద్రాసు ప్రభుత్వం వారు ఈ కృషికి మెచ్చి 1913లో "రావ్ బహదూర్" బిరుదు ఇచ్చారు. భాషాశాస్త్రంలో అప్పుడప్పుడే వస్తున్న పుస్తకాలు చదివి వ్యాకరణ నిర్మాణ విధానం నేర్చుకొన్నారు. ముప్ఫై అయిదేళ్ళ కృషితో 1931లో ఇంగ్లీషులో సవర భాషా వ్యాకరణాన్ని, 1936లో సవరఇంగ్లీషు కోశాన్ని నిర్మించారు.మద్రాసు ప్రభుత్వం వారు గిడుగు ఆంగ్లంలో తయారుచేసిన సవరభాషా వ్యాకరణాన్ని 1931లోను, సవరఇంగ్లీషు కోశాన్ని 1938లోను అచ్చువేశారు. 1934లో ప్రభుత్వం అతనికి 'కైజర్‌ఇహింద్ ' అనే స్వర్ణ పతకాన్నిచ్చి గౌరవించింది. మనదేశంలో మొట్టమొదట ఆస్ట్రోఏషియాటిక్ భాషా కుటుంబంలో ఒక శాఖ అయిన ముండా భాషల ఉపకుటుంబ భాషను శాస్త్రీయంగా పరిశీలించిన వాడు గిడుగు రామమూర్తి. ఆర్యభాషా వ్యవహర్తలు మన దేశానికి రాకముందు (క్రీ.పూ. 15వ శతాబ్ది) నుంచి వీళ్ళు మనదేశంలో స్థిరపడ్డారు. వీరిని "శబరు"లనే ఆదిమ జాతిగా ఐతరేయ బ్రాహ్మణం (క్రీ.పూ. 7వ శతాబ్ది) లో పేర్కొన్నారు. హైస్కూల్లో చరిత్రపాఠం చెప్పేరోజుల్లోనే దేవాలయాల్లో ఉన్న శాసనాల లిపిని స్వతంత్రంగా నేర్చుకుని చదివాడు. విషయ పరిశోధన చేసి వాటి ఆధారంగా ఎన్నో చారిత్రకాంశాలు, ముఖ్యంగా గాంగ వంశీయులను గురించి రామమూర్తి ఇంగ్లీషులో ప్రామాణిక వ్యాసాలు రాసి ప్రచురించాడు. 1911లో గిడుగు 30 ఏళ్ళ సర్వీసుతో అధ్యాపక పదవి నుంచి స్వచ్ఛందంగా రిటైరయ్యాక, ఆధునికాంధ్ర భాషాసంస్కరణ వైపు దృష్టి మరల్చాడు. గిడుగు రామమూర్తి 1940 జనవరి 15వ తేదీన ప్రజామిత్ర కార్యాలయంలో పత్రికా సంపాదకులను సంబోధిస్తూ చేసిన తన తుది విన్నపంలో వ్యావహారిక భాషా వ్యాప్తికి చాలా సంతృప్తి పొందాడు. కాని, ప్రభుత్వ విద్యాశాఖ, విశ్వ విద్యాలయాలు గ్రాంథికాన్ని వదిలిపెట్టక పోవటానికి బాధపడ్డాడు. గిడుగు జన్మదినమైన ఆగస్టు 29 ను 'తెలుగు భాషా దినోత్సవము'గా తెలుగు రాష్ట్రాలు పరిగణిస్తున్నాయి. తెలుగు వ్యావహారిక బాషకు పితామహుడిగా పరిగణించబడే, తెలుగు బాషకు ఎనలేని సేవ చేసిన గిడుగు 1940, జనవరి 22న కన్ను మూశారు.



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్



# జాతీయం-అంతర్జాతీయం



## ‘ఏఐ భారత్’ కాదు.. ‘కాంట్రాక్ట్ భారత్’!

- **ప్రభుత్వంలో లేని శాశ్వత నైపుణ్య వ్యవస్థ**
- **నిపుణులకు నెలకు రూ.4.58 లక్షల వరకు చెల్లింపు..**
- **టాప్ సివిల్ సర్వెంట్ల వేతనాల కంటే రెట్టింపు**
- **ప్రయివేట్ సంస్థలకు రూ. లక్షల్లో ప్రజాధనం**
- **ఏఐ పేరుతో మోడీ సర్కారు భారీ ఖర్చు!**




**న్యూఢిల్లీ, ఆగస్టు 28 (ఎ.ఎం.ఎస్) :** ఏఐ విప్లవం.. డిజిటల్ ఇండియా.. టెక్నాలజీతో పాలనలో సమూల మార్పులు అంటూ మోడీ ప్రభుత్వం భారీగా ప్రచారం చేసుకుంటోంది. కానీ ఆ ప్రచారానికి ప్రజాధనంతో చెల్లించాల్సిన మొత్తం కూడా భారీగానే కనిపిస్తోంది. కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ పరిధిలోని నేషనల్ ఈగవర్నెన్స్ డివిజన్ (ఎన్ఈజీడీ) ఏఐ, మెషిన్ లెర్నింగ్ నిపుణులను సరఫరా చేసే సంస్థల కోసం నిర్ణయించిన రేట్లు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. అత్యున్నత ఏఐ నిపుణుల కోసం నెలకు రూ.4.58 లక్షల వరకు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ‘డిజిటల్ ఇండియా’ పేరుతో ప్రచారం ఒకవైపు.. ప్రజాధనంతో భారీ కాంట్రాక్టు వ్యయం మరోవైపు అన్న విమర్శలు ఇప్పుడు వినిపిస్తున్నాయి. న్యూఢిల్లీ మోడీ ప్రభుత్వం ఏఐని ప్రభుత్వ పాలనలోకి తీసుకొస్తోంది. ఇందుకు భారీ మొత్తంలో వెచ్చించేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. అయితే ఇక్కడ అసలు ప్రశ్న.. దానికి ఎంత ఖర్చు? ఎవరి ద్వారా ఖర్చు? ఎంతకాలం కాంట్రాక్టు నిపుణులపై ఆధారపడాలి? అన్నదే. ఎన్ఈజీడీ రూపొందించిన ఏఐ/ఎంఎల్ మానవ వనరుల ఎంపానెల్ రేట్ల ప్రకారం అత్యున్నత స్థాయి నిపుణులకు నెలకు రూ.4,58,500 వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తం నేరుగా ఉద్యోగి జీతం కాదు.. నిపుణుడిని అందించే సంస్థకు ప్రభుత్వం చెల్లించే రేటు. అందులో సంస్థ ఖర్చులు, మార్జిన్ కూడా ఉంటాయి. అయినప్పటికీ ప్రభుత్వ ఖజానాపై పడే భారాన్ని మాత్రం విస్మరించలేమని విశ్లేషకులు చెప్తున్నారు.క్యాబినెట్ కార్యదర్శి కంటే □ఏఐ నిపుణుడి రేటు ఎక్కువ!కేంద్ర ప్రభుత్వ క్యాబినెట్ కార్యదర్శి ప్రాథమిక వేతనం నెలకు రూ.2.50 లక్షలు. ప్రభుత్వ కార్యదర్శి ప్రాథమిక వేతనం రూ.2.25 లక్షలు. అదే సమయంలో ఏఐ సొల్యూషన్ ఆర్కిటెక్ట్, డేటా సైన్స్ లీడ్, ఏఐ/ఎంఎల్ లీడ్ కోసం నెలకు రూ.4,58,500 వరకు రేటు నిర్ణయించారు. అంటే రేటు పరంగా చూస్తే.. దేశ అత్యున్నత సివిల్ సర్వీసు స్థాయి అధికారుల ప్రాథమిక వేతనాల కంటే దాదాపు రెట్టింపు. అయితే ఇక్కడ ఒక విషయాన్ని స్పష్టంగా చెప్పాలి. ఇది ఏఐ నిపుణుడి చేతికి వెళ్లే జీతం కాదు. ఏజెన్సీకి ప్రభుత్వం చెల్లించే మొత్తం. అందులో ఏజెన్సీ నిర్వహణ ఖర్చులు, మార్జిన్ కూడా ఉంటాయి. అయినా.. ఒక్కో నిపుణుడి సేవకు ప్రభుత్వ ఖజానా నుంచి లక్షల రూపాయలు వెచ్చించాల్సిన స్థాయికి వ్యవస్థ చేరడం గమనార్హం.’డిజిటల్ ఇండియా’కు కాంట్రాక్టు మోడల్!మోడీ ప్రభుత్వం డిజిటల్ ఇండియాను తమ విజయంగా తీవ్ర ప్రచారం చేస్తోంది. ఇప్పుడు అదే డిజిటల్ వ్యవస్థను నడిపించేందుకు ప్రయివేట్ ఏజెన్సీల నుంచి నిపుణులను తీసుకుంటోంది. ఎన్ఈజీడీ అధికారిక టెండర్ ప్రకారం.. ఏఐ/ఎంఎల్ నిపుణులను అందించే భాగస్వామ్య సంస్థలను ఎంపిక చేయడం, ప్రభుత్వ విభాగాలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాన్ని వేగంగా అందించడం ఈ వ్యవస్థ ఉద్దేశం. అంటే ‘స్వయం సమృద్ధి’ అంటూ ప్రచారం చేసే కేంద్ర ప్రభుత్వం.. కీలకమైన కొత్త సాంకేతిక నైపుణ్యాల కోసం మాత్రం బయటి సంస్థలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందా? అన్న ప్రశ్న తలెత్తుతోంది.ప్రభుత్వ ఫైళ్లపై ఏ’ఐ’!ఏఐ నిపుణులతో చేయించబోయే పనులు చిన్నవి కావు. క్యాబినెట్ నోట్లు, టెండర్ పత్రాలు, పాలసీ డాక్యుమెంట్లను సంక్షిప్తం చేసే సాఫ్ట్‌వేర్.. ఉమంగ్, డీజీ లాకర్ వంటి ప్రభుత్వ యాప్‌లలో చాట్‌బాట్లు.. ప్రాంతీయ భాషల్లో వాయిస్ ఆధారిత సేవలు..సర్టిఫికెట్లు, ఐడీలు, స్కాన్ చేసిన పత్రాల నుంచి డేటా సేకరణ..ముఖ గుర్తింపు ఆధారిత హాజరు, డిజిటల్ ఆన్‌బోర్డింగ్.. ఇలా ఇవన్నీ ప్రతిపాదనలో ఉన్నాయి. ఇలా అత్యంత సున్నితమైన డేటాతో వ్యవహరించే వ్యవస్థలను ప్రయివేట్ ఏజెన్సీల ద్వారా నిర్మిస్తున్నప్పుడు.. డేటా భద్రత, గోప్యత, బాధ్యత ఎవరిది? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

టెక్నాలజీని ప్రభుత్వంలోకి తీసుకురావడాన్ని ఎవరూ వ్యతిరేకించరు. కానీ సాంకేతికత పేరుతో ప్రజాధనం ఖర్చు చేస్తున్నప్పుడు దానికి సమానమైన జవాబుదారీతనం కూడా ఉండాలి. ప్రభుత్వంలోనే శాశ్వత ఏఐ నైపుణ్యాన్ని పెంచకుండా.. కాంట్రాక్టు మోడల్‌పై ఆధారపడటం దీర్ఘకాలిక పరిష్కారమా? డేటా భద్రతకు బాధ్య ఎవరిది? అనే ప్రశ్నలు అందరిలోనూ మెదులుతున్నాయి.

దేశంలో ఏఐ నైపుణ్యాలకు డిమాండ్ పెరిగింది. ప్రభుత్వం కూడా ప్రతిభను ఆకర్షించేందుకు పోటీ పడుతోంది. కానీ మోడీ ప్రభుత్వం ‘మినిమమ్ గవర్నమెంట్, మ్యాక్సిమమ్ గవర్నెన్స్’ అంటూ ప్రచారం చేసిన నేపథ్యంలో ఇప్పుడు మరో ప్రశ్న ఎదురవుతోంది. ప్రభుత్వానికి శాశ్వతంగా అవసరమైన సాంకేతిక నైపుణ్యాలను ప్రభుత్వ వ్యవస్థలోనే ఎందుకు పెంచకూడదు? ప్రతిసారి ప్రయివేటు ఏజెన్సీల ద్వారా నిపుణులను తీసుకోవాల్సిందేనా? ప్రజాధనంతో చెల్లించే ఈ భారీ రేట్లకు ఫలితాలను కొలిచే పారదర్శక వ్యవస్థ ఉందా? ఇవే అసలు ప్రశ్నలు.

## అమెరికా మిత్రదేశాలనూ వదలం

- **అవసరమైతే అణ్వాయుధాలను తయారు చేస్తాం**
- **ఆర్థిక యుద్ధం’ బెదిరింపులపై ఇరాన్**
- **నిబంధనలు ఉల్లంఘిస్తే ఖబడ్దార్**
- **సామర్థ్యాన్ని చాటుకుంటున్న వైనం**



**టెహ్రాన్, ఆగస్టు 28 :** తన ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడానికి వాషింగ్టన్ తాజా ప్రణాళికలు రూపొందిస్తున్న నేపథ్యంలో అమెరికా, దాని మిత్రదేశాలకు మరింత ప్రమాదాన్ని కలిగించేలా ప్రాంతీయంగా, అంతర్జాతీయంగా ప్రతిస్పందిస్తామని ఇరాన్ హెచ్చరించింది. డిజిటల్ ఆస్తులు, సాంకేతికత, షిప్పింగ్ వంటి రంగాలలో ఇరాన్‌కు సాయపడుతున్న వాణిజ్య భాగస్వాములపై జరిమానాలు విధిస్తామని అమెరికా ప్రకటించింది. అయితే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గొప్పగా చెప్పుకున్న ‘ఎకనమిక్ డిడే’ చర్యల గురించి ఎంతో ఆసక్తిగా ఎదురు చూసిన ప్రజలకు ఆశాభంగం తప్పలేదు. ఎందుకంటే ఇరాన్‌పై అమెరికా ఎలాంటి కొత్త ఆంక్షలు విధించలేదు. ప్రస్తుతం ఉన్న ఆంక్షల అమలునే తీవ్రతరం చేసింది. ఇరాన్‌తో సంబంధాలను తెంచుకునేందుకు ఇష్టపడని దేశాలపై కఠినమైన జరిమానాలు విధిస్తానని హూంకరించింది.

అయితే అమెరికా ఉడత ఊపులకు ఇరాన్ ఏ మాత్రం భయపడడం లేదు. ప్రతీకార చర్యలకు దిగేందుకు తనకు సామర్థ్యం ఉన్నదని చాటుకుంటోంది. ప్రాంతీయ చమురు ఉత్పత్తిదారులు, ఐరోపా దేశాలపై దాడులను విస్తరిస్తామని హెచ్చరించింది. అణు కార్యక్రమాన్ని ఆయుధంగా మారుస్తానని సంకేతాలు పంపింది. ‘చాలా కాలం నుంచి చదరంగం ఆడుతున్నాం. బాక్సింగ్ ఎలా ఆడాలో కూడా నేర్చుకున్నాం. కొంతకాలంగా ఈ రెండింటినీ కలిపి ఆడుతున్నాం’ అని ఇరాన్ విదేశాంగ ప్రతినిధి ఇస్మాయిల్ బాఘై వ్యాఖ్యానించారు. ఇరాన్ గత కొన్ని నెలలుగా హార్ముజ్ జలసంధిని మూసేసి చమురు నౌకల రాకపోకలను అడ్డుకుంటోంది. దీంతో ప్రాంతీయ దేశాలకు చమురు, గ్యాస్ ఎగుమతులు దాదాపుగా ఆగిపోయాయి. మరోవైపు ఎర్ర సముద్రంలో సౌదీ చమురు ఎగుమతులను, మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకొని హౌతీలు కొత్తగా యుద్ధాన్ని మొదలు పెట్టారు. హార్ముజ్ వెలుపల ఉన్న ఇంధన లక్ష్యాలపై దాడులు చేస్తామని ఇరాన్ సైనికాధికారులు తాజాగా ప్రకటనలు చేస్తున్నారు. దీంతో ఇతర చమురు రవాణా మార్గాలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది.

‘ఆర్థిక యుద్ధం కొనసాగితే హార్ముజ్ ద్వారా, పర్షియన్ గల్ఫ్ నుంచి ఒక్క చమురు చుక్క కూడా ఎగుమతి కాదు’ అని ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ నేత మొహసేన్ రెజాయి స్పష్టం చేశారు. భూకంపం మాదిరిగా విరుచుకు పడతామని, ప్రతీకారం తీర్చుకుంటామని ఆయన ఓ టెలివిజన్ ఇంటర్వ్యూలో హెచ్చరించారు. ఇరాన్ నేతలు చెబుతున్నట్లు ప్రతీకార దాడులు జరిగిన పక్షంలో అంతర్జాతీయ చమురు ధరలు భగ్గుమంటాయి. అమెరికాలోని పెట్రోలు బంకులలో గ్యాసోలిన్ ధరలు కూడా పెరగవచ్చు. సౌదీ, కువైట్, యూఏఈ దేశాలకు చెందిన చమురు కంపెనీలు ఇరాన్ అధికారుల కంట పడకుండా ఉండడానికి అమెరికా సాయంతో ట్యాంకర్లలోని ట్రాన్స్‌పాండర్లను ఆపేస్తున్నాయి. తద్వారా స్వల్ప పరిమాణంలో అయినా చమురును ఎగుమతి చేస్తున్నాయి. మరోవైపు సౌదీ అరేబియా ఎర్ర సముద్రం మీదుగా చమురును రవాణా చేస్తోంది. దీంతో ఇరాన్ అధికారులు 45 నౌకల జాబితాను ప్రకటించి అవి తమ లక్ష్యాలుగా ఉన్నాయని తెలిపారు. తమ నిబంధనలను ఉల్లంఘించే నౌకలు భవిష్యత్తులో జరిమానాలు, నిర్బంధాలు, జప్తులను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇంధనాన్ని నింపే విమానాలు బల్గేరియా నుంచి బయలుదేరడాన్ని గుర్తించిన ఇరాన్... ఆ దేశాన్ని కూడా వదలబోమని చెప్పింది.

యుద్ధ సమయంలో ఇరాన్ ప్రధానంగా గల్ఫ్‌లోని 11 దేశాలపై దాడులు చేసింది. సైప్రస్‌లో బ్రిటన్ దళాలు ఉపయోగించే స్థావరంపై కూడా దాడి జరిపింది. అంతేకాక హిందూ మహాసముద్రంలో వందల మైళ్ల దూరంలో అమెరికా దళాలు ఉపయోగించే ద్వీపాలను కూడా చేరుకోగల సామర్థ్యం తనకు ఉన్నదని నిరూపించింది. ఇరాన్ ప్రజలపై అమెరికా సాగిస్తున్న ఆర్థిక యుద్ధంలో భాగస్వామి అయినా లేదా పోరుకు మద్దతు ఇచ్చినా దానిని యుద్ధ చర్యగానే పరిగణిస్తామని రెజాయి తేల్చి చెప్పారు. అణ్వాయుధాన్ని తయారు చేయడానికి ఉపయోగించే శుద్ధి చేసిన అర టన్ను యురేనియం ఇరాన్ భూభాగంలో పాతి పెట్టి ఉంది. దీనికి సీలు వేయడానికి ఇరాన్ ముమ్మరంగా ప్రయత్నిస్తోందని అమెరికా నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి. అణ్వాయుధాన్ని అభివృద్ధి చేసే అవకాశం ఉన్నదని రెజాయి ఓ అరుదైన ప్రకటన కూడా చేశారు. అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం (ఎన్‌పీటీ) నుంచి వైదొలగడానికి ఉద్దేశించిన బిల్లుపై ఇరాన్ పార్లమెంట్ ప్రస్తుతం చర్చిస్తోంది. అయితే అమెరికా యుద్ధాన్ని ఎదుర్కోవడానికి మనం అణ్వాయుధాన్ని ఎందుకు అభివృద్ధి చేయకూడదని ప్రజలు ప్రశ్నిస్తున్నారని రెజాయి చెప్పారు.

## కర్నాటకలో గోల్డ్ మైన్స్‌ను సందర్శించిన భట్టి

- **బంగారం శుద్ధి కేంద్రాలను పరిశీలించిన డిప్యూటీ సీఎం**



**బెంగళూరు, ఆగస్టు 28 :** తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లాలోని దేశంలోనే ఏకైక ప్రభుత్వ రంగ సంస్థ అయిన ‘హట్టి గోల్డ్ మైన్స్ ను సందర్శించారు. ఈ పర్యటనలో భాగంగా భూగర్భ (అండర్‌గ్రౌండ్), ఓపెన్‌కాస్ట్ గనులతో పాటు అక్కడి ప్రొడక్షన్ యూనిట్లు, బంగారం శుద్ధి కేంద్రాల పనితీరును ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మైనింగ్, శుద్ధి ప్రక్రియలకు సంబంధించిన సమగ్ర వివరాలను అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సింగరేణి సంస్థను కేవలం సంప్రదాయ బొగ్గు ఉత్పత్తికే పరిమితం చేయకుండా, బంగారం, రాగి వంటి కీలక లోహాలు, ఖనిజాల అన్వేషణ, ఉత్పత్తి రంగాల్లోనూ ముందుకు తీసుకెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు.

## నేటి నుంచి ప్రధాని విదేశీ పర్యటన



**న్యూఢిల్లీ, ఆగస్టు 28 :** ప్రధాని నరేంద్రమోడీ శనివారం నుంచి సెప్టెంబర్ 1 వరకు విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. ఉజ్బెకిస్థాన్, కిర్గిస్థాన్‌లలో ఆయన పర్యటించనున్నారు. ఈ సందర్భంగా కిర్గిస్థాన్‌లో జరిగే ఎస్‌సీవో 2026 సదస్సుకు హాజరవుతారు. సెంట్రల్ ఆసియా దేశాలైన ఉజ్బెకిస్థాన్,

కిర్గిస్థాన్‌లతో ద్వైపాక్షిక, వ్యాపార, వాణిజ్య బంధాలను బలోపేతం చేసేందుకు ఈ పర్యటన ఉపయోగపడనుంది. ఎస్‌సీవో సదస్సు సందర్భంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో మోదీ భేటీ అవుతారని భారత విదేశీ మంత్రిత్వ శాఖ తెలిపింది.

## రాఖీ వేళ ఢిల్లీ పోలీసుల వినూత్న కార్యక్రమం



**న్యూఢిల్లీ, ఆగస్టు 28 :** రోడ్డు భద్రతా నియమాలు, ప్రమాదాల నివారణపై రాఖీ పండుగ పూట ఢిల్లీ పోలీసులు వినూత్న కార్యక్రమం చేపట్టారు. “రాఖీ వాగ్దానం, రక్షణ సంకల్పం” అంటూ వాహనాదారులకు మహిళా సిబ్బంది రాఖీలు కట్టారు. పరస్పర బాధ్యత, రహదారి భద్రతకు సంబంధించిన సందేశాన్ని అందించడానికి రక్షాబంధన్ పండుగ స్ఫూర్తి అని తెలియజేశారు. దేశ రాజధానిలోని షాదరా సర్కిల్, చింతామణి రెడ్ లైట్, సీలంపూర్ రెడ్ లైట్, మజ్ను కా తిలా చెక్ పోస్ట్ వంటి ప్రాంతాలతో పాటు నగరంలోని అనేక ఇతర ప్రధాన కూడళ్లు, ట్రాఫిక్ పాయింట్ల వద్ద రోడ్డు భద్రతా విభాగం సర్కిల్ సిబ్బంది ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.



## మేమే సొంతంగా నిర్వహిస్తాం

- **ఇతర దేశాల సహాయాన్ని తిరస్కరించిన నేపాల్**
- **2015 భూకంపం తమకు గుణపాఠమంటూ వెల్లడి**

**ఖాట్మండు, ఆగస్టు 28 :** నేపాల్ లో ఆకస్మిక వరదలు పెను విధ్వంసం సృష్టించిన విషయం తెలిసిందే. భోటెకోషి, త్రిశూలి నదీ పరీవాహక ప్రాంతాల్లో సంభవించిన వరద విపత్తులో దాదాపు 469 మంది ప్రాణాలు కోల్పోగా.. వందలాది మంది గల్లంతయ్యారు. అయితే ఆపద్కాలంలో నేపాల్ ను ఆదుకోవడానికి పలు దేశాలు ముందుకొచ్చాయి. భారత్, చైనా, అమెరికా, బ్రిటన్, జపాన్, సౌత్ కొరియా, శ్రీలంక, బంగ్లాదేశ్ వంటి అనేక దేశాలు సహాయం అందించడానికి ముందుకు రాగా, ఆయా దేశాల ప్రతిపాదనలను నేపాల్ ప్రభుత్వం తిరస్కరించింది. తమ సొంత భద్రతా బలగాలే ఈ రెస్క్యూ ఆపరేషన్‌ను సమర్థవంతంగా నిర్వహించగలవని విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

2015లో సంభవించిన భారీ భూకంపమే తమకు గుణపాఠం అని తెలియజేసింది. ఆ సమయంలో విదేశాల నుంచి పెద్ద ఎత్తున సహాయక బృందాలు రావడంతో సమన్వయం, నిర్వహణలో తీవ్ర ఇబ్బందులు తలెత్తాయని, రెస్క్యూ బాధ్యతలను పూర్తిగా నేపాల్ పోలీసు,

సైనిక బలగాలకే అప్పగించమంది. ఆర్థిక సాయం అందిచాల్సిందిగా ఆయా దేశాలతో పాటు పలు అంతర్జాతీయ సంస్థలను నేపాల్ కోరింది.

## నేపాల్ మృతుల సంఖ్య 469

- **1500 మంది ఆచూకీ గల్లంతు**

**ఖాట్మండు, ఆగస్టు 28 :** నేపాల్‌లో సంభవించిన ఆకస్మిక వరదల్లో మృతిచెందిన వారి సంఖ్య 469కి చేరుకున్నట్లు ఆ దేశ పోలీసులు వెల్లడించారు. వరదల వల్ల సుమారు 1500 మంది ఆచూకీ లేనట్లు కూడా తెలిపారు. ఇక మరో వైపు చైనా వార్నింగ్ ఇచ్చింది. మళ్లీ దిగువ ప్రాంతాలకు మరింత భీకర వరదలు సంభవించే అవకాశాలు ఉన్నట్లు డ్రాగన్ దేశం హెచ్చరించింది. తాజా వరదల్లో సుమారు 178 మంది భారతీయులు గల్లంతు అయినట్లు నేపాల్ అధికారులు చెబుతున్నారు. 11 మందిని రెస్క్యూ చేశారు. విదేశీ పర్యాటకులతో పాటు మానస సరోవర యాత్రకు వెళ్లిన యాత్రికులు ఎక్కువ సంఖ్యలో మిస్ అయినట్లు తెలుస్తోంది.

## భారత్‌కూ పొంచివున్న ముప్పు

- **88 సరస్సులు అత్యంత ప్రమాదం..**
- **ఏ క్షణం అయినా ఆనకట్టలు తెగే అవకాశం**
- **నేపాల్ జలప్రళయానికి మించి విధ్వంసానికి ఆస్కారం**



**న్యూఢిల్లీ, ఆగస్టు 28 :** మొన్న నేపాల్లోని భోటే కోషి హిమనదిలో రాళ్లు, మంచుకొండలు విరిగిపడటంతో ఆకస్మిక వరదలు బీభత్సం సృష్టించాయి. వందలాది మంది గల్లంతయ్యారు. ఇండ్లు, భవనాలు, బ్రిడ్జిలు, రోడ్లు అన్నీ కొట్టుకుపోయాయి. ఇంతకు మించి విధ్వంసం సృష్టించగల 88 అత్యంత ప్రమాదకర హిమనదులు హిమాచల్ ప్రదేశ్లో ఉన్నాయి. ఐఐటీ రోపర్, యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ సిడ్నీ నిర్వహించిన పరిశోధనల్లో హిమాచల్ ప్రదేశ్లో 1990లో 107 హిమనదీ సరస్సులు ఉంటే.. 2024 వరకు 669 హిమనదీ సరస్సులు ఏర్పడ్డాయి. అంటే 25 శాతం ఈ నదులు పెరిగాయి.

పర్వతాల్లో అధిక ఎత్తులో ఉన్న హిమనదులు కరిగినప్పుడు వాటి నుంచి వచ్చే నీరు సమీపంలోని లోతట్టు ప్రాంతాల్లో లేదా రాతి గోడల వెనక చేరుతుంది. క్రమంగా అక్కడ సరస్సు ఏర్పడుతుంది. దీనినే హిమ నదీ సరస్సు అంటారు. ఇలాంటి సరస్సులు హిమనదికి ముందు లేదా వెనకభాగంలో కూడా ఏర్పడవచ్చు. ఈ సరస్సులోని నీటిని మంచు, రాళ్లు, కొండచరియల మట్టితో ఏర్పడిన ఒక సహజ ఆనకట్టు అడ్డుకుంటుంది. ఏదైనా కారణాలతో ఈ సహజ ఆనకట్ట తెగిపోతే ఆ సరస్సులో ఉన్న లక్షల క్యూబిక్ మీటర్ల నీరు ఒక్కసారిగా దిగువ ప్రాంతాలను తుడిచిపెట్టేస్తుంది. దీనినే గ్లాసిక్ లేక్ ఔట్రెజ్ బర్స్ట్ అంటారు.

ఐఐటీ రోపర్, యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ సిడ్నీ నివేదిక ప్రకారం హిమాచల్ ప్రదేశ్లో 88 హిమనదీ సరస్సులు చాలా ప్రమాదకర స్థాయిలో ఉన్నాయి. ఇందులో 9 అత్యంత ప్రమాదకరంగా ఉండగా.. 18 అత్యధిక ప్రమాదకరంగా, 26 ప్రమాదకరంగా ఉన్నాయి. మరీ ముఖ్యంగా బియాస్లోని హిమ్సు సరస్సు, సట్లెజ్ బేసిన్ లోని పేరుపెట్టని సరస్సు ప్రమాదం గురించి వివరించాయి. హిమ్సు ఆనకట్ట తెగితే సెకనుకు 1,385 క్యూబిక్ మీటర్ల నీటి ప్రవాహంతో వరదలు సృష్టించగలదు. అంటే సెకనుకు 1.4 మిలియన్ల లీటర్ల నీరు కింద ఉన్న గ్రామాలు, భవనాలు, బ్రిడ్జిలు, రోడ్లను తుడిచి పెట్టేయగలదు. సట్లెజ్ లోని సరస్సు ఆనకట్ట తెగితే సెకనుకు ఏకంగా 3,507 క్యూబిక్ మీటర్ల నీటి ప్రవాహంతో 3.5 మిలియన్ లీటర్ల నీరు కిందకు దూకుతుంది. నేపాల్ వరదలను మించి విధ్వంసం సృష్టించగలదు.

నేపాల్లో జరిగిన విధ్వంసం భారత్లో జరగొద్దంటే ప్రమాదకరంగా ఉన్న సరస్సులను గుర్తించాలి. వాటి ఆనకట్ట బలం, ప్రస్తుత పరిస్థితిని సెన్సార్లు, రాడార్ల సాయంతో అంచనా వేయొచ్చు. నియంత్రిత పద్ధతిలో ఆ సరస్సుల్లో ఉన్న నీటిని మెల్లిమెల్లిగా ముందే కిందకు పంపిస్తూ ఉండాలి. అప్పుడు ఒకేసారి నీరు కిందకు రాకపోవడం వల్ల ప్రమాదం ఉండదు. అలాగే ప్రమాదకర ప్రాంతాల్లో మౌళిక సదుపాయాలను కూడా నిలిపివేయాలి. ప్రజా భవనాల నిర్మాణాలను ఆపేయాలి. పర్యావరణ తీవ్రతను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ హిమనదీ సరస్సుల సంఖ్యను తగ్గించేందుకు ఏర్పాట్లు చేయాలి

## చరిత్ర సృష్టించిన ప్రజ్ఞానంద

- **గ్రాండ్ చెస్ టూర్ ఫైనల్స్ టైటిల్ కైవసం**



**సెయింట్ లూయిస్, ఆగస్టు 28 :** భారత యువ గ్రాండ్‌మాస్టర్ రమేశ్‌బాబు ప్రజ్ఞానంద చదరంగంలో సరికొత్త చరిత్ర సృష్టించాడు. ప్రతిష్ఠాత్మక గ్రాండ్ చెస్ టూర్ ఫైనల్స్ టైటిల్‌ను తొలిసారిగా కైవసం చేసుకున్నాడు. అమెరికాలోని సెయింట్ లూయిస్‌లో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో వరల్డ్ నంబర్ 2 ఫ్యాబియానో కరువానాపై అద్భుతమైన విజయం సాధించాడు. ఈ విజయంతో ఈ టోర్నీని గెలుచుకున్న మొట్టమొదటి భారతీయ ఆటగాడిగా ప్రజ్ఞానంద రికార్డు సృష్టించాడు.

గురువారం జరిగిన చివరి రోజు ఆటలో ప్రజ్ఞానంద అసాధారణ పోరాట పటిమను ప్రదర్శించాడు. ఆట ప్రారంభానికి ముందు కరువానా కంటే ఆరు పాయింట్లు వెనుకబడి ఉన్న ప్రజ్ఞానంద, రెండు ర్యాపిడ్ గేమ్‌లలోనూ గెలిచి ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. ఆ తర్వాత జరిగిన బ్లిట్జ్ గేమ్‌లలోనూ సమంగా నిలిచి, మొత్తం మీద 1513 స్కోర్‌తో టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. విజేతగా నిలిచిన ప్రజ్ఞానందకు 2 లక్షల డాలర్ల (సుమారు రూ. 1.91 కోట్లు) ప్రైజ్ మనీ లభించింది.

వాస్తవానికి ఈ టోర్నీ ఆరంభంలో కరువానా చేతిలో తొలి క్లాసికల్ గేమ్‌లో ప్రజ్ఞానంద ఓడిపోయాడు. రెండో గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. దీంతో చివరి రోజు ఆటలో వెనుకబడినప్పటికీ, అద్భుత ప్రదర్శనతో విజయాన్ని అందుకున్నాడు. ఇదే టోర్నీలో మూడో స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో జీఎం వెస్లీ సో, విన్సెంట్ కైమర్‌పై విజయం సాధించాడు.

## ముగిసిన కరోలిన్ లెవిట్ పదవీకాలం

- **వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ పదవికి కొత్త వ్యక్తి**
- **ఎవరిని నియమిస్తారనే దానిపై సర్వత్రా ఆసక్తి**

**వాషింగ్టన్, ఆగస్టు 28 :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంలో అత్యంత కీలకమైన వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ పదవిలో మార్పు చోటు చేసుకుంది. 19 నెలలకు పైగా ఈ బాధ్యతల్లో కొనసాగిన కరోలిన్ లెవిట్ పదవీకాలం ముగిసింది. గురువారమే ఆమె చివరి పని దినమని వైట్‌హౌస్ అధికారికంగా ప్రకటించింది. అయితే, ఆమె స్థానంలో కొత్తగా ఎవరు రానున్నారనే దానిపై ఎటువంటి ప్రకటన చేయలేదు. ట్రంప్ రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రెస్ సెక్రటరీగా నియమితులైన లెవిట్, ఈ పదవిని చేపట్టిన వారిలో అత్యంత పిన్న వయస్కురాలిగా చరిత్ర సృష్టించారు. తన పదవీకాలంలో అధ్యక్షుడికి, ఆయన ‘అమెరికా ఫస్ట్’ విధానాలకు ఆమె గట్టి మద్దతుదారుగా నిలిచారని వైట్‌హౌస్ ప్రశంసించింది. స్పష్టమైన, దృఢమైన వైఖరితో ఆమె తన బాధ్యతలను నిర్వర్తించారని కొనియాడింది.

స్వయంగా అధ్యక్షుడు ట్రంప్ స్పందిస్తూ.. “వైట్‌హౌస్ చరిత్రలోనే అత్యుత్తమ ప్రెస్ సెక్రటరీలలో లెవిట్ ఒకరు” అని కితాబిచ్చారు. టెలివిజన్ బ్రీఫింగ్‌లు, వార్తా కార్యక్రమాలలో తరచుగా కనిపిస్తూ లెవిట్ ట్రంప్ ప్రభుత్వంలో అత్యంత సుపరిచితమైన ముఖంగా మారారు. ముఖ్యంగా మీడియా ప్రతినిధుల పట్ల ఆమె దూకుడైన వైఖరితో తరచూ వార్తల్లో నిలిచారు. ప్రభుత్వంపై వచ్చే తప్పుడు కథనాలను బ్రీఫింగ్ రూమ్‌లోనే సవాలు చేసేవారు. ఒకానొక సందర్భంలో విలేకరి ప్రశ్నకు “అదెంత తెలివి తక్కువ ప్రశ్న” అని ఘాటుగా సమాధానమివ్వడం ఆమె శైలికి అద్దం పడుతుంది. అంతేగాక పాడ్‌కాస్ట్‌లు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల వంటి కొత్త తరం మీడియా సంస్థలకు కూడా జేమ్స్ ఎస్. బ్రాడీ ప్రెస్ బ్రీఫింగ్ రూమ్‌లోకి ప్రవేశం కల్పించడం లెవిట్ తీసుకున్న కీలక నిర్ణయాలలో ఒకటి. దీనివల్ల సాంప్రదాయ మీడియా సంస్థలకు కేటాయించిన సీటింగ్ అమరికల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. వలసలు, ఆర్థిక వ్యవస్థ, వాణిజ్యం, విదేశాంగ విధానం వంటి అంశాలపై ఆమె బ్రీఫింగ్‌లు కేంద్రీకృతమయ్యాయి.

## వరద బాధితులకు ఒక నెల జీతం విరాళం



- **నేపాల్ ప్రధాని, ఆయన మంత్రివర్గ సహచరుల నిర్ణయం**

**ఖాట్మండు, ఆగస్టు 28 :** భారీ వరదల నేపథ్యంలో, నేపాల్ ప్రధాని బాలేంద్ర షా, ఆయన మంత్రివర్గ సభ్యులు ఒక నెల జీతాన్ని ‘ప్రధానమంత్రి విపత్తు సహాయ నిధి’కి జమ చేయాలని శుక్రవారం నిర్ణయించారు. నేపాల్ ప్రధాని బాలేంద్ర షా ఆధ్వర్యంలో శుక్రవారం సింఘా దర్బార్‌లోని ప్రధాన మంత్రి,మంత్రుల మండలి కార్యాలయంలో మంత్రివర్గ సమావేశం జరిగింది.

రసువాలోని భోటెకోషి ప్రాంతంలో సంభవించిన భారీ వరదల వల్ల జరిగిన నష్టం, అలాగే చేపట్టాల్సిన సహాయక, పునరావాస, పునర్నిర్మాణ చర్యలపై కీలక నిర్ణయాలు తీసుకునేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు నేపాల్ ప్రధాన మంత్రి కార్యాలయం ఫేస్‌బుక్‌లో తెలిపింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను మరింత సమర్థవంతంగా నిర్వహించడం మరియు దెబ్బతిన్న మౌలిక సదుపాయాల పునర్నిర్మాణాన్ని వేగవంతం చేయడం వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు.

ఆయన మంత్రివర్గ సభ్యులు ఒక నెల జీతాన్ని ‘ప్రధానమంత్రి విపత్తు సహాయ నిధి’కి జమ చేయాలని శుక్రవారం నిర్ణయించారు. నేపాల్ ప్రధాని బాలేంద్ర షా ఆ వరదల వల్ల నష్టపోయిన వ్యక్తులు,

వ్యాపార సంస్థల కోసం సహాయం పునరావాస ప్యాకేజీని రూపొందించాలని మంత్రివర్గం ఆర్థిక శాఖను ఆదేశించింది.

# కోమా నుంచి ప్రపంచ ఛాంపియన్‌గా..!

## తైక్వాండో క్రీడాకారులను తీర్చిదిద్దుతున్న ఎల్లావుల గౌతమ్ యాదవ్






రోడ్డు ప్రమాదానికి గురై దయనీయ స్థితిలో తైక్వాండో క్రీడాకారుడు.

**హనుమకొండ, ఆగస్టు 28 (వుదయం జిల్లా ప్రతినిధి) :**
అద్భుతలను అధిగమించి ప్రపంచ ఛాంపియన్‌గా ఎదిగిన గౌతమ్ యాదవ్, ఇప్పుడు కొత్త తరానికి ఛాం పియన్లను తయారుచేస్తూ స్ఫూర్తిదాయక క్రీడా ప్రయా ణాన్ని కొనసాగిస్తున్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా వరంగల్‌కు చెందిన ఈ అంతర్జాతీయ పారా తైక్వాండో క్రీడాకారుడు,కోచ్, మెంటార్ ఎల్లా వుల గౌతమ్ యాదవ్ ప్రత్యేక కథనం.
సాధారణ తైక్వాండో క్రీడాకారుడిగా ప్రారంభమైన ఆయన ప్రయాణం,జాతీయ స్థాయి క్రీడాకారుడిగా, విశ్వవిద్యాలయ కోచ్‌గా, తీవ్రమైన రోడ్డు ప్రమాదాన్ని ఎదుర్కొన్న వ్యక్తిగా,చివరకు ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతక విజేతగా సాగింది.తాను ఛాంపియన్‌గా మారిన తర్వాత, మరోకొ ఛాంపియన్లను తయారు చేయాలనే లక్ష్యంతో కోచ్‌గా మారడం ఆయన ప్రయాణంలోని మరో గొప్ప అధ్యాయం.
12 ఏళ్ల వయస్సులో మొదలైన ప్రయాణం
చిన్న వయస్సులోనే తైక్వాండోపై ఆసక్తి పెంచుకున్న గౌతమ్ యాదవ్,ఉన్నత స్థాయి శిక్షణ పొందే లక్ష్యం తో 'స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా' (సాయి) కర్నూలు కేంద్రంలో కఠినమైన శిక్షణ పొందారు. 2006 నుంచి రాష్ట్ర, జాతీయ పోటీల్లో పాల్గొంటూ తన ప్రతిభను చా టుకున్నారు.స్కూల్ గేమ్స్ నేషనల్స్, సౌత్ జోన్ ఛాంపి యన్‌షిప్స్, సీనియర్ నేషనల్స్,ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొన్నారు. తైక్వాండోతో పాటు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లో బి.టెక్ (బి. టెక్) పూర్తి చేశారు.
క్రీడాకారుడి నుంచి కోచ్‌గా..
తన క్రీడా అనుభవాన్ని తర్వాతి తరానికి అందించాలనే ఉద్దేశంతో కోచింగ్ రంగంలోకి ప్రవేశించారు.
సాయి నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ (ఎన్. ఐ. ఎస్) కేరళ నుండి తైక్వాండో కోచింగ్ సర్టిఫికేషన్ సాధించారు.
కుక్కివాన్ ఇన్స్ట్రక్టర్ కోర్స్
వరల్డ్ తైక్వాండో ఆసియా కోచ్ లైసెన్స్'అర్హతలు సాధించారు.
జే.ఎన్.టి.యు హైదరాబాద్, కాకతీయ యూనివర్సిటీ లలో కోచ్‌గా పనిచేసి ఆల్ ఇండియా ఇంటర్ యూనివ ర్సిటీ పోటీలకు క్రీడాకారులను సిద్ధం చేశారు.
2020 ప్రమాదం: జీవితాన్ని మార్చిన మలుపు.!
2020లో ఆల్ ఇండియా యూనివర్సిటీ గేమ్స్ నుంచి తిరిగి వచ్చిన కొద్దికాలానికే తీవ్ర రోడ్డు ప్రమాదానికి గురయ్యారు.చికిత్స, పునరావాసం (రిహాబిలిటేషన్), ఫిజియోథెరపీపై దృష్టి పెట్టి వచ్చింది.అయినా ఆ పరిస్థితిని జీవితానికి ముగింపుగా భావించకుండా, పారా తైక్వాండోలో కొత్త ప్రయాణాన్ని ప్రారంభించారు.
నిరంతర సాధన,పట్టుదలతో తిరిగి క్రీడారంగంలోకి అడుగుపెట్టారు.
"కోమా" నుంచి ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతకం వరకు పారా తైక్వాండోలోకి పునరాగమనం చేసిన గౌతమ్ యాదవ్ అంతర్జాతీయ స్థాయిలో అద్భుత విజయాలు సాధించారు.
ప్రధాన విజయాలు:
2024: వరల్డ్ పారా తైక్వాండో పూమ్సే ఛాంపియన్‌షిప్ (బహ్రెయిన్) - స్వర్ణ పతకం




2024: కే.టి.ఏ ఆన్‌లైన్ ఇంటర్నేషనల్ పారా తైక్వాండో ఛాంపియన్‌షిప్ (ఇంగ్లాండ్) - స్వర్ణ పతకం
2025: 10వ ఆసియన్ పారా టైక్వాండో ఛాంపియన్‌షిప్ (మలేషియా) - రజత పతకం
2026: 5వ ఇండియా తైక్వాండో ఓపెన్ నేషనల్ ఛాంపియన్‌షిప్ (పుణే) - స్వర్ణ పతకం
2026: 3వ తెలంగాణ స్టేట్ పారా తైక్వాండో ఛాంపియన్‌షిప్ (వరంగల్) - స్వర్ణ పతకం
సీనియర్ నేషనల్ పారా టైక్వాండో ఛాంపియన్‌షిప్స్‌లో 4 స్వర్ణ పతకాలు, తెలంగాణ స్టేట్ ఛాంపియన్‌షిప్స్‌లో 3 స్వర్ణ పతకాలు, బెంగళూరులో జరిగిన 4వ నేషనల్ పోటీలలో స్వర్ణ పతకాలు సాధించారు.
ఛాంపియన్లను తయారుచేస్తూ...
ప్రస్తుతం వారు"ఎస్.ఎం.ఏ" తైక్వండో' ద్వారా పారా తైక్వాండో క్రీడాకారులకు శిక్షణ, మెంటార్‌షిప్ అందిస్తున్నారు.ఆయన మార్గదర్శకత్వంలో శిక్షణ పొందిన క్రీడాకారులు ఇప్పటివరకు 2 అంతర్జాతీయ పతకాలు,17 జాతీయ స్థాయి పతకాలు సాధించారు.
ప్రభుత్వానికి విజ్ఞప్తులు:
ఉచిత రిహాబిలిటేషన్ సెంటర్లు: స్పైనల్ కార్డ్ గాయాలైన(స్పైనల్ కార్డ్ ఇంజురీ) పేద బాధితుల కోసం ప్రతి జిల్లాలో ఉచిత ఫిజియోథెరపీ, రీహాబిలిటేషన్ మరియు స్పోర్ట్స్ రిహాబిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని
క్రీడాకారులకు ఆర్థిక సాయం: వీసా, విమాన టికెట్లు, వసతి, క్రీడా పరికరాల ఖర్చులు భారంగా మారకుండా అంతర్జాతీయ పారా క్రీడాకారులకు ప్రభుత్వం ముందస్తు ఆర్థిక సాయం అందించాలని. ఉద్యోగ భద్రత (జీ.ఓ. నం. 73): పారా స్పోర్ట్‌స్‌ను జీ. ఓ. నం. 73లో చేర్చి, అంతర్జాతీయ పారా పతక విజేతలకు స్పోర్ట్స్ కోటా ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.
సమగ్ర పారా స్పోర్ట్స్ విధానం:
పునరావాసం,శిక్షణ, పరికరాలు, ఉద్యోగ భద్రతలను కలిపి ఒక సమగ్ర పారా స్పోర్ట్స్ విధానాన్ని రూపొం దించాలంటున్నారు. “పరిస్థితులు మనల్ని ఆపవచ్చు. కానీ మన సంకల్పాన్ని ఆపలేవు. కోమా నుంచి ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతకం వరకు తన ప్రయాణం నన్ను ఛాంపియన్‌గా చేసింది.కానీ పార తైక్వాండో లో అనేక మంది క్రీడాకారుల్ని ఛాంపియన్ లు గా తీర్చిదిద్దిన రోజే నా ప్రయాణానికి నిజమైన అర్థం వస్తుందని,తుది శ్వాస వరకు తైక్వాండో క్రీడా కోసం పరితపిస్తానని, ప్రపంచ స్థాయిలో తెలంగాణ క్రీడాకారులు విజయ భావుట ఎగరవేసేవరకు విశ్రమించేది లేదన్నారు. అంతేకాకుండా తను ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితుల్లో వారి సోదరుడు గణేష్ యాదవ్ వారికి వెన్నుదన్నుగా నిలబడ్డారని అన్నారు.

**— ఎల్లావుల గౌతమ్ యాదవ్ (అంతర్జాతీయ పారా తైక్వాండో క్రీడాకారుడు, కోచ్, మెంటార్)**

# ఆగస్టు 31 లోగా చేయూత పింఛన్లకు దరఖాస్తు చేసుకోవాలి

**– జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**జనగామ, ఆగస్టు 28 (వుదయం ప్రతినిధి) :**



తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన చేయూత సామాజిక భద్రతా పింఛన్లకు అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కోరారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో చేయూత పింఛన్ల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, కల్లుగీత, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులు మరియు రక్త సంబంధిత వ్యాధులు ఉన్నవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. గ్రామ, వార్డు స్థాయిల్లో ఫ్లెక్సీలు, కరపత్రాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు జిల్లాలో మొదటి విడత కింద సుమారు 7,500 దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా వచ్చాయని వెల్లడించారు. దరఖాస్తు ప్రక్రియలో మహిళా సమాఖ్యలు అర్హులకు అండగా నిలవాలని సూచించారు.
వితంతువులు / ఒంటరి మహిళలు: 18 ఏళ్లు పైబడిన వారు (అవివాహిత ఒంటరి మహిళలకు పల్లెల్లో 30, పట్టణాల్లో 35 ఏళ్లు). భర్త మరణ ధ్రువీకరణ లేదా విడిపోయిన ఆధారాలు తప్పనిసరి.
దివ్యాంగులు, రక్త సంబంధిత బాధితులు: సదరం (SADAREM/UDID) ద్వారా 40% వైకల్యం (వినికిడి లోపానికి 51%).
గీత, చేనేత కార్మికులు: 50 ఏళ్లు పైబడి సంబంధిత శాఖల ధ్రువీకరణ ఉన్నవారు.
దరఖాస్తు విధానం:
అర్హులు https://cheyutha.telangana.gov.in వెబ్‌సైట్ నుండి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పూర్తి చేసిన దరఖాస్తులను గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు/ ఎంపీడీఓలకు, పట్టణ ప్రాంతాల్లో వార్డు అధికారులు/మున్సిపల్ కమిషనర్లకు సమర్పించాలి. ఈ కార్యక్రమంలో ఏపీడీ నూరుద్దీన్, డీపీఎం సతీష్, అడ్మిన్ అసిస్టెంట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**
**జయశంకర్ భూపాలపల్లి: ఆగస్టు 28 (వుదయం జిల్లా ప్రతినిధి)**



జిల్లాలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులతో పాటు గుడిసెల సర్వేను పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు.శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ, డిఆర్డీఓ, ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు మున్సిపల్ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల, మున్సిపాలిటీ వారీగా మంజూరైన ఇళ్లు, నిర్మాణాల పురోగతి, పెండింగ్‌లో పనులు, గుడిసెల సర్వే తదితర అంశాలను సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు 4,562 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, 851 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. ఇంకా వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని, ముఖ్యంగా ఆర్‌సీసీ, రూఫ్ లెవెల్ దశల్లో ఉన్న ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సెప్టెంబర్ 15 నాటికి నిర్దేశిత లక్ష్యాలను సాధించేలా నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. భూపాలపల్లి మండలంలో అదనంగా 200 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడంతో పాటు, భూపాలపల్లి నియోజకవర్గంలో మొత్తం 1,100 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించి, సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలన్నారు.నిర్మాణాలు ఇంకా ప్రారంభం కాని ఇళ్ల విషయంలో నిధుల సమస్య, లబ్ధిదారుల అనాసక్తి, సాంకేతిక లేదా ఇతర కారణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి స్పష్టంగా నమోదు చేయాలని స్పష్టంచేశారు. లబ్ధిదారులతో మాట్లాడి సాధ్యమైనంత త్వరగా నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులైన పేదలందరికీ ఇండ్లు మంజూరుకు ప్రభుత్వ ప్రాధాన్యత మేరకు గుడిసెల సర్వేను పారదర్శకంగా, త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వేలో ఎలాంటి అర్హత కలిగిన కుటుంబం మిగిలిపోకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు.భాస్కర్ గడ్డ 2బీహెచ్‌కే లేఅవుట్‌లో సీవరేజ్, విద్యుద్దీకరణ, తాగునీటి సరఫరా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, లబ్ధిదారులకు సంబంధించిన బిల్లుల చెల్లింపు ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని సూచించారు. ఈ నెల 31వ తేదీ సోమవారం రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి నిర్వహించనున్న సమీక్షా సమావేశానికి అవసరమైన పూర్తి వివరాలు, నిర్మాణాల పురోగతి, పెండింగ్ అంశాలు, లక్ష్యాల సాధనపై నివేదికలను సిద్ధంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిఆర్డీఓ బాలకృష్ణ, పీఆర్ ఈఈ విద్యాసాగర్,శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ ఏఈ రాయలింగు, అన్ని మండలాల ఎంపిడిఓలు, గృహ నిర్మాణ శాఖ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

# సిఎం రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన మహిళా కాంగ్రెస్ నేత ఎర్రబెల్లి స్వర్ణ



హనుమకొండ టౌన్, ఆగస్టు 28 (వుదయం ప్రతినిధి) : రాఖీ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, శుక్రవారం ముఖ్యమంత్రి నివాసంలో సీఎంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి ఆమె రాఖీ కట్టి, శుభాకాంక్షలు తెలియజేశారు.
అనంతరం స్వర్ణ మాట్లాడుతూ, అన్నాచెల్లెళ్ల అనుబంధానికి రాఖీ పండుగ ప్రతీక అని పేర్కొన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సాధికారతకు, రక్షణకు పెద్ద పీట వేస్తోందని తెలిపారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరా మహిళా శక్తి ద్వారా మహిళలను పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సహించడం, ఉచిత ఆరోగ్య పరీక్షల వంటి పథకాలతో ప్రభుత్వం మహిళా సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు.
రాష్ట్ర ఆడబిడ్డలకు అన్నగా నిలుస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షిస్తూ రాఖీ కట్టినట్లు ఆమె తెలిపారు.

# కలెక్టరేట్ లో ఘనంగా రాఖీ పండుగ వేడుకలు



**జయశంకర్ భూపాలపల్లి,ఆగస్టు 28 (వుదయం జిల్లా ప్రతినిధి)**
రాఖీ పండుగను పురస్కరించుకుని శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, కలెక్టరేట్ మహిళా సిబ్బంది జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మకు రాఖీలు కట్టి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సహోదరత్వం, ఆత్మీయత, పరస్పర రక్షణకు ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ ప్రాశస్త్యాన్ని స్మరించుకున్నారు. కార్యాలయ విధుల నిర్వహణలో జిల్లా కలెక్టర్ అందిస్తున్న మార్గదర్శకత్వం, సహకారానికి మహిళా సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.అనంతరం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జిల్లా ప్రజలకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అభివృద్ధిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో మహిళా అధికారులు, సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. మహిళా ఉద్యోగులకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ, వారి సంక్షేమం, భద్రతకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సీనియర్ సహాయకులు విజయ, అనురాధ, సుమలత, జూనియర్ సహాయకులు మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే నాయినికి రాఖీ కట్టిన ఎంపీ కావ్య



హనుమకొండ టౌన్, ఆగస్టు 28 (వుదయం ప్రతినిధి) : రాఖీ పౌర్ణమి సందర్భంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య రాఖీ కట్టారు. ఈ సందర్భంగా అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను పురస్కరించుకుని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి ఎంపీ కావ్య రాఖీ కట్టి, వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఇరువురు పరస్పరం రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

# బాలికల విద్యే దేశ సాధికారతకు పునాది



ప్రెస్ రిలీజ్.
తేదీ: 28.08.2026.
ములుగు జిల్లా.

**“బాలికను చదివిద్దాం–దేశాన్ని సాధికారత వైపు నడిపిద్దాం"**
**బాలికలను ఆశీర్వదించి మిఠాయిలు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.**

**ములుగు, ఆగస్టు 28 (వుదయం ప్రతినిధి) :**
రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకొని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలసదనం బాలికలు శుక్రవారం ములుగు నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావును కలిసి రాఖీలు కట్టారు.
“బాలికను చదివిద్దాం-దేశాన్ని సాధికారత వైపు నడిపిద్దాం” అనే సందేశంతో ప్రత్యేకంగా రూపొందించిన రాఖీలను కలెక్టర్‌కు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాలికలను ఆప్యాయంగా పలకరించి ఆశీర్వదించడంతోపాటు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాలికలతో మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని జీవితంలో మంచి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.జిల్లా సంక్షేమ అధికారి ఇ.పి. ప్రేమలత మాట్లాడుతూ రక్షాబంధన్ ప్రేమానుబంధంతోపాటు పరస్పర బాధ్యత, రక్షణకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ఒక బాలికను చదివించడం ద్వారా ఆమె భవిష్యత్తుతోపాటు కుటుంబం, సమాజం, దేశ పురోగతికి బాటలు వేయవచ్చని పేర్కొన్నారు. బాలికలకు సురక్షితమైన వాతావరణం, సమాన అవకాశాలు కల్పించి వారి ప్రతిభను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలల సహాయవాణి జిల్లా సమన్వయకర్త నరేష్, బాలసదనం సిబ్బంది అరుణ, రాణి, సఖి కేంద్రం సిబ్బంది లావణ్య, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు

# చిల్డ్రన్ హోమ్ విద్యార్థులతో రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట, ఆగస్టు 28 వుదయం ప్రతినిధి**
రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం కలెక్టర్ ఛాంబర్ నందు సూర్యాపేట జిల్లాలోని చిల్డ్రన్ హోమ్ విద్యార్థులతో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ రక్షాబంధన్ వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిల్డ్రన్ హోమ్ విద్యార్థినులు జిల్లా కలెక్టర్ కు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించి, వారి చదువు, ఆరోగ్యం, భవిష్యత్ లక్ష్యాల గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రక్షాబంధన్ పండుగ సోదరసోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, పరస్పర గౌరవం, రక్షణకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు.చిల్డ్రన్ హోమ్ లోని పిల్లలు బాగా చదువుకొని, క్రమశిక్షణతో ముందుకు సాగి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు జిల్లా కలెక్టర్ మిఠాయిలు అందించి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కె. నరసింహారావు, జి.హుస్సేన్, జిల్లా బాలల రక్షణ అధికారి బి.రవి కుమార్, మహిళా సాధికారిత కోఆర్డినేటర్ ఎం.చైతన్య, చిల్డ్రన్ హోమ్ సిబ్బంది, మహిళా సాధికారిత సిబ్బంది, జిల్లా బాలల రక్షణ యూనిట్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# బిఎల్ఏ లతో సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే మట్టా దంపతులు

**సత్తుపల్లి ఆగస్టు 28 (వుదయం ప్రతినిధి)**



మాధురి ఫంక్షన్ హల్ లో సత్తుపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ ఆధ్వర్యంలో సత్తుపల్లి నియోజకవర్గ స్థాయిలో బూత్ లెవల్ ఏజెంట్ల బిఎల్ఏ లతో సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమం కు ముఖ్య అతిథులుగా సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఎస్ ఐ ఆర్ ఇంచార్జ్ దైద రవీంద్ర పాల్గొన్నారు..ఈ సమావేశానికి మున్సిపల్ చైర్మన్ లు, వైస్ చైర్మన్ లు, ఏఎంసీ చైర్మన్ లు, వైస్ చైర్మన్ లు, కౌన్సిలర్స్,5 మండలాల మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు,మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు,మహిళా నాయకులు, బి ఎల్ ఏ లు మరియు నాయకులు పాల్గొన్నారు.

# 22ఏ భూముల సమస్యల పరిష్కారంలో పారదర్శకంగా వ్యవహరించాలి.. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**22ఏ నుంచి తొలగించే ప్రతి సర్వే నంబర్‌కు స్పష్టమైన కారణాలు, రిమార్క్స్ నమోదు చేయాలి**
**22ఏ భూముల సమస్యపై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్**
**ఖమ్మం వుదయం బ్యూరో ఆగస్టు -28**



22ఏ నిషేధిత భూముల సమస్యల పరిష్కారంలో అధికారులు పకడ్బందీగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు. 22ఏ జాబితాలో ఉన్న ప్రతి సర్వే నంబర్‌ను సంబంధిత రెవెన్యూ రికార్డులతో పూర్తి స్థాయిలో పరిశీలించి, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా వివరాలను నిర్ధారించాలని ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం 22ఏ భూముల సమస్యలపై అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి రెవెన్యూ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ సమయంలో కొన్ని భూములు 22ఏ నిషేధిత జాబితాలో ఉన్నట్లు గుర్తించబడుతున్నా యని తెలిపారు. 22ఏకు సంబంధించి రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వస్తున్న ఫిర్యాదులను రెవెన్యూ అధికారులకు పంపిస్తున్నారని, వాటిపై సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి నివేదికలను క్రమం తప్పకుండా సమర్పించాలని సూచించారు.22ఏ భూముల పరిశీలన, నమోదు, తొలగింపు ప్రక్రియకు జిల్లావ్యాప్తంగా ఒకే విధమైన సాధారణ ఫార్మాట్‌ను రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. నిషేధిత భూములను ప్రధానంగా ఐదు కేటగిరీలుగా గుర్తించాలని తెలిపారు. 22ఏ నిషేధిత భూముల ఐదు కేటగిరీలు:
మొదటి కేటగిరీలో రాష్ట్ర, కేంద్ర చట్టాల పరిధిలోని నిషేధిత భూములు ఉంటాయని తెలిపారు. అసైన్‌మెంట్ భూములు, సీలింగ్ యాక్ట్, టెనెన్సీ యాక్ట్, ఆర్ఓఎఫ్ఆర్ తదితర చట్టాల పరిధిలోని భూములు ఉంటాయని వీటిలో వ్యవసాయ, వ్యవసాయేతర భూముల రకాలు ఉంటాయని పేర్కొన్నారు. రెండవ కేటగిరీలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ భూములు, మూడవ కేటగిరీలో ఎండోమెంట్, వక్ఫ్ భూములు, నాలుగవ కేటగిరీలో సీలింగ్, అర్బన్ సీలింగ్‌కు సంబంధించిన భూములు, ఐదవ కేటగిరీలో ప్రభుత్వ ప్రయోజనాలను పరిరక్షించాల్సిన ఇతర భూములు ఉంటాయని తెలిపారు. అదే సమయంలో ప్రభుత్వ భూములను కాజేయాలనే స్వార్థ ప్రయోజనాలు కలిగిన వ్యక్తులు ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం లేదా అపోహలు వ్యాప్తి చేయడం ద్వారా తమకు అనుకూలంగా భూములను 22ఏ నుంచి తొలగించుకునే ప్రయత్నాలు చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు. నిజమైన కేసుగా నిర్ధారణ అయిన భూములను అవసరమైన రికార్డులను పరిశీలించి 48 గంటల్లోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడవద్దని స్పష్టం చేశారు.
22ఏ నుంచి తొలగింపులకు ప్రత్యేక విధానం:
ఏదైనా ప్రైవేట్ భూమి పొరపాటున 22ఏ నిషేధిత జాబితాలో నమోదైనట్లు నిర్ధారణ అయితే, దానిని తొలగించేందుకు సర్వే నంబర్ వారీగా డిలీటెడ్ లిస్ట్ రూపొందించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ తెలిపారు. 22ఏ భూములకు సంబంధించిన ఫిర్యాదులపై అధికారులు సమన్వయంతో పనిచేసి, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం మాత్రమే నిర్ణయాలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లాలోని మండల తహశీల్దార్లు, నాయబ్ తహశీల్దార్లు, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కొత్త పింఛన్ల పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ సత్య శారద

**వరంగల్, ఆగస్టు 28 (వుదయం ప్రతినిధి) :**



అర్హులైన ప్రతి ఒక్కరికీ సామాజిక భద్రత పింఛన్లు అందేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టరేట్‌లో చేయూత సామాజిక భద్రత పింఛన్లకు సంబంధించిన అవగాహన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆవిష్కరించారు. కొత్తగా పింఛన్లు పొందేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకునేలా ప్రజలకు విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆమె సూచించారు.చేయూత సామాజిక భద్రత పింఛన్ల కోసం ఆగస్టు 31, 2026 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. అర్హులైన వారు గడువు ముగిసేలోగా దరఖాస్తు చేసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 2.25 లక్షల మంది అర్హులకు సామాజిక భద్రత పింఛన్లు అందించనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో డియార్వో విజయలక్ష్మి , డిఆర్డిఓ నాగపద్మజా,అడిషనల్ పిడి శ్రీనివాస్, డిపిఎం పెన్షన్ రేవతి తదితరులు పోస్టర్ ఆవిష్కరణలో పాల్గొన్నారు.

# ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయికి రాఖీ కట్టిన బాలసదన్ బాలికలు

**హనుమకొండ, ఆగస్టు 28 (వుదయం ప్రతినిధి) :**
హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో రక్షాబంధన్ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. జిల్లా కలెక్టర్ చాంబర్ లో కలెక్టర్ చాహత్ బాజ్ పాయి కి సుబేదారి లోని బాలసదన్ బాలికలు రాఖీ కట్టారు. రాఖీ పర్వదిన ప్రాముఖ్యతను జిల్లా కలెక్టర్ వివరిస్తూ అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల ఆత్మీయతకు, ఆప్యాయతకు అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ అని వివరించారు. బాల సదన్ బాలికలకు రక్షణగా నిలబడాలని తెలిపారు.
ఈ వేడుకలలో బాలికలకు కలెక్టర్ రాఖీ కట్టారు. రక్షాబంధన్ రోజున తనకు రాఖీని కట్టిన బాలికలకు జిల్లా కలెక్టర్ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు.
రాఖీ పర్వదిన సందర్భంగా జిల్లా కలెక్టర్ తో కలిసి వేడుకలు జరుపుకోవడం పట్ల బాలికలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, బాల సదన్ సూపరింటెండెంట్ కళ్యాణి, బాల సదన్ బాలికలు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రయాణికుల కష్టాలు తీర్చేలా ఆర్ఓబీ పనులు వేగవంతం చేయాలి: కలెక్టర్

**గౌరెడ్డిపేట, కన్నాల, కుందన్‌పల్లి లెవల్ క్రాసింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి**

**పనుల్లో జాప్యం లేకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలి**



**పెద్దపల్లి, ఆగస్టు 28 (వుదయం ప్రతినిధి)**

ప్రయాణికుల కష్టాలను తీర్చే విధంగా జిల్లాలో చేపడుతున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.శుక్రవారం ఐడీఓసీలో కన్నాల ఆర్ఓబీ పనులపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ లెవల్ క్రాసింగ్‌ల వద్ద చేపడుతున్న పనుల పురోగతిని అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీరాములు తో కలిసి సమీక్షించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, గౌరెడ్డి పేట, కన్నాల, కుందన్‌పల్లి ప్రాంతాల్లో చేపడుతున్న లెవల్ క్రాసింగ్ సంబంధిత రహదారి, ఆర్ఓబీ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. పనులు పూర్తయితే ఆయా ప్రాంతాల్లో ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బందులు తగ్గడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు కూడా పరిష్కారమవుతాయని తెలిపారు.పనుల పురోగతిలో ఎదురవుతున్న సమస్యలను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని, ఎలాంటి జాప్యానికి అవకాశం ఇవ్వకుండా పనులను నిర్దేశిత సమయంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో పెద్దపల్లి ఏడి సర్వేయర్ సోమేశ్వర్, ఆర్డీఓ గంగయ్య, ఆర్అండ్‌బీ ఈఈ భా వ్సింగ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రీ-సర్వేను అత్యంత పారదర్శకంగా పకడ్బందీగా నిర్వహించాలి..కలెక్టర్



**జగిత్యాల ఆగస్టు 27 (వుదయం ప్రతినిధి)**

జిల్లాలో చేపట్టిన గ్రామాల రీ సర్వే కార్యక్రమాన్ని ప్రభుత్వ మార్గదర్శకాలు నిర్దేశిత కార్యాచరణ ప్రకారం అత్యంత పారదర్శకంగా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాలోని తహసీల్దార్లు గిర్దావర్లు గ్రామ పాలనాధికారులకు (జీపీఓఎస్) గ్రామాల రీ సర్వే ప్రక్రియపై సమగ్ర శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే ద్వారా గ్రామాల్లోని ప్రతి భూ కమతాన్ని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఖచ్చితంగా కొలిచి భూ రికార్డులను నవీకరించడం జరుగుతుందని తెలిపారు భూ యజమానుల హక్కుల పరిరక్షణతో పాటు భవిష్యత్తులో భూ వివాదాలను నివారించడమే రీ సర్వే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రీ సర్వే ప్రారంభానికి ముందు గ్రామ స్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించి భూ యజమానులు పట్టాదారులు రైతులు ప్రజాప్రతినిధులకు సర్వే కార్యక్రమంపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామ సరిహద్దులు ప్రభుత్వ భూములు అటవీ భూములు చెరువులు కుంటలు వాగులు రహదారులు శ్మశానవాటికలు ప్రజా అవసరాలకు కేటాయించిన భూములు తదితర సామూహిక ఆస్తులను స్పష్టంగా గుర్తించి రికార్డు చేయాలని ఆదేశించారు. సర్వే సమయంలో రెవెన్యూ రికార్డులు పాత గ్రామ పటాలు సేత్వార్ టిప్పన్ ఖాస్రా పహాణి ప్రస్తుత భూ రికార్డులు రిజిస్ట్రేషన్ పత్రాలు క్షేత్ర స్థాయి వాస్తవ పరిస్థితులను సమగ్రంగా పరిశీలించాలని తెలిపారు. పాత సర్వే నంబర్లు కొత్త భూ కమతాల మధ్య సంబంధాన్ని తెలియజేసే కోరిలేషన్ స్టేట్‌మెంట్ ఫీల్డ్ రిజిస్టర్ ల్యాండ్ పార్సిల్ మ్యాప్ గ్రామ పటం తదితర రికార్డులను ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా రూపొందించాలని సూచించారు. భూ కమతాల కొలతలు పూర్తయిన అనంతరం సంబంధిత భూ యజమానులకు నోటీసులు జారీ చేసి వారి సమక్షంలో హద్దులను నిర్ధారించాలని తెలిపారు. అభ్యంతరాలు క్లెయిమ్‌లు వచ్చినప్పుడు వాటిని నిర్ణీత గడువులో స్వీకరించి రికార్డులు క్షేత్ర స్థాయి పరిస్థితులను పరిశీలించిన తర్వాత నిష్పక్షపాతంగా పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామ పాలనాధికారులు క్షేత్ర స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండి సర్వే బృందాలకు అవసరమైన భూ రికార్డులు స్థానిక సమాచారం అందించాలని సూచించారు. గిర్దావర్లు రోజువారీ సర్వే పనులను పర్యవేక్షించాలని తహసీల్దార్లు మండల స్థాయిలో మొత్తం ప్రక్రియను సమన్వయం చేస్తూ పురోగతిని నిరంతరం సమీక్షించాలని తెలిపారు. రీ సర్వే అనేది కేవలం భూములను కొలిచే కార్యక్రమం మాత్రమే కాదని గ్రామంలోని ప్రతి అంగుళం భూమికి సంబంధించిన సమగ్రమైన శాశ్వతమైన విశ్వసనీయమైన రికార్డును రూపొందించే కీలక కార్యక్రమమని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. అధికారులు సమన్వయంతో బాధ్యతాయుతంగా పని చేసి రీ సర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. శిక్షణ కార్యక్రమంలో రీ సర్వేకు సంబంధించిన ముందస్తు కార్యక్రమాలు గ్రామ సరిహద్దుల నిర్ధారణ గ్రౌండ్ ట్రూతింగ్ భూ కమతాల కొలత మ్యాపుల తయారీ రికార్డుల పరిశీలన ఫారాలు రిజిస్టర్ల నిర్వహణ అభ్యంతరాల పరిష్కారం తుది భూ రికార్డుల రూపకల్పన తదితర అంశాలను అధికారులకు సవివరంగా వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (రెవిన్యూ) బిఎస్ లత ఫారెస్ట్ ఆర్ అండ్ బి పంచాయతీ రాజ్ ఇరిగేషన్ జిల్లా అధికారులు రెవెన్యూ సర్వే ల్యాండ్ రికార్డుల శాఖ అధికారులు తహసీల్దార్లు మండల సర్వేయర్లు గిర్దావర్లు గ్రామ పాలనాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ హియరింగ్ ప్రక్రియను పరిశీలించిన అదనపు కలెక్టర్

**అర్హులైన ఓటర్ల వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా చర్యలు చేపట్టాలి**



**కామారెడ్డి, ఆగస్టు 28 (వుదయం ప్రతినిధి):**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా పిట్లం మండలంలోని బొల్లక్‌పల్లి, మద్దెల చెరువు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ హియరింగ్ ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్, శుక్రవారం పరిశీలించారు. పిట్లం మండల తహసీల్దార్, పీడీసీ అధికారితో కలిసి ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన హియరింగ్ కేంద్రాలను అదనపు కలెక్టర్ సందర్శించి, హియరింగ్ ప్రక్రియ నిర్వహణ తీరును పరిశీలించారు. నోటీసులు అందుకున్న ఓటర్ల నుంచి సమర్పిస్తున్న ధ్రువపత్రాలు, ఆధారాలను పరిశీలించి, నిబంధనల ప్రకారం ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ విక్టర్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు ప్రత్యేకశ్రద్ధ వహించాలనిఅన్నారు. హియరింగ్‌కు హాజరయ్యే ఓటర్లకు అవసరమైన సమాచారం, మార్గదర్శకాలనుఅందించి, వారి అభ్యంతరాలు, వివరణలను నిబంధనల మేరకు నమోదు చేయాలని సూచించారు. హియరింగ్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ట్రైనింగ్డిప్యూటీ కలెక్టర్రవి తేజ, పిట్లం మండల తహసీల్దార్, పీడీసీ అధికారి, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లా ప్రజలకు రాఖీ పండగ శుభాకాంక్షలు: కలెక్టర్



**నిర్మల్ జిల్లా 28 ఆగస్ట్ 2026 (వుదయం ప్రతినిధి)**

రాఖీ పండగ (రక్షాబంధన్) సందర్భంగా ప్రజలందరికీ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలు, ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్‌ను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. మహిళలకు రక్షణ, గౌరవం కల్పించాలనే బాధ్యతను ఈ పండుగ గుర్తుచేస్తుందని తెలిపారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి పండుగను సంతోషంగా, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, సిరిసంపదలు వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ మరోసారి జిల్లా ప్రజలందరికీ రాఖీ పండగ శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజలకు అంతరాయం లేకుండా త్రాగునీటిని అందించాలి- కలెక్టర్



**మంచిర్యాల/ఆగస్టు 28 (వుదయం ప్రతినిధి)**

ప్రజలకు త్రాగునీటి ఇబ్బంది లేకుండా నిరంతరాయంగా సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని చెన్నూర్ పట్టణంలో అమృత్ 2.0 పథకం క్రింద కొనసాగుతున్న నీటి ట్యాంక్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు ప్రతినిత్యం నిరంతరాయంగా త్రాగునీటిని అందించేందుకు చేపట్టిన అమృత్ 2.0 పథకంలో నీటి ట్యాంక్ నిర్మాణం, పైప్ లైన్ల పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి ప్రహరీ గోడ, ఆసుపత్రిలోని పనులను పరిశీలించి వేగవంతం చేయాలని తెలిపారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న అదనపు గదుల పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. తరగతి గదులు, వంటశాలను పరిశీలించి వంట సిబ్బంది ఆహారం తయారీ సమయంలో శుభ్రత నిబంధనలు పాటించాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఎలాంటి సమాచారం లేకుండా విధులకు గైర్హాజరైన ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తహసిల్దార్ మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ లతో కలిసి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ, రీ సర్వే నిర్వహణ తీరును పరిశీలించారు. ఎస్ ఐ ఆర్ నోటీసుల జారీ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని, బూత్ స్థాయి అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వహించేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. భూముల రీ సర్వే లో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ, అటవీ భూములు, గ్రామాల హద్దుల నిర్ధారణ సమర్థవంతంగా చేపట్టాలని, రెవెన్యూ రికార్డులను సక్రమంగా సిద్ధం చేసి అవసరమైన సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని తెలిపారు. భూభారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ వేగవంతం చేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల నివాసంలో రాఖీ పౌర్ణమి వేడుకలు



**కరీంనగర్ ఆగస్టు 28 (వుదయం ప్రతినిధి):**

కరీంనగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర మాజీ మంత్రి గంగుల కమలాకర్ నివాసంలో రాఖీ పౌర్ణమి వేడుకలు అత్యంత ఘనంగా, పండుగ వాతావరణంలో జరిగాయి. అన్నాచెల్లెళ్ల పవిత్ర బంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలను గంగుల కుటుంబ సభ్యులు ప్రతి ఏటా మాదిరిగానే ఈసారికూడా ఎంతో ఉత్సాహంగా, ఆనందోత్సాహాల మధ్య నిర్వహించుకున్నారు.ఈ వేడుకల్లో భాగంగా గంగుల కమలాకర్ సోదరీమణులు పుష్పలత, స్వర్ణలత, అరుణలతలు తమ సహోదరులైన గంగుల కమలాకర్ తో పాటు వెంకన్న, సుధాకర్‌లకు ఘనంగా రాఖీలు కట్టారు. తమ సోదరుల ఆయురారోగ్యాలు, క్షేమాన్ని కాంక్షిస్తూ మణికట్టుపై రక్షాసూత్రం కట్టి, ప్రేమతో మిఠాయిలు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా సోదరీమణులు మాట్లాడుతూ, తాము ఎక్కడ ఉన్నప్పటికీ ప్రతి ఏటా ఈ పండుగ రోజున కచ్చితంగా కలుసుకొని రాఖీ కట్టడం తమ కుటుంబంలో ఆనవాయితీగా వస్తోందని, ఈ బంధం ఎప్పటికీ ఇలాగే నిలవాలని ఆకాంక్షించారు.కేవలం పెద్దలకే పరిమితం కాకుండా, కుటుంబంలోని తదుపరి తరాల మధ్య కూడా ఈ వేడుకలను అత్యంత సరదాగా జరుపుకున్నారు. గంగుల కమలాకర్ కుమారునికి వారి సోదరి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా సుధాకర్ కుమారునికి, వెంకన్న కుమారులకు, అలాగే గంగుల ప్రభాకర్ కుమారులకు సోదరీమణులు రక్షాబంధన్ వేడుకల్లో భాగంగా రాఖీలు కట్టి ఆప్యాయంగా శుభాకాంక్షలు అందజేసుకున్నారు. కుటుంబ సభ్యులందరూ ఒక్కచోట చేరి జరుపుకున్న ఈ వేడుకలతో గంగుల నివాసంలో సందడి వాతావరణం చోటుచేసుకుంది.

# చలానా కాదు.. రాఖీ కట్టి భద్రతపై అవగాహన..!



**కామారెడ్డి, ఆగస్టు 28 (వుదయం ప్రతినిధి):**

–రాఖీ పండుగ సందర్భంగా కామారెడ్డి ట్రాఫిక్ పోలీసులు వినూత్న కార్యక్రమం నిర్వహించి వాహనదారులకు ప్రాణ భద్రతపై ఆప్యాయతతో కూడిన బలమైన సందేశాన్ని అందించారు. సాధారణంగా హెల్మెట్ లేకుండా వాహనం నడిపే వారికి చలానా విధించే పోలీసులు.. ఈసారి జరిమానా కంటే చైతన్యానికి, అవగాహనకు ప్రాధాన్యతనిస్తూ రాఖీ కట్టి బాధ్యతను గుర్తు చేశారు.కామారెడ్డి డీఎస్పీ మధుసూదన్ ఆదేశాల మేరకు పట్టణ సీఐ నరహరి ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఎస్ఐ చంద్రశేఖర్ గౌడ్, ఎస్ఐ వినయ్ సాగర్, మహిళా ట్రాఫిక్ సిబ్బంది పోలీస్ స్టేషన్ ఎదుట ప్రత్యేక రోడ్డు భద్రత అవగాహనకార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలపై వచ్చిన వాహనదారులను ఆపి.. మహి ళా పోలీస్ సిబ్బంది వారికి బొట్టుపెట్టి, రాఖీ కట్టి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం "అన్నా.. హెల్మెట్ పెట్టుకో.. నీ కుటుంబం నీ కోసం ఎదురుచూస్తోంది. మీ భద్రత కోసం తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనం నడపండి" అంటూ ప్రేమతో కూడిన సందేశాన్ని అందించారు. హెల్మెట్ ధరించడం కేవలం ట్రాఫిక్ నిబంధన మాత్రమే కాదని.. ప్రతి ద్విచక్ర వాహనదారుడి ప్రాణ రక్షణకు సంబంధించిన బాధ్యత అని పోలీసులు తెలిపారు. ప్రమాద సమయంలో తలకు తీవ్ర గాయాలయ్యే ప్రమాదాన్ని తగ్గించడంలో, ప్రాణాలను కాపాడడంలో హెల్మెట్ కీలక పాత్ర పోషిస్తుందని వివ రించారు. " రాఖీ బంధం.. భద్రతా బంధం" అనే సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమం వాహనదారులను ఆకట్టుకుంది. నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించడం ద్వారా మాత్రమే కాకుండా.. ప్రజల్లో బాధ్యతాయుతమైన డ్రైవింగ్‌పై అవగాహన కల్పించడం ద్వారా శాశ్వత మార్పు తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు.ఈ సందర్భంగా రాఖీ కట్టిన పోలీస్ సిబ్బందికి వాహనదారులు సానుకూలంగా స్పందిస్తూ.. ఇకపై ద్విచక్రవాహనం నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరిస్తామని తెలిపారు. జిల్లా ఎస్పీ యం.రాజేష్ చంద్ర మాట్లాడుతూ, "ప్రాణం విలువైనదే.. హెల్మెట్ మీ రక్షణ కవచం. రాఖీ పండుగ సందర్భంగా మీ కుటుంబం మీపై పెట్టుకున్న ప్రేమ, నమ్మకాన్ని గుర్తు చేసుకుంటూ.. ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించి సురక్షితంగా ఇంటికి చేరాలి. మీరు సురక్షితంగా ఇంటికి చేరితేనే మీ కుటుంబం సంతోషంగా ఉంటుంది" అని సూచించారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు ప్రయాణం ప్రారంభించే ముందు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని జిల్లా పోలీసులు కోరారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి ఎస్ హెచ్ ఓ నరహరి, ట్రాఫిక్ ఎస్ఐ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటు హక్కు కోల్పోకుండా చూడాలి - SIRపై శ్రీకాంత్‌రెడ్డి సూచనలు



**ఆదిలాబాద్, ఆగస్టు 28 (వుదయం ప్రతినిధి):**

SIR ప్రక్రియలో అర్హులైన ఏ ఒక్కరి పేరు ఓటరు జాబితా నుంచి గల్లంతుకాకుండా చూడాలని ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. తాంసి, భీంపూర్ మండలాల్లో పర్యటించిన ఆయన బండల నాగపూర్, నిపాని గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో పాల్గొని ఓటర్లతో మాట్లాడారు.ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి యువతీ, యువకుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో పేరు, చిరునామా, వయస్సు తదితర వివరాల్లో తప్పులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లి సరిచేయించుకోవాలని కోరారు. ప్రతి కుటుంబం తమ ఓటరు వివరాలను పరిశీలించుకోవాలని తెలిపారు.SIR ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఓటరు జాబితా రూపొందించేందుకు ప్రజలు, అధికారులు, బీఎల్ఓలు సమన్వయంతో పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామసభల్లో ప్రజలు తెలిపిన సమస్యలను విన్న శ్రీకాంత్‌రెడ్డి, అవసరమైన అంశాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపారు.కార్యక్రమంలో భీంపూర్ తహసీల్దార్ రమేష్, నిపాని సర్పంచ్ మెల్లెల స్వామి, బండల నాగపూర్ సర్పంచ్ గోలి పుష్పాల, కప్పర్ల సర్పంచ్ గంద్రత్ అరుణ్, శ్రీధర్ రెడ్డి, గంగుల వెంకన్న, గొలే శ్రీకాంత్, ఓం ప్రకాష్ రెడ్డి, వై. గోవర్ధన్ రెడ్డి, ఎస్. భోజ రెడ్డి, బీఎల్ఓ జానవి, హరిత కార్యదర్శి, ఎంఆర్ఓ గణేష్, ఎంపీడీఓ మోహన్ రెడ్డి, గిట్ట వెంకట్ రెడ్డి, గోపిడి కేశవ్ రెడ్డి, నరేష్, గంగన్న, హేమంత్, కార్యదర్శి కార్తీక్, జీపీవో పంజాబ్ రావు, అలీమ్, ఖమరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



**మంచిర్యాల/ రామకృష్ణాపూర్/ఆగస్టు 28 (వుదయం ప్రతినిధి)**

అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా రాఖీ పౌర్ణమి వేడుకలు.. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఉన్న ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా జరుపుకునే రక్షాబంధన్ (రాఖీ పౌర్ణమి) పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా జిల్లాలోని పట్టణాలు, గ్రామాల్లో పండుగ సందడి నెలకొంది. సోదరీమణులు తమ అన్నదమ్ములు, తమ్ముళ్లకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. సోదరులు తమ అక్కాచెల్లెళ్లకు కానుకలు అందజేసి ప్రేమాభిమానాలను చాటుకున్నారు.

**రక్షాబంధానికి ప్రత్యేకమైన ప్రాధాన్యత**

రాఖీ అనేది కేవలం ఒక దారం కాదని, అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఉన్న ప్రేమ, నమ్మకం, అనుబంధానికి ప్రతీకగా భావిస్తారు. జీవితంలో ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ఒకరికొకరు అండగా నిలుస్తామనే ఆత్మీయ భావనను రాఖీ పండుగ ప్రతిబింబిస్తుంది. సోదరీమణులు సోదరుల చేతికి రాఖీ కట్టి, వారి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాల కోసం ప్రార్థించడం ఆనవాయితీగా వస్తోంది.

**రాఖీలు కట్టి.. మిఠాయిలు తినిపించి..**

పండుగ సందర్భంగా ఉదయం నుంచే సోదరీమణులు రాఖీలు, పూజా సామగ్రితో సిద్ధమయ్యారు. కుటుంబ సభ్యుల సమక్షంలో సోదరులకు రాఖీలు కట్టి, నుదుటన తిలకం దిద్ది, మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. సోదరులు సైతం తమ అక్కాచెల్లెళ్లకు బహుమతులు అందించి వారి పట్ల ఉన్న ప్రేమాభిమానాలను వ్యక్తం చేశారు.

**కానుకలతో సోదరుల ఆప్యాయత...**

రక్షాబంధన్ సందర్భంగా సోదరులు తమ అక్కాచెల్లెళ్లకు వివిధ రకాల కానుకలను అందజేశారు. వస్త్రాలు, పుస్తకాలు, ఇతర బహుమతులను ఇచ్చి పండుగను ఆనందంగా జరుపుకున్నారు. రాఖీ కట్టిన అనంతరం కుటుంబ సభ్యులంతా కలిసి మిఠాయిలు పంచుకోవడంతో ఇళ్లలో పండుగ వాతావరణం నెలకొంది.కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేసే పండుగ రాఖీ పౌర్ణమి పండుగ కుటుంబ సభ్యుల మధ్య ఉన్న అనుబంధాన్ని మరింత బలపరుస్తుందని పలువురు పేర్కొన్నారు. ఉద్యోగాలు, విద్య, ఇతర కారణాలతో దూరప్రాంతాల్లో ఉంటున్న అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్లు ఈ సందర్భంగా ఒకచోట చేరి తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. దీంతో చాలా కాలం తర్వాత కలుసుకున్న కుటుంబాల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి.

**సంప్రదాయాలు.. ఆత్మీయతలకు వేదికగా రాఖీ పండుగ**

పలు ప్రాంతాల్లో రక్షాబంధన్ వేడుకలు సంప్రదాయబద్ధంగా నిర్వహించుకున్నారు. పండుగ సందర్భంగా ఇళ్లలో ప్రత్యేక వంటకాలు తయారు చేసి బంధువులు, కుటుంబ సభ్యులతో కలిసి భోజనాలు చేశారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు రాఖీ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. రక్షాబంధన్ పండుగ సోదరసోదరీమణుల మధ్య ప్రేమను, పరస్పర నమ్మకాన్ని, ఆప్యాయతను మరింత పెంపొందించే పవిత్రమైన పండుగగా నిలుస్తోంది. రాఖీ రూపంలో కట్టే చిన్న దారంలో జీవితాంతం కొనసాగే అనుబంధం, ఆత్మీయత, పరస్పర గౌరవం దాగి ఉందని పలువురు అభిప్రాయపడ్డారు. మంచిర్యాల జిల్లాలో ఘనంగా జరిగిన రక్షాబంధన్ వేడుకలతో పండుగ సందడి నెలకొంది.

# అంగన్వాడి కేంద్రంలో రక్షాబంధన్



**ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)**

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు మ ండ ల కేంద్రంలోని నాల్గవ అంగన్‌వాడి కేంద్రంలో గురువారం ర క్షాబ ంధ న్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు రాఖీలు కట్టుకొని స్వీట్లు పంచుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ సామల. రమా శ్రీ, అంబేద్కర్ నగర్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు నవీన్ ,విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



**నిజాంసాగర్ ఆగస్టు 28 (వుదయం ప్రతినిధి) :**

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సంతోషం, ప్రేమ, ఆప్యాయతలను నింపాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతా రావు అన్నారు. రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే ఆధ్వర్యంలో శుక్రవారం జుక్కల్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ యోగినీ బ్రహ్మకుమారి స్వప్నతో పాటు బీడీ కార్మికులు, మహిళా సంఘాల సభ్యులు, మహిళలు, చిన్నారులు ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతా రావుకు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. రాఖీలు కట్టిన వారందరికీ ఎమ్మెల్యే ఆత్మీయంగా రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు.అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమానుబంధాలు ఎల్లప్పుడూ ఇలాగే కొనసాగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. రక్షాబంధన్ పండుగ పరస్పర ప్రేమ, ఆప్యాయతలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు, బీడీ కార్మికులు, మహిళా సంఘాల సభ్యులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.



# నీట్ పీజీ పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు

- పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్

**మహబూబ్‌నగర్, ఆగస్టు 28 (వుదయం ప్రతినిధి):**

జిల్లాలో ఆగస్టు 30న నిర్వహించనున్న నీట్ పీజీ 2026 పరీక్షకు సంబంధించిన ఏర్పాట్లను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ శుక్రవారం పరిశీలించారు.జిల్లా కేంద్రం క్రిస్టియన్ పల్లి లో ఫాతిమా స్కూల్, JPNCE ధర్మాపూర్ లో ఏర్పాటు చేసిన నీట్ పీజీ పరీక్షా కేంద్రాలను అదనపు కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాల్లో చేపట్టిన ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించి, అభ్యర్థులకు కల్పించనున్న మౌలిక వసతులు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, భద్రతా ఏర్పాట్లు తదితర సౌకర్యాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఆగస్టు 30న ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో, పరీక్షా కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉంచాలని అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు.పరీక్షను ప్రశాంతంగా, సురక్షితంగా, క్రమబద్ధంగా నిర్వహించేలా అన్ని చర్యలు చేపట్టాలని, పరీక్షా కేంద్రాల్లో పరీక్ష నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రత, పర్యవేక్షణ, పారిశుద్ధ్యం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పరీక్షను విజయవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు.

# 24 ఏళ్ల తర్వాత కుమారుడితో మహిళ ధర్నా

- తన కుమారుడికి ఆ వ్యక్తే తండ్రి అంటూ ఆరోపణ.. డీఎన్ఏ పరీక్షకు సిద్ధమన్న వ్యక్తి

**గద్వాల ఆగస్టు 28 (వుదయం బ్యూరో)**

గద్వాల పట్టణంలోని భీంనగర్ కాలనీలో 24 ఏళ్ల క్రితం జరిగినదిగా చెబుతున్న ఓ ఘటనపై వివాదం నెలకొంది. తన కుమారుడికి ఓ వ్యక్తే తండ్రి అని ఆరోపిస్తూ ఓ మహిళ, తన కుమారుడితో కలిసి సదరు వ్యక్తి ఇంటి ముందు ధర్నాకు దిగింది. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. స్థానికుల సమాచారం ప్రకారం.. సుమారు 24 ఏళ్ల క్రితం తాను ఇంటి పనిమనిషిగా పనిచేస్తున్న సమయంలో ఇంటి యజమాని కుమారుడు తనపై అనుచితంగా ప్రవర్తించాడని మహిళ ఆరోపిస్తోంది. ఆ ఘటన కారణంగానే తనకు కుమారుడు జన్మించాడని ఆమె పేర్కొంటున్నట్లు తెలిసింది. అయితే ఇంతకాలం ఈ విషయంపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ప్రస్తుతం తన కుమారుడిని తీసుకొచ్చి తనకు న్యాయం చేయాలని కోరుతున్నట్లు సమాచారం. మరోవైపు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి మాత్రం తాను ఎలాంటి తప్పు చేయలేదని చెబుతున్నట్లు తెలిసింది. ఇరువర్గాల మధ్య మధ్యవర్తుల సమక్షంలో చర్చ జరిగిన సందర్భంగా.. 24 ఏళ్ల తర్వాత కుమారుడిని తీసుకొచ్చి తన కుమారుడేనని చెబుతున్నారని, అందుకు ఆధారాలు ఏమిటని ప్రశ్నించినట్లు సమాచారం.ఈ నేపథ్యంలో తనపై వస్తున్న ఆరోపణలకు సంబంధించి డీఎన్ఏ పరీక్షకు తాను సిద్ధంగా ఉన్నానని సదరు వ్యక్తి చెప్పినట్లు స్థానికులు తెలిపారు. అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం. మహిళ తన కుమారుడితో కలిసి ఇంటి ముందు ధర్నాకు కూర్చోవడంతో కాలనీవాసులు



పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని పరిస్థితిని గమనించారు. 24 ఏళ్ల తర్వాత ఈ అంశం తెరపైకి రావడంపై స్థానికంగా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ వ్యవహారంలో అసలు వాస్తవాలు ఏమిటన్నది డీఎన్ఏ పరీక్ష, చట్టపరమైన విచారణ ద్వారా మాత్రమే స్పష్టమయ్యే అవకాశం ఉంది. ఇరువర్గాలు చట్టపరమైన మార్గంలో ముందుకు వెళ్లి సమస్యను పరిష్కరించుకోవాలని స్థానికులు సూచిస్తున్నారు. ఈ ఘటనపై అధికారికంగా పోలీసులకు ఫిర్యాదు నమోదైందా లేదా అన్నది తెలియాల్సి ఉంది.

## తమ్ముడి అనురాగం...
# అక్కకి మమకారం ...!

- అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా రక్షాబంధన్

**నారాయణపేట ఆగస్టు28 (వుదయం ప్రతినిధి)**

తమ్ముడు వస్తున్నాడంటే సంబురం.. చెల్లి అడుగు పెడితే వేడుక.. చేతినిండా రాఖీలు, నోటినిండా మిఠాయిలు, గుండెనిండా అనురాగం.. దోసిళ్లనిండా కానుకలు. అన్నాచెల్లెళ్ల ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను పురస్కరించుకుని దూర ప్రాంతాల్లో ఉన్న సోదరీమణులు సైతం తమ సోదరుల వద్దకు చేరుకుని రాఖీల కట్టేందుకు తరలివచ్చారు. రాఖీ పండుగ అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల మధ్య ప్రేమానుబంధాలకు ప్రతీకగా నిలుస్తోంది. శ్రావణ పౌర్ణమి సందర్భంగా సోదరీమణులు తమ సోదరుల నుదుట తిలకం దిద్ది, చేతికి రాఖీ కట్టి మిఠాయిలు తినిపించారు. శుక్రవారం



నారాయణపేట పట్టణంలోని మూడవ వార్డ్ కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ తమ్ముడు జంగిటి వెంకటేష్ కు రాఖీ కట్టి మిఠాయి తినిపించి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. రక్షాబంధన్ అంటేనే అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ఆప్యాయతకు ప్రతిరూపమని తెలిపారు.

# విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో విద్యుత్ సవరణ బిల్లు రద్దు వరకు పోరాటం

- నాటి పోరాట ఫలితమే నేటి ఉచిత కరెంటు - సీపీఎం నేత ఆర్. శ్రీనివాసులు

**నాగర్ కర్నూల్, ఆగస్టు 27 (వుదయం బ్యూరో):**

విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో కేంద్రం తీసుకొచ్చిన నూతన విద్యుత్ సవరణ బిల్లు రద్దయ్యే వరకు పోరాటం కొనసాగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్. శ్రీనివాసులు పిలుపునిచ్చారు.జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో గురువారం విద్యుత్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. నాటి అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆర్. శ్రీనివాసులు మాట్లాడుతూ.. 2000 ఆగస్టు 28న హైదరాబాద్ బషీర్ బాగ్ వద్ద విద్యుత్ ప్రైవేటీకరణకు



వ్యతిరేకంగా వామపక్షాల ఆధ్వర్యంలో జరిగిన శాంతియుత పోరాటంపై నాటి టీడీపీ ప్రభుత్వం కాల్పులు జరిపి రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్ రెడ్డి ముగ్గురిని హతమార్చిందని, వారి పోరాటం వృధా కాలేదన్నారు.ఆనాటి మహోజ్వల పోరాట ఫలితంగానే విద్యుత్ చార్జీలు తగ్గాయని, ఆ తర్వాత చార్జీలు పెంచాలంటే ప్రభుత్వాలు భయపడ్డాయని, రైతులకు ఉచిత కరెంటు అమలైందని తెలిపారు.కేంద్ర బీజేపీ ప్రభుత్వం టీడీపీ సహకారంతో 2021 నూతన విద్యుత్ సవరణ బిల్లు తెచ్చి ప్రజలపై భారాలు మోపి అదానీ, అంబానీల వంటి కార్పొరేట్ సంస్థల జేబులు నింపాలని చూస్తోందని విమర్శించారు. రైతుల మోటార్లకు స్మార్ట్ మీటర్లు పెట్టి ఉచిత కరెంటును దూరం చేయాలనే కుట్రలో భాగంగానే ఈ బిల్లు అని ఆరోపించారు.నాటి శాంతియుత ఉద్యమకారులపై కర్కశంగా వ్యవహరించిన చంద్రబాబు నేడు మతతత్వ బీజేపీతో కుమ్మక్కయ్యారని, ఎన్టీఆర్ లౌకికవాదాన్ని తుంగలో తొక్కారని, నేడు మోడీకే మార్పు తెస్తాడని డబ్బా కొడుతున్నారని విమర్శించారు. సనాతన ధర్మం పేరుతో పవన్ కళ్యాణ్ మోడీ మెప్పు కోసం సినిమా నాటకాలు ఆడుతున్నారని అన్నారు.ఇప్పటికైనా అమరవీరుల స్ఫూర్తితో బిల్లు రద్దు వరకు పోరాడాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పొదిల రామయ్య, గుంపల్లి అశోక్, తారా సింగ్, నాయకులు మల్లికార్జున్, శివ, శ్రీనివాసులు చారి, నిజాం భాషా, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ల గైర్హాజరు పై మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులపై ఆగ్రహం

- విచారణ కు ఆదేశం.
- బాధ్యులపై తక్షణమే కఠిన చర్యలకు ఆదేశం.
- హెల్త్ సెక్రటరీ, జిల్లా కలెక్టర్ లతో మాట్లాడిన మంత్రి దామోదర్ రాజనర్సింహ.

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి,(వుదయం):**

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ గారు జహీరాబాద్ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల కొరత, డ్యూటీ డాక్టర్ గైర్హాజరు, ప్రైవేట్ డాక్టర్ తో చికిత్స పై వివిధ పత్రికలలో వచ్చిన వార్త కథనాలపై సంగారెడ్డి జిల్లా కలెక్టర్, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డా క్రిస్టినా జెడ్ చొంగ్తు గారితో మాట్లాడారు. జహీరాబాద్ ఏరియా ఆస్పత్రి



లో జరిగిన ఘటన పై విచారణ కు ఆదేశించారు. ఈ లాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జహీరాబాద్ ఏరియా ఆస్పత్రిలో డ్యూటీ డాక్టర్ స్థానంలో విధుల్లో ప్రైవేట్ డాక్టర్ ఉండటం, డాక్టర్ల గైర్హాజరు పై మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

# పేట జిల్లా చత్రపతి శివాజీ సేన అధ్యక్షుడిగా బాదేపల్లి నరేష్ గౌడ్

**నారాయణపేట, ఆగస్టు28 (వుదయం ప్రతినిధి):**

నారాయణపేట జిల్లా ఛత్ర పతి శివాజీ సేన అధ్యక్షు డిగా మక్తల్ పట్టణానికి చెందిన బాదేపల్లి నరేష్ గౌడ్ నియమించినట్లు ఛత్ర పతి శివాజీ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు తోట మధుకర్ తెలిపారు. నారా యణపేట జిల్లాలో జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు ఛత్రపతి శివాజీ సేనను మరింత బలోపేతం చేయడంతో పాటు, సంస్థ కార్యకలాపాలను విస్తృ తంగా ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతలను బాదేపల్లి నరేష్ గౌడ్‌కు అప్పగించి నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడు బాదేపల్లి నరేష్ గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షు లు తోట మధుకర్‌కు, అలాగే ఛత్రపతి శివాజీ సేన సభ్యులకు ప్రత్యేక ధన్యవా దాలు తెలిపారు.



ఛత్రపతి శివాజీ మహారాజ్ ఆశయాలు, ధైర్యసాహసాలు, ప్రజా సంక్షేమం కోసం ఆయన చేసిన పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని నరేష్‌గౌడ్ తెలిపారు. నారాయణపేట జిల్లాలో సంస్థను గ్రామ స్థాయి వరకు విస్తరించి, యువతను సంఘటితం చేసి, ఛత్రపతి శివాజీ సేనను మరింత బలోపేతం చేయడానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని అన్నారు.

# మళ్లీ కదిలిన డీలిమిటేషన్ పావులు!

- 543 నుంచి భారీగా పెరగనున్న లోక్‌సభ సీట్లు.. మహిళా రిజర్వేషన్‌తో ముడిపడిన కేంద్రం వ్యూహం
- తెలంగాణకు 17 నుంచి 26 సీట్లకు అవకాశం! దక్షిణాది ప్రాతినిధ్యంపై కొత్త లెక్కలు

**వికారాబాద్ ఆగస్టు 28 (వుదయం బ్యూరో)**

దేశ రాజకీయాల్లో మరోసారి నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశం వేడెక్కుతోంది. లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్య పెంపు, రాష్ట్రాల వారీగా సీట్ల పునఃకేటాయింపు, మహిళలకు 33 శాతం రిజర్వేషన్—మూడు కీలక అంశాలు మళ్లీ రాజకీయ చర్చకు కేంద్రంగా మారాయి. ఏప్రిల్‌లో లోక్‌సభలో అవసరమైన ప్రత్యేక మెజారిటీ సాధించలేక నిలిచిపోయిన డీలిమిటేషన్ సంబంధిత రాజ్యాంగ సవరణను మళ్లీ ముందుకు తీసుకురావడానికి కేంద్రం కసరత్తు చేస్తోందన్న ఊహాగానాలు బలపడుతున్నాయి.

**తెలంగాణకు కొత్త రాజకీయ లెక్కలు! 17 నుంచి 26 లోక్‌సభ స్థానాలకు అవకాశం.. సీట్లు పెరిగినా దక్షిణాది వాటాపై చర్చ తప్పదా?**

డీలిమిటేషన్ జరిగితే తెలంగాణపై కూడా గణనీయమైన ప్రభావం పడే అవకాశం ఉంది. ప్రస్తుతం తెలంగాణకు లోక్‌సభలో 17 స్థానాలు ఉన్నాయి. కేంద్రం ఏప్రిల్‌లో ప్రతిపాదించిన 50 శాతం సీట్ల పెంపు నమూనా అమలైతే తెలంగాణ సీట్లు 17 నుంచి 26కు పెరిగే అవకాశం ఉందని ప్రభుత్వం వివరించింది.

అంటే తెలంగాణకు అదనంగా సుమారు 9 లోక్‌సభ స్థానాలు రావచ్చు. అయితే ఇది తుది నిర్ణయం కాదు. డీలిమిటేషన్ ప్రక్రియ, జనాభా గణాంకాలు, రాజ్యాంగ సవరణలు, పార్లమెంట్ ఆమోదం వంటి అనేక దశలు పూర్తయిన తర్వాతే రాష్ట్రానికి కేటాయించే తుది సీట్ల సంఖ్య స్పష్టమవుతుంది.

తెలంగాణకు సీట్లు పెరగడం ఒకవైపు రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచే అవకాశం కల్పిస్తే, మరోవైపు రాష్ట్రాల మధ్య సీట్ల నిష్పత్తి ఎలా మారుతుంది? అనే ప్రశ్న కూడా ముందుకు వస్తోంది.

**అసలు పోరాటం సీట్ల సంఖ్యపైనేనా?**

డీలిమిటేషన్ అంటే కేవలం కొత్త నియోజకవర్గాల సరిహద్దులు గీయడం కాదు. దేశంలోని ప్రతి రాష్ట్రానికి లోక్‌సభలో ఎంత ప్రాతినిధ్యం ఉండాలనే ప్రశ్న కూడా ఇందులో భాగమే.జనాభా ప్రాతిపదికన సీట్లను పునర్విభజిస్తే జనాభా ఎక్కువగా ఉన్న రాష్ట్రాలకు సీట్లు గణనీయంగా పెరిగే అవకాశం ఉంటుంది. జనాభా నియంత్రణలో ముందున్న దక్షిణాది రాష్ట్రాలు మాత్రం తమ రాజకీయ ప్రాతినిధ్యం సాపేక్షంగా తగ్గుతుందనే ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

కేంద్రం మాత్రం మొత్తం లోక్‌సభ సీట్ల సంఖ్యను పెంచడం ద్వారా ఏ రాష్ట్రం సీట్లను నేరుగా తగ్గించాల్సిన అవసరం ఉండదని వాదిస్తోంది.

**543 నుంచి 816 దిశగా?**

కేంద్రం ఏప్రిల్‌లో ప్రతిపాదించిన నమూనా ప్రకారం ప్రస్తుత 543 లోక్‌సభ స్థానాలను సుమారు 50 శాతం పెంచితే 816 స్థానాలు వచ్చే అవకాశం ఉంది.

అయితే రాజ్యాంగంలోని గరిష్ఠ సభ్యుల పరిమితిని కూడా పెంచే ప్రతిపాదన ఉంది. అందువల్ల 816 అనేది ప్రతిపాదిత పెంపు నమూనా, కాగా 850 అనేది ప్రతిపాదిత గరిష్ఠ పరిమితికి సంబంధించిన సంఖ్యగా చూడాలి.

ఈ మార్పు జరిగితే దేశ పార్లమెంటరీ రాజకీయాల స్వరూపమే మారే అవకాశం ఉంది.

**ఏప్రిల్‌లో ఎందుకు ఆగిపోయింది?**

డీలిమిటేషన్‌కు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు ఏప్రిల్ 2026లో లోక్‌సభ ముందుకు వచ్చింది. ఓటింగ్‌లో 528 మంది సభ్యులు పాల్గొనగా 298 మంది అనుకూలంగా, 230 మంది వ్యతిరేకంగా ఓటేశారు.298 ఓట్లు సాధించినప్పటికీ రాజ్యాంగ సవరణకు అవసరమైన ప్రత్యేక మెజారిటీ రాకపోవడంతో బిల్లు ఆమోదం పొందలేదు. దీంతో ప్రభుత్వం ముందుకు తీసుకొచ్చిన డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ సంబంధిత తదుపరి చర్యలు కూడా నిలిచిపోయాయి.ఇప్పుడు అదే అంశాన్ని మళ్లీ ముందుకు తీసుకురావాలంటే కేంద్రానికి అదనపు రాజకీయ మద్దతు అవసరం.

**ఎంపీల మద్దతు ఉందా?**

ఇదే ఇప్పుడు అత్యంత కీలకమైన ప్రశ్న. సాధారణ బిల్లుకు అవసరమైన సంఖ్యాబలం, రాజ్యాంగ సవరణకు అవసరమైన సంఖ్యాబలం ఒకటి కాదు. రాజ్యాంగ సవరణకు ప్రత్యేక మెజారిటీ అవసరం.ఏప్రిల్ ఓటింగ్ ఫలితం చూస్తే ప్రభుత్వం తన సొంత బలంతోనే రాజ్యాంగ సవరణను ఆమోదించలేకపోయింది.అందువల్ల తిరిగి బిల్లు తీసుకొస్తే NDAకు బయట ఉన్న ప్రాంతీయ పార్టీల మద్దతు కీలకంగా మారుతుంది.



ప్రత్యేకంగా దక్షిణాది రాష్ట్రాలకు చెందిన పార్టీల వైఖరి ఈ విషయంలో అత్యంత ప్రాధాన్యం సంతరించుకోనుంది.

**మహిళా రిజర్వేషన్ ఎందుకు కలిపారు?**

2023లో రాజ్యాంగ సవరణ ద్వారా లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలలో మహిళలకు మూడోవంతు రిజర్వేషన్‌కు రాజ్యాంగపరమైన మార్గం ఏర్పడింది.

కానీ ఆ రిజర్వేషన్ వెంటనే అమల్లోకి రావడానికి వీలు లేకుండా డీలిమిటేషన్, జనాభా లెక్కల ప్రక్రియతో అనుసంధానం చేశారు.

దీంతో 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళా రిజర్వేషన్ అమలు చేయాలంటే ప్రస్తుత చట్టపరమైన విధానంలో మార్పులు అవసరం.

ఇదే కారణంగా డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ ఇప్పుడు ఒకదానితో ఒకటి ముడిపడిన రాజకీయ అంశాలుగా మారాయి.

**ఖర్గే డిమాండ్.. కేంద్రంపై ఒత్తిడి**

డీలిమిటేషన్ ప్రతిపాదనలపై ముందుగా అన్ని రాజకీయ పార్టీలతో చర్చించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీని కోరారు.ప్రస్తుత 543 లోక్‌సభ స్థానాల సంఖ్యను మరో 25 ఏళ్లపాటు కొనసాగించాలని, రాష్ట్రాల వారీగా ప్రస్తుత సీట్ల కేటాయింపును కూడా కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు.అదే సమయంలో మహిళలకు 2029 ఎన్నికల నుంచే మూడోవంతు రిజర్వేషన్ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.డీలిమిటేషన్ వంటి దేశవ్యాప్త ప్రభావం కలిగించే అంశంపై ప్రతిపక్షాలు, రాష్ట్ర ప్రభుత్వాలతో విస్తృతంగా సంప్రదింపులు జరపాలని కాంగ్రెస్ స్పష్టం చేస్తోంది.దక్షిణాది రాష్ట్రాల లెక్కే కీలకండీలిమిటేషన్‌పై అసలు రాజకీయ పోరు ఉత్తర-దక్షిణ రాష్ట్రాల ప్రాతినిధ్యం చుట్టూనే తిరిగే అవకాశం ఉంది. జనాభా పెరుగుదలను నియంత్రించడంలో ముందున్న రాష్ట్రాలకు సీట్ల పెంపు తక్కువగా, జనాభా ఎక్కువగా పెరిగిన రాష్ట్రాలకు సీట్ల పెంపు ఎక్కువగా ఉంటే పార్లమెంట్‌లో రాజకీయ బలాబలాలు మారే అవకాశం ఉందని దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కేంద్రం మాత్రం మొత్తం సీట్లు పెంచడం ద్వారా ఈ సమస్యను సమతుల్యం చేయవచ్చని చెబుతోంది.

**తెలంగాణ రాజకీయాలకు కొత్త అధ్యాయం?**

తెలంగాణకు 17 నుంచి 26 స్థానాలు వస్తే రాష్ట్ర రాజకీయాల్లో కూడా కొత్త సమీకరణాలు ఏర్పడే అవకాశం ఉంటుంది.

**కొత్త లోక్‌సభ నియోజకవర్గాలు ఏర్పడితే:**

ప్రస్తుత నియోజకవర్గాల సరిహద్దులు మారవచ్చు.కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాల సమూహాలు కొత్త లోక్‌సభ స్థానాల్లోకి వెళ్లవచ్చు.SC/ST రిజర్వేషన్ స్థానాల కేటాయింపులో మార్పులు రావచ్చు.కొత్త రాజకీయ నాయకత్వానికి అవకాశాలు ఏర్పడవచ్చు.ప్రధాన రాజకీయ పార్టీల ఎన్నికల వ్యూహాలు పూర్తిగా మారవచ్చు.అయితే ఏ నియోజకవర్గం ఎక్కడ ఏర్పడుతుంది? ఏ సీటు రిజర్వ్ అవుతుంది? అనే విషయాలు ఇప్పుడే ఖరారు కాలేదు.ఇప్పుడు ఢిల్లీ వైపు చూపు

వర్షాకాల సమావేశాలు ప్రొరోగ్ కాకపోవడం, రిజిజు తాజా వ్యాఖ్యలు, ఖర్గే మరోసారి ప్రధానికి లేఖ రాయడం—ఈ మూడు పరిణామాలు డీలిమిటేషన్ అంశం మళ్లీ రాజకీయ చర్చల్లోకి వచ్చినట్లు స్పష్టం చేస్తున్నాయి. అయితే ప్రత్యేక సమావేశం లేదా బిల్లు ప్రవేశపెట్టడం ఇప్పటివరకు అధికారికంగా ఖరారు కాలేదు.

**కేంద్రం మళ్లీ బిల్లు తీసుకొస్తే—**

NDAకు బయట నుంచి ఎవరు మద్దతు ఇస్తారు?

దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలకు ఎలాంటి హామీ ఇస్తారు?

తెలంగాణకు ఎన్ని సీట్లు వస్తాయి?

**2029 నుంచే మహిళా రిజర్వేషన్ అమలు చేస్తారా?**

ప్రస్తుత 543 సీట్ల వ్యవస్థకు ముగింపు పలుకుతారా?

అనే ప్రశ్నలకు సమాధానాలు కీలకంగా మారనున్నాయి.

డీలిమిటేషన్ మళ్లీ తెరపైకి వచ్చింది.. ఇక నిర్ణయం కేవలం సీట్ల పెంపుపై కాదు.. దేశ రాజకీయ ప్రాతినిధ్య భవిష్యత్తుపై!

**ఎం రవీందర్, సీనియర్ జర్నలిస్టు**

# ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

**మెదక్ జిల్లా వుదయం**

నిజాంపేట మండలం అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల ప్రేమానురాగాలకు ప్రతీకగా నిర్వహించే రాఖీ పౌర్ణమి వేడుకలను నిజాంపేట మండల వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా నిర్వహించే రక్షాబంధన్ వేడుకల కోసం దూర ప్రాంతాల్లో ఉన్న ఆడపడుచులు తమ పుట్టినిళ్లకు చేరుకున్నారు.సోదరులకు రాఖీలు కట్టి, మిఠాయిలు తినిపించి తమ ప్రేమానురాగాలను చాటుకున్నారు. సోదరీమణులకు అన్నదమ్ములు అండగా, రక్షణగా ఉంటామని హామీ ఇస్తూ నగదు, నూతన వస్త్రాలను అందజేశారు. దీంతో పుట్టినిళ్లలో రాఖీ పండుగ సందడి నెలకొంది.అక్కాచెల్లెళ్లు, అన్నదమ్ముల మధ్య ఉన్న ఆత్మీయత, ప్రేమానురాగాలను మరింత బలోపేతం చేసే రాఖీ పౌర్ణమి ప్రతి కుటుంబంలో ఆనందాన్ని నింపింది. ఈ సందర్భంగా మండల ప్రజలకు పలువురు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.



# ముగిసిన బ్యాంక్ ఆఫ్ ఇండియా 'సైబర్‌ఫీల్డ్ హ్యాకథాన్–2026'



**హైదరాబాద్/సంగారెడ్డి , ఆగస్టు 28:వుదయం**

సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆర్థిక మోసాల నియంత్రణకు సాంకేతిక పరిష్కారాలను అభివృద్ధి చేసే లక్ష్యంతో బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహించిన 'సైబర్‌ఫీల్డ్ హ్యాకథాన్-2026' గ్రాండ్ ఫినాలే ఐఐటీ హైదరాబాద్‌లో ఘనంగా ముగిసింది. ఆగస్టు 27, 28 తేదీల్లో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఐఐటీ హైదరాబాద్ సహకారంతో బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహించింది.దేశవ్యాప్తంగా హ్యాకథాన్‌కు 2,936 రిజిస్ట్రేషన్లు రాగా, ఐఐటీ హైదరాబాద్ మూల్యాంకన కమిటీ పరిశీలన అనంతరం 72 టీమ్లు, వ్యక్తిగత పాల్గొనేవారు ప్రొటోటైప్ ప్రెజెంటేషన్ రౌండ్‌కు ఎంపికయ్యారు. వీరిలో 68 టీమ్లు, నలుగురు వ్యక్తిగతంగా పాల్గొనగా మొత్తం 232 మంది ప్రతినిధులు పోటీలో పాల్గొన్నారు.మోసపూరిత మొబైల్ యాప్స్ (APKs), మాల్వేర్‌ను జనరేటివ్ ఏఐతో గుర్తించడం, విశ్లేషించడం, రిస్క్ స్కోరింగ్ చేయడం ఒక సమస్యగా, అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలు, మూల్ ఖాతాలను ఏఐ/ఎంఎల్ సాంకేతికతతో గుర్తించి అక్రమ నగదు చలామణిని అడ్డుకోవడం మరో సమస్యగా హ్యాకథాన్‌లో పోటీదారులకు అందించారు.

విజేతలుసమస్య-1:

ప్రథమ బహుమతి - టీమ్ విజయ

ద్వితీయ బహుమతి - టీమ్ Fi

తృతీయ బహుమతి - టీమ్ లాజిక్ ఫొం

డ్రీసమస్య-2:ప్రథమ బహుమతి - టీమ్ weAre Winners

ద్వితీయ బహుమతి - టీమ్ విజయ

తృతీయ బహుమతి - టీమ్ LUNA LUPAప్రతి సమస్య విభాగంలో విజేతలకు వరుసగా రూ.5 లక్షలు, రూ.3 లక్షలు, రూ.2 లక్షల చొప్పున నగదు బహుమతులు అందించారు. రెండు సమస్య విభాగాలకు కలిపి రూ.20 లక్షల ప్రైజ్ పూల్ కేటాయించారు. ముగింపు కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ రజనీష్ కర్ణాటక్, IDRBT డైరెక్టర్ డాక్టర్ దీపక్ కుమార్, ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్. మూర్తి, రిజిస్ట్రార్ వెంకట్ రావు, ఇతర ఉన్నతాధికారులు, అధ్యాపకులు, బ్యాంకింగ్, సాంకేతిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రజనీష్ కర్ణాటక్ మాట్లాడుతూ డిజిటల్ మోసాలు రోజురోజుకూ సంక్లిష్టంగా మారుతున్న నేపథ్యంలో బ్యాంకులు సాంకేతిక సామర్థ్యాలను నిరంతరం పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. యువత, విద్యార్థులు అందించిన వినూత్న పరిష్కారాలు సురక్షితమైన డిజిటల్ బ్యాంకింగ్ వ్యవస్థకు దోహదపడతాయని పేర్కొన్నారు.విజేతలకు బహుమతులు, పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్లు అందజేయడంతో హ్యాకథాన్ ముగిసింది.

# తల్లిదండ్రులు లేరనే దిగులు వద్దు



- నేనున్నానంటూ అండగా నిలిచిన అన్న
- దౌలాపూర్‌లో పరామర్శించిన సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ చిలుకూరి మహేందర్ రెడ్డి
- రూ. 5,000 ఆర్థిక సాయం అందజేత

**సిద్దిపేట, ఆగస్టు 28 (వుదయం బ్యూరో)**

కష్టకాలంలో కంటతడి పెట్టిన ఆ చెల్లెమ్మలకు "నేనున్నాను" అంటూ కొండంత అండగా నిలిచారు.. సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ చిలుకూరి మహేందర్ రెడ్డి. 'తల్లిదండ్రులు లేరనే దిగులు వద్దు.. ఒక సొంత అన్నలా మీకు ఎల్లప్పుడూ తోడుగా ఉంటా'నంటూ ఆయన ఇచ్చిన భరోసా ఆ కుటుంబంలో కొత్త ధైర్యాన్ని నింపింది.ఇటీవల సిద్ధిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం దౌలాపూర్ గ్రామానికి చెందిన కొలిప్యాక మల్లయ్య అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన మరణంతో మల్లయ్య కుమార్తెలు అనాథలయ్యారు. ఈ విషయం తెలుసుకున్న మహేందర్ రెడ్డి శుక్రవారం దౌలాపూర్‌లోని వారి నివాసానికి వెళ్లారు. పితృవియోగంతో పుట్టెడు దుఃఖంలో ఉన్న మల్లయ్య కుమార్తెలను ఆప్యాయంగా పరామర్శించి, ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన రూ. 5,000/రూపాయలు తక్షణ ఆర్థిక సాయాన్ని అందజేస్తూ, భావోద్వేగానికి గురైన ఆ పిల్లలకు కొండంత ఆసరాగా ఉంటానని మాట ఇచ్చారు.

ఈ పరామర్శ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుకునూరి కృష్ణ, వార్డు సభ్యులు అకారం నర్సింలు, పోకల ఐలయ్యతో పాటు పలువురు స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. మహేందర్ రెడ్డి చూపిన ఈ ఉదారత, అందించిన భరోసా పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# అమ్మాయిపల్లి గ్రామ పంచాయతీకి నూతన ద్వారం

- అభివృద్ధికి మరో ముందడుగు వేసిన
- సర్పంచ్ మాదగౌని కవిత ప్రభంజన్ గౌడ్
- గ్రామ ఉపసర్పంచ్ ఆరెపల్లి మాధవి మాధవరెడ్డి

**చిన్నంబావి మండలం 28 ( వుదయం రిపోర్టర్ )**

చిన్నంబావి మండల పరిధిలోని అమ్మాయి పల్లి గ్రామంలో గ్రామ అభివృద్ధిలో భాగంగా అమ్మాయిపల్లి గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవనానికి నూతన ద్వారం ఏర్పాటు చేసి నిలబెట్టారు. గ్రామ సర్పంచ్ మాదగౌని కవిత ప్రభంజన్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. గ్రామ పంచాయతీ భవనానికి నూతన ద్వారం ఏర్పాటు చేయడం ద్వారా గ్రామ పరిపాలనకు మరింత కొత్త రూపు తీసుకొచ్చామని సర్పంచ్ తెలిపారు. గ్రామ ప్రజలకు మెరుగైన పాలన, సౌకర్యాలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధే లక్ష్యం.. ప్రజా సంక్షేమమే ధ్యేయం అమ్మాయిపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని సర్పంచ్ మాదగౌని కవిత ప్రభంజన్ గౌడ్ తెలిపారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని అన్నారు.నూతన గ్రామ పంచాయతీ భవనానికి నూతన ద్వారం ఏర్పాటు కావడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. సర్పంచ్ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై గ్రామస్తులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రెటరీ జైపాల్ రెడ్డి, గ్రామ సర్పంచ్ కవితా ప్రభంజన్ గౌడ్, గ్రామ ఉపసర్పంచ్ ఆరేపల్లి మాధవి మాధవరెడ్డి, గ్రామ అధ్యక్షులు మోహన్ రెడ్డి వార్డు మెంబర్లు, సీనియర్ నాయకులు, పారిశుద్ధ్య కార్మికులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# తోబుట్టువుల పవిత్ర బంధం రక్షాబంధనం

**కల్వకుర్తి, ఆగస్టు 28 (వుదయం ప్రతినిధి):**

కల్వకుర్తి పట్టణంలో తోబుట్టువుల పవిత్ర బంధానికి ప్రతీక అయిన రక్షాబంధన్ (రాఖీ) పండుగను శుక్రవారం అద్భుతంగా జరుపుకున్నారు. నేడు పౌర్ణమి శుక్రవారం కావడంతో హిందువులు లక్ష్మీ వారంగా భావిస్తారు. ఇంటి ఆడపిల్లను లక్ష్మీదేవిగా భావిస్తుంటారు. ఇంటికి లక్ష్మీదేవి వచ్చినట్లుగా సోదరీమణులు సోదరులకు రాఖీలు కట్టి, మిఠాయిలు తినిపించుకుని పండుగను ఘనంగా జరుపుకున్నారు.సోదరీమణులు తమ సోదరుల దీర్ఘాయువు, విజయం కోసం ప్రార్థిస్తూ వారి మణికట్టుకు పవిత్రమైన పత్తి లేదా పట్టు దారంతో చేసిన రాఖీని కట్టగా, సోదరులు బహుమతులు ఇచ్చి జీవితాంతం రక్షిస్తామని, అండగా ఉంటామని వాగ్దానం చేశారు.వివిధ ప్రాంతాలలో ఈ పండుగను శ్రావణ పూర్ణిమ, జంధ్యాల పూర్ణిమ, గమ్హా పూర్ణిమ అని కూడా పిలుస్తారు.



# ఘనంగా రాఖీ పండుగ వేడుకలు



**మరికల్ ఆగస్టు 28**
**(వుదయం ప్రతినిధి)**

మరికల్ ధన్వాడ మండలాలలో మరియు వివిధ గ్రామాలలో రాఖీ పండుగ ఘనంగా జరుపుకున్నారు తమ్ముడు అనురాగం అక్కకు మమకారం అన్నా చెల్లెల అనుబంధానికి రక్షాబంధన్ పండుగ వేడుక రక్షాబంధన్ తమ్ముడు వస్తున్నాడని సంబరం చెల్లి అడుగు పెడితే వేడుక చేతినిండా రాఖీలు నోటినిండా మిఠాయిలు అన్నాచెల్లెళ్ల ఆత్మీయత బంధమే రాఖీ పండుగ సోదర భావంతో పెంచే అక్కా చెల్లెలు అన్నాతమ్ముడు పండుగని ప్రతి సంవత్సరం జరుపుకోవాలని ఆనందంతో వెలగాలని అక్కచెల్లెళ్ల ఆశీర్వాదం ఎప్పుడు ఉండాలని ఆశీర్వాదం ఇచ్చారు.

# ధరూర్ పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ

- **వైద్య సేవలు, సిబ్బంది హాజరు, మందుల లభ్యతపై క్షుణ్ణంగా పరిశీలన**

**ధరూర్, ఆగస్టు 28**
**(వుదయం కరస్పాండెంట్):**



ధరూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. సంధ్య కిరణ్మయి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని వివిధ విభాగాలను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది హాజరు, మందుల లభ్యత, వివిధ రిజిస్టర్ల నిర్వహణ, పారిశుద్ధ్య పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ కార్యక్రమం అమలు, ఎన్ సిడి మందుల లభ్యత, టీకాకరణ కార్యక్రమం, కోల్డ్‌చైన్ నిర్వహణ తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో జరుగుతున్న ప్రసవాల వివరాలను పరిశీలించిన డీఎంహెచ్‌ఓ, ప్రభుత్వ వైద్య సంస్థల్లో సంస్థాగత ప్రసవాలను ప్రోత్సహించి, ప్రసవాల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. పీహెచ్‌సీ పరిసరాలను ప్రతిరోజూ పరిశుభ్రంగా ఉంచాలని, ఆసుపత్రిలో పారిశుద్ధ్యం, పరిశుభ్రత నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఓపీ విధులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా వైద్యాధికారి ఐచ్చిక సెలవు తీసుకోవడంపై డీఎంహెచ్‌ఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓపీ సేవలకు అంతరాయం కలగకుండా విధుల నిర్వహణలో ముందస్తు ఏర్పాట్లు ఉండాలని స్పష్టం చేస్తూ, ఈ విషయంపై రెండు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు.ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండే విధంగా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా విధులు నిర్వహించాలని డా. సంధ్య కిరణ్మయి సిబ్బందికి సూచించారు.

# అప్పంపల్లిలో మృతి చెందిన యువకుని నేత్రదానం




**మరికల్ ఆగస్టు 28**
**(వుదయం ప్రతినిధి)**

మరికల్ మండల కేంద్రంలోని శుక్రవారం అప్పంపల్లి గ్రామానికి చెందిన యువకుడు శ్రీనివాస్ రెడ్డి రాత్రి దేవరకద్ర దగ్గర రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన వెలుగులోకి వచ్చింది ఆయన కుటుంబ సభ్యులు ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి శ్రీనివాస్ రెడ్డి కళ్ళు దానం చేశారు కన్నుమూసిన మరొకరికి కంటిచూపు ఇవ్వడానికి నేత్రదానం చేస్తున్నామని కుటుంబ సభ్యులు ఆనందంగా ఉన్నారు ఎల్వి ప్రసాద్ సిబ్బంది కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు

## శ్రీ పట్టాభిరామచంద్ర స్వామి ఆలయ
# ప్రతిష్ఠా మహోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న దిల్‌రాజు

**(వుదయం, హైదరాబాద్):**



వైయస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల మండల కేంద్రంలోని J.S.R. నగర్‌లో నిర్మించిన శ్రీ పట్టాభిరామచంద్ర స్వామి వారి ఆలయ మహోత్సవానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ తెలుగు సినీ నిర్మాత దిల్‌రాజు సతీసమేతంగా హాజరయ్యారు. ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు, శ్రీరాములు, హీరో వంశీకృష్ణ అందరి సమక్షంలో దిల్ రాజుకు ఘన స్వాగతం పలికారు. అనంతరం దిల్ రాజు ఆలయాన్ని సందర్శించి స్వామివారి అభిషేకంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా సమావేశం నిర్వహించారు. నిర్మాత దిల్ రాజ్ మాట్లాడుతూ.. పోరుమామిళ్లలో విగ్రహ ప్రతిష్ఠాపన జరుగుతున్న సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ శ్రీరాములు ఆహ్వానం మేరకు కుటుంబంతో వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా 20 సంవత్సరాల క్రితం ఆయన ప్రొద్దుటూరు, కడప, పోరుమామిళ్ల తదితర ప్రాంతాల్లో వ్యాపారం చేసినట్లు గుర్తు చేసుకున్నారు. శ్రీరాములు కుటుంబం గుడిని నిర్మించారు ఇక రాములవారి సేవను, భక్తిని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత గ్రామస్తుల మీద ఉందని చెప్పారు. ఇంత పెద్ద మహత్తర కార్యాన్ని నిర్వర్తించిన శ్రీరాములు కుటుంబానికి ధన్యవాదాలు తెలిపారు. హీరో వంశీకృష్ణ మాట్లాడుతూ.. పిలవగానే హైదరాబాద్ నుంచి పోరుమామిళ్ళకు వచ్చిన దిల్ రాజ్ కు ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు. సొంతూరులో ఆలయాన్ని నిర్మించడం మహాభాగ్యంగా భావిస్తూ ఇలాంటి ప్రోత్సాహం ఎల్లప్పుడూ గ్రామస్తులు నుంచి ఉండాలి అని కోరారు. భక్తి మార్గంలో వెళ్తూ అందరితో ప్రేమాభిమానాలతో ఉంటూ జీవించాలని ఈ సందర్భంగా ఆలయ ప్రతిష్ఠకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.ఆలయ స్థలధాత శ్రీ రాములు మాట్లాడుతూ... మనసున్న మారాజు దిల్ రాజు అంటూ.. ఎంత బిజీ పనులున్నా, అమెరికా వెళ్లాల్సి ఉన్నా కూడా అన్ని పనులు క్యాన్సల్ చేసుకొని, పిలవగానే పోరుమామిళ్లలోని రామాలయ ప్రతిష్ఠకు వచ్చినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బద్వేల్ నియోజకవర్గంలో ఎక్కడ ఇంత పెద్ద రామాలయం లేదని అందరూ చెబుతున్నారు చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు.విశ్వంత రెడ్డి మాట్లాడుతూ.. ఆలయ ప్రతిష్ఠకు విచ్చేసిన దిల్ రాజు, ఆలయానికి స్థలాన్ని ఇచ్చి నిర్మించిన శ్రీరాములు, యువ కథానాయకుడు వంశీకృష్ణ, ఆలయ చైర్మన్ ఓరయ్య, కమిటీ సభ్యులు రామచంద్ర అందరికీ ధన్యవాదాలు తెలిపారు. రామాలయ నిర్మాణానికి సహకరించిన దాతలకు, భక్తులకు నమస్కారాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఈ ప్రతిష్ఠా మహోత్సవాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తులందరికీ ఉచిత అన్నదాన సేవ కూడా ఏర్పాటు చేస్తున్నారు. గ్రామంలోని పెద్దలు, కుటుంబాలు, యువతతో పాటు రాబోయే తరాలను కూడా ఒకచోట కలిపే ఆధ్యాత్మిక వేదికగా శ్రీ పట్టాభిరామచంద్ర స్వామి వారి ఆలయం అని, ఇలాంటి గొప్ప ఆలయాన్ని నిర్మించిన దాతలు జడపోలు శ్రీరాములు హైమావతి, వంశీకృష్ణతో పాటు ఆలయ నిర్మాణంలో భాగస్వామ్యం వహించిన ప్రతి ఒక్కరికి ఆలయ కమిటీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది.



## రాగా' పోరుబాట..
# ఢిల్లీ పీఠంపై దండయాత్ర!

- **దేశం కోసం దావానలంలా పాదయాత్ర: కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు సమరభేరి!**
- **రాహుల్ గాంధీని ప్రధాని పీఠంపై కూర్చోబెట్టడమే లక్ష్యం**
- **నిరంకుశత్వానికి వ్యతిరేకంగా, రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయంగా పోరాటం**
- **1,400 కిలోమీటర్లు దాటి తెలంగాణ గడ్డపైకి 'భారత వికాసానికి రాగా' యాత్ర**
- **ధరూర్‌లో వెల్లువెత్తిన జననీరాజనం.. కాంగ్రెస్ శ్రేణుల జయజయధ్వానాలు**

**ధరూర్ ఆగస్టు 28**
**(వుదయం బ్యూరో)**

దేశంలో మార్పు గాలి కాదు.. ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్న శక్తులపై తిరుగుబాటు తుఫాను వీస్తోంది! రాజ్యాంగ వ్యవస్థలను కాపాడుకోవడానికి, నిరంకుశ పాలనపై దండయాత్రగా "భారత వికాసానికి రాగా" నినాదం దిక్కులు పిక్కటిల్లుతోంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని దేశ ప్రధానిగా నిలబెట్టి, ప్రజాస్వామ్యానికి మళ్లీ ఊపిరిలూదడమే పరమావధిగా సాగుతున్న జాతీయ మహా పాదయాత్ర తెలంగాణ గడ్డపైకి సగర్వంగా, హుంకరిస్తూ ప్రవేశించింది. కన్యాకుమారి తీరం నుంచి కశ్మీర్ లోయ దాకా సాగుతున్న ఈ శ్రమజీవుల సమర ప్రస్థానం శుక్రవారం జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల కేంద్రానికి చేరుకుంది. ఇప్పటివరకు ఏకంగా 1,400 కిలోమీటర్ల మేర సాగిన ఈ అగ్నిపరీక్షను దిగ్విజయంగా పూర్తి చేసుకున్నట్లు యాత్ర నాయకుడు, సామాజిక కార్యకర్త, న్యాయవాది కాటూరి వెంకటేశ్వర్లు ఉద్ఘాటించారు. దక్షిణాది సరిహద్దుల నుంచి ఢిల్లీ దిశగా సమరశంఖం ఆంధ్రప్రదేశ్ ప్రకాశం జిల్లాకు చెందిన కాటూరి వెంకటేశ్వర్లు గతేడాది జూన్ 19న కన్యాకుమారి తీరాన ఈ పోరాట జ్వాలను రగిలించారు. కేటిదొడ్డి మండల కేంద్రం నుంచి ఆవేశపూరిత వాతావరణంలో ప్రారంభమైన ఈ పోరుబాట ధరూర్‌కు చేరుకోగా, తదుపరి గద్వాల పట్టణం మీదుగా ఢిల్లీ పీఠాన్ని కదిలించేలా హిమగిరుల వైపు దూసుకెళ్లనుంది. ధరూర్ విచ్చేసిన యాత్ర బృందానికి స్థానిక కాంగ్రెస్ శ్రేణులు అపూర్వ రీతిలో స్వాగతం పలికాయి. ధరూర్ గ్రామ సర్పంచ్ డి.ఆర్. విజయ్‌కుమార్, డి.ఆర్. శ్రీహర్ష పాదయాత్రికులకు శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించి తమ విప్లవాత్మక మద్దతును ప్రకటించారు.ప్రజా క్షేత్రంలోనే యుద్ధం.. రాజ్యాంగ పరిరక్షణే శ్వాస! ధరూర్‌లోని శక్తి సముదాయ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాటూరి వెంకటేశ్వర్లు అత్యంత గంభీరంగా స్పందించారు. ఈ యాత్ర కేవలం నడక కాదని, దేశ పౌరుల ఆక్రోశాన్ని, ఆవేదనను వెలికితీసే ఒక సమర వేదిక అని స్పష్టం చేశారు. సమానత్వం, సామాజిక న్యాయాన్ని పాతిపెడుతున్న శక్తులకు బుద్ధి చెప్పడానికే ఈ సంకల్పం! దేశ ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువైన రాజ్యాంగ విలువలను విచ్ఛిన్నం చేస్తుంటే చూస్తూ ఊరుకోం. ప్రతి పౌరుడిలో చైతన్య జ్వాలను రగిలిస్తూ, నవభారతాన్ని ఆవిష్కరించే వరకు ఈ పోరాటం ఆగదు!" కాటూరి వెంకటేశ్వర్లు, సామాజిక కార్యకర్త & న్యాయవాది కశ్మీర్ దాకా తగ్గని కాక

దేశంలో ఏ మూల చూసినా ప్రజల్లో నిరసన జ్వాలలు వ్యక్తమవుతున్నాయని, ప్రజల ఆశీస్సులే తమకు ఆయుధాలుగా మారాయని వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఒక శక్తివంతమైన, సమగ్ర, ప్రగతిశీల భారత నిర్మాణం కోసం కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు సాగే ఈ మహా పోరాటానికి దేశ ప్రజలందరూ సంపూర్ణ మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ధరూర్ సర్పంచ్ డి.ఆర్. విజయ్‌కుమార్, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ గద్వాల నియోజకవర్గ సామాజిక మాధ్యమాల సమన్వయకర్త ధరూర్ రవి, డి.ఆర్. శ్రీహర్ష, సంజీవ్ స్మార్ట్, ఉప సర్పంచ్ ఈదన్న, లాజర్, సవారన్న, గోపాల్, రఫీ తదితర ముఖ్య నాయకులు పాల్గొని యాత్రకు జయజయధ్వానాలు పలికారు.

# డ్రై ఫ్రూప్ట్స్ తో రాఖీలు తయారు చేసిన చిన్నారి

- **మండల కేంద్రమైన శివ్వంపేటకు చెందిన 7వ తరగతి(ఎంజేపీ ప్రభుత్వ హాస్టల్ ) విద్యార్థిని....**

**వుదయం న్యూస్**
**శివ్వంపేట ఆగస్ట్ 28....**



మెదక్ జిల్లా శివ్వంపేట మండల కేంద్రంలో డ్రై ఫ్రూప్ట్స్ తో రాఖీ తయారు చేసి చిన్నారి తన కుటుంబ సభ్యులకు కట్టింది. డ్రై ఫ్రూప్ట్స్ అంజీరా పండు, కిస్మిస్, మఖానా, బాదం, కాజు, పిస్తా, దారం ఉపయోగించి రాఖీలు స్వంత ఆలోచనతో తయారు చేసింది. పప్పులు, ఆకులతో కూడా రాఖీ తయారు చేసింది. వీటిని వృథాగా పారేయకుండా మళ్లీ తినే విధంగా ఉపయోగ పాడుతాయని చిన్నారి ఆలోచన. ప్లాస్టిక్, రసాయన, కవర్లతో తయారు చేసినవి కొనుగోలు చేసి కట్టడంతో అవి వృథా అవుతున్నాయని తెలిపారు. వాటికి వినియోగించే డబ్బు డ్రై ఫ్రూప్ట్స్ కు వినియోగించి తిరిగి తినేందుకు దోహద పడుతుందని చిన్నారి ఆలోచన. గత ఏడాది కూడా ఎలాంటి రాసాయనాలు, ప్లాస్టిక్ వస్తువులు ఉపయోగుంచకుండా కాగితాలు ఉపయోగించి రాఖీలు తయారు చేసి కట్టింది.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలి

- **సిబ్బందికి అనుగుణంగా ఓపీల సంఖ్య పెరగాలి**
- **ఉద్యోగులు తరచూ సెలవులు పెట్టడంపై కలెక్టర్ ఆగ్రహం**

**ఆలంపూర్ ఆగస్టు 28**
**(వుదయం కరస్పాండెంట్)**




ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వైద్యాధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న వైద్యులు, సిబ్బంది సేవలను ప్రజలు పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. శుక్రవారం ఆలంపూర్ చౌరస్తాలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో పెద్ద సంఖ్యలో వైద్యులు, సిబ్బంది పని చేస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో ఓపీ సంఖ్య లేకపోవడంపై అధికారులను ప్రశ్నించారు. ఆసుపత్రిలోనే అందించగల వైద్య సేవలను అందించకుండా రోగులను కర్నూలు లేదా ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఆసుపత్రిలోని రోగులను కలెక్టర్ స్వయంగా పలకరించి వారి ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇన్‌పేషెంట్ల ఆరోగ్య పరిస్థితిని ప్రతిరోజూ పర్యవేక్షిస్తూ, అవసరమైన వైద్య పరీక్షలు ఎప్పటికప్పుడు నిర్వహించాలని ఆదేశించారు. రోగులకు ఆసుపత్రి మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. ల్యాబ్‌ను పరిశీలించిన కలెక్టర్ ప్రతిరోజూ నిర్వహించాల్సిన వివిధ రకాల వైద్య పరీక్షలను పక్కాగా నిర్వహించి, రోగులకు పరీక్షల నివేదికలను సకాలంలో అందించాలని ఆదేశించారు. గైనిక్, యూఎస్‌జీ, ఫార్మసీ, ఈసీజీ తదితర విభాగాలను సందర్శించి సిబ్బంది పనితీరును పరిశీలించారు.హాజరు రిజిస్టర్‌తో పాటు పలు రికార్డులను తనిఖీ చేసిన కలెక్టర్, కొంతమంది ఉద్యోగులు తరచూ ఎక్కువ రోజులు సెలవులు పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించడం, సరైన పనితీరు కనబరచకపోవడం వంటి అంశాలను ఉపేక్షించేది లేదని, అవసరమైతే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఆసుపత్రిలో పారిశుద్ధ్య సిబ్బంది పెద్ద సంఖ్యలో ఉన్నందున ఆసుపత్రి పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆసుపత్రి ఆవరణలో పెరిగిన పొదలను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. బయోమెడికల్ వ్యర్థాలను నిబంధనల ప్రకారం నిర్వహించేందుకు తగిన ఏజెన్సీని నియమించాలని సూచించారు. తనిఖీలో భాగంగా ఆసుపత్రి ప్రహరీ గోడలో కొంత భాగం కూలిపోయిన విషయాన్ని కలెక్టర్ గమనించారు. దీనికి మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ తనిఖీలో ఆసుపత్రి పర్యవేక్షకులు సయ్యద్ పాషా, ఉండవెల్లి మండల తహసీల్దార్ ధరణి షా తదితరులు పాల్గొన్నారు.

# అంబరాన్నంటిన 'రాఖీ' సంబరాలు

- **ప్రేమానురాగాలకు ప్రతీకగా ఆత్మీయ వేడుకలు**
- **అన్నచెల్లెళ్ల అనుబంధం...**
- **రక్షణగా నిలుస్తామంటూ సోదరుల అభయం**

**తాండూరు**
**(ఆగస్టు 28 వుదయము ప్రతినిధి ):-**



తాండూరు నియోజకవర్గ వ్యాప్తంగా రక్షాబంధన్ వేడుకలు శుక్ర వారం అత్యంత వైభవంగా, ఆత్మీయతా అనురాగాల నడుమ జరిగాయి. అక్కచెల్లెళ్లు, అన్నతమ్ముళ్ల పవిత్రమైన అనుబంధానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగను నియోజకవర్గ ప్రజలు ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు.సోదరీమణులు తమ సోదరుల నొసటన తిలకం దిద్ది, చేతులకు అందమైన రాఖీలు కట్టి నోరు తీపి చేశారు. వారు ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. సోదరులు తమ సోదరీమణులకు కానుకలు అందజేసి, జీవితాంతం వారికి రక్షణగా ఉంటామని అభయమిచ్చారు. నియోజకవర్గంలోని పట్టణ పరిసరాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ ఉదయం నుంచే పండుగ వాతావరణం నెలకొంది. ఈ ఆత్మీయ వేడుకలతో తాండూరు అంతటా ప్రేమానురాగాలు వికసించాయి.

## గుంతల గద్వాల.. ప్రజల
# రక్తంతో పాలకుల సంబరం!

- **పేపర్‌పై రూ. 339.39 కోట్లు.. రోడ్లపై విరిగే ఎముకలు!**
- **225.47 కి.మీ. పరిధిలో మృత్యు బాటలు.. ఏ రోడ్డు చూసినా శవాల దిబ్బేనా?**
- **రిబ్బన్లు కట్ చేయడానికి పూనకాలు.. రోడ్లు వేయడానికి సాకులు!**
- **మంత్రి వస్తే 'మట్టి' నాటకం.. ఆయన వెళ్తే జనం జీవితాలు బూడిద!**

**గద్వాల ఆగస్టు 28**
**(వుదయం బ్యూరో)**



ఇది రహదారి కాదు.. నరకానికి పరిచిన నాణ్యత లేని నల్లటి బాట! ఇక్కడ ప్రయాణించడం అంటే వాహనం నడపడం కాదు.. యమధర్మరాజుతో జూదం ఆడటమే! అడుగడుగునా ఊబిలా విచ్చుకున్న గుంతలు, క్షణక్షణమూ వణికిస్తున్న మృత్యు ప్రమాదాలు గద్వాల నియోజకవర్గాన్ని ఏలుతున్న పాలకుల అంతులేని నిర్లక్ష్యానికి, నిద్రపోతున్న అధికారుల ద్రోహానికి నిలువెత్తు శవ పంచాంగంగా మారాయి. ప్రజాధనం కోట్లల్లో మంజూరైందని మైకులు పగలగొట్టే నాయకులు.. గుంతల్లో రక్తం చిందిస్తున్న సామాన్యుడి ఆర్తనాదాలు వినపడటం లేదా? అని ప్రజలు నిలదీస్తున్నారు. నడిరోడ్డుపై నరకదర్శనం.. ప్రయాణికులపై దండయాత్ర! ఆర్అండ్‌బీ పరిధిలోని 225.47 కిలోమీటర్ల మేర ఉన్న రహదారులు పూర్తిగా ఛిద్రమై శవాల దిబ్బలను తలపిస్తున్నాయి.రూ. 339.39 కోట్లు.. ఏ జేబుల్లోకి వెళ్లాయి? గతేడాది జూలై 13న ధరూర్ మండల కేంద్రంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రూ.339.39 కోట్లతో 125.89 కిలోమీటర్ల రోడ్డు పనులకు అట్టహాసంగా భూమిపూజ చేశారు. కెమెరాల ముందుకు వచ్చి ఫోజులిచ్చి శంకుస్థాపన రాయి పాతారు. తాత్కాలికంగా మట్టి వేస్తున్నాం. హామ్ పనులకు ఒప్పందం కావాల్సి ఉంది.. త్వరలోనే చేస్తాం. —— ఆర్అండ్‌బీ అధికారుల బాధ్యతారాహిత్య ప్రకటన తాత్సారం ఆపండి.. పనులు మొదలు పెట్టండి! కోట్ల రూపాయల హామీల పేరుతో ఓట్లు దండుకోవడం కాదు.. రోడ్లపైకి వచ్చి చూడండి జనం పడుతున్న నరకమేంటో! నాయకుల ఆర్భాటాలు, అధికారుల చేతకానితనానికి ఇక స్వస్తి పలకాలి. గద్వాల ప్రజలకు కావాల్సింది శంకుస్థాపన రాళ్లు కాదు.. సురక్షితమైన రహదారులు. ఇంకెన్ని ప్రాణాలు బలి తీసుకున్నాక పనులు మొదలుపెడతారో ప్రభుత్వం వెంటనే సమాధానం చెప్పాలి!

# పెద్దమఠం అభివృద్ధికి లింగాయత్ సమాజం వినతి

**సంగారెడ్డి, వుదయం:**



సంగారెడ్డి పట్టణంలోని పవిత్ర పెద్దమఠం ఆధ్యాత్మికతకు, సేవా కార్యక్రమాలకు మరింతగా నిలయంగా మారాలని వీరశైవ లింగాయత్ సమాజం సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఇప్పపల్లి నర్సింలు ఆకాంక్షించారు.సదాశివపేట పెద్దమఠం అనుసంధానంలో కొనసాగుతున్న సంగారెడ్డి పట్టణ పెద్దమఠంలో శ్రీ లింగానంద్ స్వామివారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక, ధార్మిక, సేవా కార్యక్రమాలు మరింత విస్తరించి, లింగాయత్, జంగమ సమాజాల అభ్యున్నతికి దోహదపడాలని కోరుతూ ఇప్పపల్లి నర్సింలు ఆధ్వర్యంలోని ప్రతినిధులు శ్రీ లింగానంద్ స్వామివారిని భక్తిశ్రద్ధలతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని సమాజ సంక్షేమం, ధర్మ పరిరక్షణ, ఆధ్యాత్మిక అభివృద్ధికి పెద్దమఠం మరింతగా సేవ చేయాలని ప్రతినిధులు ప్రార్థించారు. భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన ఈ పవిత్ర క్షేత్రం ద్వారా సమాజానికి మరిన్ని సేవా కార్యక్రమాలు అందించాలని ఆకాంక్షించారు. వినతిపై శ్రీ లింగానంద్ స్వామివారు సానుకూలంగా స్పందిస్తూ, సమాజ అభ్యున్నతికి సంబంధించిన ఈ పవిత్రమైన విషయాన్ని ఆలంపల్లి-దుదిని పీఠాధిపతి పరమపూజ్య శ్రీ చెన్న బసవ మహాప్రభు గారి దృష్టికి నాలుగైదు రోజుల్లో తీసుకెళ్లి, వారి సూచనలు, ఆశీస్సులతో తగిన విధంగా ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.పరమపూజ్యుల ఆశీస్సులతో పెద్దమఠం మరింత అభివృద్ధి చెంది, లింగాయత్, జంగమ సమాజాలకు ఆధ్యాత్మిక, సామాజిక సేవలకు ప్రధాన వేదికగా నిలవాలని భక్తులు ఆకాంక్షించారు. ధర్మ సేవ, సమాజ సేవ మరింత బలోపేతం కావాలని స్వామివారిని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ గందిగే రాజు, సంగారెడ్డి తాలూకా ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల శివకుమార్, సదాశివపేట మండల గౌరవ అధ్యక్షులు ఎద్దుల సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నాచెల్లెళ్ల
# అనుబంధానికి ప్రతీకగా రాఖీ పౌర్ణమి

- **చింత సాయినాథ్‌కు సోదరి రాఖీ.. కుటుంబ సభ్యుల మధ్య ఘనంగా వేడుకలు**

**సంగారెడ్డివుదయం :**



అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమానురాగాలు, ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి వేడుకలను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తనయుడు చింత సాయినాథ్ కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకున్నారు.చిన్ననాటి నుంచి కొనసాగుతున్న అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ కుటుంబ సభ్యుల మధ్య వేడుకలు సంతోషంగా సాగాయి. రాఖీ పండుగ సందర్భంగా సోదరి తన సోదరుడి చేతికి రాఖీ కట్టి, సోదరుడి క్షేమం, ఆయురారోగ్యాలను ఆకాంక్షించడం ఆనవాయితీగా వస్తోంది.ఈ సందర్భంగా చింత సాయినాథ్ తన సోదరికి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేస్తూ, అన్నాచెల్లెళ్ల బంధం ఎల్లప్పుడూ ప్రేమాభిమానాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యుల సమక్షంలో జరిగిన ఈ రాఖీ వేడుక ఆత్మీయ వాతావరణంలో కొనసాగింది.రాఖీ పౌర్ణమి సందర్భంగా కుటుంబ సభ్యులంతా కలిసి పండుగను జరుపుకోవడంతో ఇంట్లో సందడి నెలకొంది. ప్రేమ, ఆప్యాయతలకు ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను ఆనందోత్సాహాలతో నిర్వహించారు.

# ప్రజా సమస్యలపై బీజేపీ పోరుబాట

**నాగర్ కర్నూల్, ఆగస్టు 28**
**(వుదయం ప్రతినిధి):**



నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలో ప్రజా సమస్యలపై బీజేపీ నిత్యం పోరాటం చేస్తుందని బిజెపి టౌన్ ప్రెసిడెంట్ చెవ్వ ప్రమోద్ కుమార్ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో ఆయన పర్యటించారు. ఈ కాలనీలో శ్రీనివాస హాస్పిటల్, చంద్రారెడ్డి హాస్పిటల్, ప్రగతి హాస్పిటల్ సహా పలు హాస్పిటల్స్, ఫిజియోథెరపీ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. పేషెంట్లు, చిన్న పిల్లలు, విద్యార్థులు, స్థానికులు ఈ దారి గుండానే మెయిన్ రోడ్డుకు వెళ్తుంటారని, కూతవేటు దూరంలోనే మెయిన్ రోడ్ ఉందని అన్నారు.ఇక్కడ కాల్వలన్నీ చెత్తతో నిండిపోయి మురుగు నీటితో పూడుకుపోయాయని, నీళ్లు అక్కడే జామ్ అయిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో క్రిమి కీటకాలు, దోమలు స్వైర విహారం చేస్తున్నాయని, మున్సిపాలిటీ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వెంటనే ఈ సమస్యను క్లియర్ చేయాలని లేదా మోరీని బంద్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ట్రెజరర్ రాజా రామేశ్వర రావు, శివ, స్థానికులు అనిల్, విజయ్ జాంగిర్, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమానురాగాలు పంచిన రాఖీ పండుగ

- **ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌కు సోదరి రాఖీ**

**సంగారెడ్డివుదయం :**



అన్నాచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధానికి, ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి వేడుకలను సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కుటుంబ సభ్యుల సమక్షంలో ఆనందంగా జరుపుకున్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆయన సోదరి ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌కు రాఖీ కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సోదరి రాఖీ కట్టి, ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. సోదరి ప్రేమగా రాఖీ కట్టడంతో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సంతోషం వ్యక్తం చేశారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి కుటుంబంలో ప్రేమ, ఆప్యాయతలు, సోదరభావం వెల్లివిరియాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.రాఖీ పండుగ కేవలం అన్నాచెల్లెళ్ల మధ్య రాఖీ కట్టుకునే వేడుక మాత్రమే కాదని, కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేసే పవిత్రమైన పండుగ అని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పేర్కొన్నారు. పరస్పరం ప్రేమ, ఆప్యాయతలు పంచుకుంటూ కుటుంబ సభ్యులంతా ఐకమత్యంగా ఉండాలని ఆకాంక్షించారు.

# డయాబెటిస్ లేకపోయినా షుగర్ లెవల్స్ పెరుగుతాయా..

భోజనం చేసిన తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలు కొంత పెరగడం సహజమే. అయితే అది ఎంత మేర పెరిగింది, ఎంతసేపు ఎక్కువగా ఉంది, ఎంత తరచూ జరుగుతోంది, ఆ తర్వాత మళ్లీ సాధారణ స్థాయికి వస్తుందా అనే విషయాలను పరిశీలించడం ముఖ్యం. ఒక్కసారి బ్లడ్ షుగర్ పెరిగినంత మాత్రాన డయాబెటిస్ ఉందని నిర్ధారించలేం. ఆహారం, శారీరక శ్రమ, నిద్ర, ఒత్తిడి వంటి అనేక అంశాలు



రక్తంలో గ్లూకోజ్ స్థాయిలని తాత్కాలికంగా ప్రభావితం చేస్తాయి. మనం కార్బోహైడ్రేట్లు ఉన్న ఆహారం తీసుకున్నప్పుడు జీర్ణ వ్యవస్థ వాటిని గ్లూకోజ్‌గా విడగొడుతుంది. ఈ గ్లూకోజ్ రక్తంలోకి చేరడంతో బ్లడ్ షుగర్ పెరుగుతుంది. దీనికి ప్రతిస్పందనగా క్లోమం ఇన్సులిన్‌ను విడుదల చేస్తుంది. ఇన్సులిన్ రక్తంలోని గ్లూకోజ్‌ను కండరాలు, ఇతర కణజాలాల్లోకి చేరేలా చేస్తుంది. సాధారణంగా డయాబెటిస్ లేని వారిలో ఈ ప్రక్రియ కొంత సమయం తర్వాత రక్తంలో చక్కెరను సాధారణ స్థాయికి తీసుకువస్తుంది. అయితే ప్రతి ఆహారం రక్తంలో చక్కెరను ఒకే విధంగా పెంచదు. తెల్ల బియ్యం, ఆలుగడ్డలు, చక్కెర కలిగిన పానీయాలు, స్వీట్లు వంటి ఆహారాలు గ్లూకోజ్‌ను వేగంగా పెంచుతాయి. మరోవైపు కూరగాయలు, ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, అధిక ఫైబర్ ఉన్న కార్బోహైడ్రేట్లతో కూడిన ఆహారం రక్తంలో గ్లూకోజ్ పెరుగుదల వేగాన్ని తగ్గిస్తుంది. తీసుకునే ఆహారం పరిమాణం కూడా ఇందులో కీలక పాత్ర పోషిస్తుంది. తీవ్రమైన ఒత్తిడి ఉన్న సమయంలో కూడా బ్లడ్ షుగర్ తాత్కాలికంగా పెరుగుతుంది. ఒత్తిడికి ప్రతిస్పందనగా శరీరంలో కార్టిసాల్, అడ్రినలిన్ వంటి హార్మోన్లు విడుదలవుతాయి. ఇవి కాలేయంలో నిల్వ ఉన్న గ్లూకోజ్‌ను రక్తంలోకి విడుదల చేయమని సంకేతాలు ఇస్తాయి. ఫలితంగా గతంలో బ్లడ్ షుగర్ సమస్యలు లేని వ్యక్తుల్లో కూడా కొంతకాలం గ్లూకోజ్ స్థాయిలు పెరిగే అవకాశం ఉంటుంది. అనారోగ్యం, జ్వరం లేదా శారీరక గాయం సమయంలో కూడా ఇలాంటి పరిస్థితి కనిపిస్తుంది. ఈ సమయంలో ఒత్తిడి హార్మోన్లు పెరగడంతోపాటు కొంతకాలం ఇన్సులిన్ ప్రభావం తగ్గుతుంది. అలాగే నిద్ర సరిగా లేకపోవడం కూడా ఇన్సులిన్ సెన్సిటివిటీ, ఆకలి నియంత్రణపై ప్రభావం చూపుతుంది. కాబట్టి తక్కువ గంటలు నిద్రపోయే రోజుల్లో బ్లడ్ షుగర్ ఎక్కువగా కనిపిస్తే, ఈ రెండింటి మధ్య సంబంధం ఉంటుంది. వ్యాయామం కూడా బ్లడ్ షుగర్‌పై వివిధ రకాల ప్రభావాలు చూపుతుంది. సాధారణంగా ఏరోబిక్ వ్యాయామం కండరాలు గ్లూకోజ్‌ను ఉపయోగించుకునేలా చేసి బ్లడ్ షుగర్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. అయితే తీవ్రమైన వ్యాయా మం, ముఖ్యంగా అధిక శ్రమతో కూడిన అనెరోబిక్ వ్యాయామం సమయంలో అడ్రినలిన్ వంటి హార్మోన్ల ప్రభావంతో కాలేయం ఎక్కువ గ్లూకోజ్‌ను రక్తంలోకి విడుదల చేస్తుంది. దీంతో కొద్దిసేపు బ్లడ్ షుగర్ పెరిగినట్లు కనిపిస్తుంది. దీనర్థం వ్యాయామం మానేయాలని కాదు. క్రమం తప్పకుండా శారీరక శ్రమ చేయడం దీర్ఘకాలంలో ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరచి శరీరం గ్లూకోజ్‌ను సమర్థంగా వినియోగించుకునేలా చేస్తుంది. కొన్ని మందులు కూడా రక్తంలో చక్కెర స్థాయిలను ప్రభావితం చేస్తాయి. ముఖ్యంగా ప్రెడ్నిసోలోన్ వంటి కార్టికోస్టెరాయిడ్లు బ్లడ్ షుగర్‌ను పెంచే అవకాశం ఉంది. కొన్ని హార్మోనల్ మందులు, ఇతర ఔషధాలు కూడా గ్లూకోజ్ నియంత్రణపై ప్రభావం చూపిస్తాయి. కొత్త మందు ప్రారంభించిన తర్వాత బ్లడ్ షుగర్ పదేపదే పెరుగుతున్నట్లు గమనిస్తే, వైద్యుడిని సంప్రదించాలి. వైద్యుడి సలహా లేకుండా మందులను స్వయంగా ఆపకూడదు.


# మిరియాలు చేసే మేలు



గొంతునొప్పికి విరుగుడు: జలుబు దనం లాంటి సమస్యలు వచ్చినప్పుడు గొంతులో మంట, నొప్పి, గరుకు సాధారణం. గోరువెచ్చని నీటిలో చిటికెడు మిరియాల పొడి కలిపి తీసుకున్నా, తేనెతో కొద్దిగా మిరియాల పొడి కలిపి తీసుకున్నా గొంతు నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. దీనిలోని యాంటీ బ్యాక్టీరియల్ , యాంటీ ఆక్సిడెంట్ గుణాలు గొంతు చికాకును దూరం చేస్తాయి. గొంతులోని కఫాన్ని పలుచన చేసి రిలీఫ్ ఇస్తాయి. జలుబు, దగ్గు మటుమాయం: నల్ల మిరియాలలో పైపరిన్ ఉంటుంది. ఇది శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్. అంతే కాకుండా.. ఇందులోని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు గొంతు నొప్పి, దగ్గు, ముకు దిబ్బడ సమస్యను పరిష్కరిస్తాయి. ఆయుర్వేదం ప్రకారం గొంతులో పేరుకుపోయిన కఫాన్ని కరిగించే గుణం మిరియాలకు ఉంటుంది. దీంతో కఫం బయటికి రావడం సులభమై, ఛాతీలో బరువు కొంత తగ్గుతుంది. ఉపశమనం కోసం మిరియాల పొడిని తేనె లేదా అల్లం టీతో కలిపి తీసుకోండి. ఇమ్యూనిటీ కోసం: మిరియాలలో విటమిన్ సి, విటమిన్ ఎ, ఫ్లేవనాయిడ్స్ , కెరోటినాయిడ్స్ వంటి శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. మిరియాలను తరచు తీసుకుంటే రోగనిరోధక శక్తి మెరుగుపడుతుంది. ఇన్ఫెక్షన్లు, రోగాలు రాకుండా ఉంటాయి. మిరియాలలో ఉండే యాంటీ మైక్రోబియల్ గుణాలు, తేమతో కూడిన వర్షాకాలంలో వృద్ధి చెందే హానికరమైన బ్యాక్టీరియా, క్రిముల నుంచి శరీరాన్ని రక్షిస్తుంది.

# మహిళల్లో పెరుగుతున్న ఎండోమెట్రియల్ క్యాన్సర్ కేసులు..

మహిళల ఆరోగ్యానికి సంబంధించిన క్యాన్సర్లలో రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ల గురించి ఎక్కువగా చర్చ జరుగుతుంటుంది. అయితే గర్భాశయంలోని లోపలి పొరను ప్రభావితం చేసే ఎండోమెట్రియల్ క్యాన్సర్ కేసులు కూడా భారత్‌లో క్రమంగా పెరుగుతున్నాయి. మారుతున్న జీవనశైలి, ఊబకాయం, మెటబాలిక్ సమస్యలు, సంతానోత్పత్తికి సంబంధించిన మార్పులు వంటి కారణాలతో ఈ క్యాన్సర్ ముప్పు పెరుగుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు. 2022లో భారత్‌లో సుమారు 17,240 కొత్త ఎండోమెట్రియల్ క్యాన్సర్ కేసులు నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. గర్భాశయంలోని లోపలి పొర అయిన ఎండోమెట్రియంలో ఈ క్యాన్సర్ ఏర్పడుతుంది. వయసు పెరగడం ఒక ముఖ్యమైన ప్రమాద కారకం కాగా, ప్రొజెస్టెరాన్ తగినంత సమతుల్యం లేకుండా ఈస్ట్రోజెన్‌కు ఎక్కువకాలం గురికావడం కూడా ప్రమాదాన్ని పెంచుతుంది. ఇలా ఎక్కువకాలం హార్మోన్ల ప్రభావం కొనసాగడం వల్ల గర్భాశయ లోపలి పొరలోని కణాలు అసాధారణంగా పెరిగే అవకాశం ఉంటుంది. ఎండోమెట్రియల్ క్యాన్సర్‌కు ఊబకాయాన్ని ముఖ్యమైన ప్రమాద కారకాల్లో ఒకటిగా పరిగణిస్తున్నారు. శరీరంలో అదనంగా ఉన్న కొవ్వు కేవలం శక్తి నిల్వగా మాత్రమే ఉండదు. ఇది ఇతర హార్మోన్లను ఈస్ట్రోజెన్‌గా మార్చడంలో కీలకపాత్ర పోషిస్తుంది. ఫలితంగా శరీరంలో ఈస్ట్రోజెన్‌కు ఎక్కువకాలం గురయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. భారత్‌లో ఊబకాయం పెరుగుతున్న కొద్దీ ఈ క్యాన్సర్ ముప్పు ఉన్న మహిళల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉంది. చిన్న వయసులోనే రుతుస్రావం ప్రారంభం కావడం లేదా ఆలస్యంగా మెనోపాజ్ రావడం వల్ల మహిళలు జీవితకాలంలో ఎక్కువ సంవత్సరాలు ఈస్ట్రోజెన్ ప్రభావానికి గురవుతారు. పాలీసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ (PCOS), వంధ్యత్వం, కొన్ని మెటబాలిక్ సమస్యలు కూడా హార్మోన్ల సమతుల్యతను ప్రభావితం చేసి ఎండోమెట్రియల్ క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయి. ఈ క్యాన్సర్‌కు సంబంధించిన ముఖ్యమైన హెచ్చరిక సంకేతాల్లో మెనోపాజ్ తర్వాత కనిపించే అసాధారణ యోని రక్తస్రావం ఒకటి. మెనోపాజ్ పూర్తయిన మహిళల్లో స్వల్పంగా రక్తపు మరకలు కనిపించినా, స్పాటింగ్ జరిగినా లేదా గోధుమ రంగు స్రావం వచ్చినా వైద్య పరీక్ష చేయించుకోవాలి. మెనోపాజ్‌కు చేరువలో ఉన్న మహిళల్లో సాధారణం కంటే ఎక్కువగా రక్తస్రావం కావడం, రెండు రుతుచక్రాల మధ్య రక్తస్రావం కనిపించడం లేదా రుతుస్రావంలో మార్పులు ఎక్కువకాలం కొనసాగడం వంటి లక్షణాలను కూడా నిర్లక్ష్యం చేయకూడదు. మెనోపాజ్ తర్వాత వచ్చే ప్రతి రక్తస్రావం క్యాన్సర్ అని అర్థం కాదు. అయితే ప్రతి అసాధారణ రక్తస్రావాన్ని మాత్రం వైద్యపరంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే కొన్నిసార్లు ఇలాంటి లక్షణం శరీరంలో మరింత పరీక్ష అవసరమైన సమస్యకు తొలి సంకేతంగా ఉంటుంది. ఎండోమెట్రియల్ క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే చికిత్సకు మంచి అవకాశాలు ఉంటాయి. అయితే వ్యాధి ముదిరే కొద్దీ చికిత్స మరింత క్లిష్టంగా మారుతుంది. ప్రస్తుతం వ్యాధి నిర్ధారణలో వస్తున్న పురోగతితో కణితి జీవశాస్త్ర లక్షణాలను మరింత మెరుగ్గా అర్థం చేసుకుని, అందుకు అనుగుణంగా చికిత్సను రూపొందించే అవకాశం పెరిగింది.



# చక్కని ఆరోగ్యం

# ఐరన్ పెరగాలంటే!

ఐరన్ లోపం ఉంటే తక్కువగా శ్వాస తీసుకోవడం, నీరసం, ఎంతకీ తగ్గని తలనొప్పి లక్షణాలు ఉంటాయి. ఆ లోపాన్ని సరిచేసుకునేందుకు ఐరన్ అధికంగా ఉన్న ఆహారం తిన్నా



కొంతమంది ఆ సమస్యల నుంచి బయటపడలేరు. తినే ఆహారంలో ఐరన్ అధికంగా ఉన్న పదార్థాలు చేర్చుతారు. కానీ, కొందరి శరీరం దానిని పూర్తి స్థాయిలో గ్రహించే సామర్థ్యం కలిగి ఉండదు. అప్పుడు ఎంత తిన్నా లాభం ఉండదు. ఈ విషయం పట్ల అవగాహన లేక, రక్తహీనతతో బాధపడేవాళ్లు మాంసం, గుడ్లు, బీట్‌రూట్ మొదలైనవి తినడం మీదనే దృష్టి పెడతారు. ఆ ఆహారంలోని ఐరన్‌ని జీర్ణ వ్యవస్థ గ్రహించాలంటే శరీరంలో విటమిన్–సి లోపం ఉండకూడదు. విటమిన్–సి ఇనుముని గ్రహించే సామర్థ్యాన్ని పెంచుతుంది. కాబట్టి మాంసం తినేటప్పుడు ఓ నిమ్మ చెక్క పిండుకుంటే మంచిది. శాకాహారులు ప్రతి ఉదయం నిమ్మ రసం తాగే అలవాటు చేసుకుంటే ఐరన్ సంగ్రహణే కాదు జీర్ణవ్యవస్థ కూడా సాఫీగా సాగిపోతుంది. ఈ అలవాటు లేకపోతే వారంలో రెండు (సార్లు) రోజులు బత్తాయి జ్యూస్ తాగితే మంచింది. ఐరన్ కోసం ప్రొటీన్ అధికంగా ఉండే ఆహారం తింటే శరీరం ఇనుప కండలతో రాటు దేలుతుంది!

ఆధునిక జీవనశైలిలో ఒత్తిడి, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు సాధారణంగా మారుతున్నాయి. అయితే వీటి ప్రభావం కేవలం మానసిక ఆరోగ్యంపైనే కాకుండా గుండె ఆరోగ్యంపైనా పడు

# దీర్ఘకాలంగా ఒత్తిడి ఉంటే కొలెస్ట్రాల్‌పై ప్రభావం పడే ప్రమాదం..



తోంది. ముఖ్యంగా దీర్ఘకాలిక ఒత్తిడి, అధిక కొవ్వులు, చక్కెరలు ఉన్న ఆహారం తీసుకోవడం వంటి కారణాలు కొలెస్ట్రాల్ స్థాయిలను ప్రభావితంచేసే అవకాశం ఉంటుంది. కొలెస్ట్రాల్ పెరగడం వల్ల గుండె జబ్బులు, రక్తనాళాల్లో అడ్డంకులు ఏర్పడే ప్రమాదం పెరుగుతుంది. అందుకే ఒత్తిడిని నియంత్రించడంతోపాటు ఆహారపు అలవాట్లపైనా దృష్టి పెట్టడం అవసరం. ఒత్తిడి కొలెస్ట్రాల్‌ను నేరుగా ప్రభావితం చేస్తుందని వైద్యులు చెబుతున్నారు. మనం ఒత్తిడికి గురైనప్పుడు శరీరంలో కార్టిసాల్, అడ్రినలిన్ వంటి హార్మోన్లు ఎక్కువగా విడుదలవుతాయి. ఇవి అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు శరీరాన్ని సిద్ధం చేసే ఫైట్ ఆర్ ఫ్లైట్ ప్రతిస్పందనలో భాగంగా పనిచేస్తాయి.ఒత్తిడి దీర్ఘకాలం కొనసాగితే ఈహార్మోన్ల ప్రభావం శరీరంలోని జీవక్రియలపై పడుతుంది. దీర్ఘకాలిక ఒత్తిడి సమయంలో కార్టిసాల్ స్థాయిలు పెరగడం వల్ల కాలేయం మరిం త గ్లూకోజ్‌ను తయారు చేయడంతోపాటు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ల ఉత్పత్తిని కూడా పెంచుతుంది. ఇవి శరీరానికి కొన్ని ముఖ్యమైన ప్రక్రియల్లో అవసరమైనప్పటికీ, ఎక్కువ కాలం స్థాయిలు అధికంగా ఉంటే రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోయి అడ్డంకులు ఏర్పడే ప్రమ దం పెరుగుతుంది. దీర్ఘకాలికమానసిక ఒత్తిడి శరీరంలో స్వల్ప స్థాయివాపును పెంచే అవకాశం ఉంటుంది.

ప్రసవం తర్వాత మహిళల్లో శరీరంలో అనేక హార్మోన్ల, రోగనిరోధక వ్యవస్థ మార్పులు చోటుచేసుకుంటాయి. ఈ సమయంలో థైరాయిడ్ పనితీరులో కూడా మార్పులు వస్తాయి. అయితే ప్రసవం తర్వాత థైరాయిడ్ సమస్య కనిపించిందంటే అది

# ప్రసవానంతరం మహిళలకు వచ్చే థైరాయిడ్ సమస్యలకు కారణాలేంటి..

జీవితాంతం కొనసాగుతుందని భావించాల్సిన అవసరం లేదని నిపుణులు చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఇది తాత్కాలికంగా ఉండే పోస్ట్‌పార్టమ్ థైరాయిడిటిస్ అవుతుంది. రక్తపరీక్షల్లో ఈ సమస్య హషిమోటోస్ వ్యాధిని పోలి కనిపించే అవకాశం ఉండటంతో కొందరు మహిళలకు శాశ్వత థైరాయిడ్ సమస్యగా పొరపాటుగా నిర్ధారణ జరిగే అవకాశం ఉంటుంది. గర్భధారణ సమయంలో శిశువును రక్షించేందుకు మహిళ శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ సహజంగానే కొంత తక్కువగా చురుకుగా ఉంటుంది. ప్రసవం తర్వాత అది మళ్లీ సాధారణ స్థాయికి చురుకుగా మారే సమయంలో కొంతమంది మహిళల్లో రోగనిరోధక ప్రతిస్పందన అధికంగా మారి థైరాయిడ్ గ్రంధిలో వాపులకు దారితీస్తుంది. దాదాపు ప్రతి పది మంది మహిళల్లో ఒకరికి ఈ విధమైన పోస్ట్‌పార్టమ్ థైరాయిడిటిస్ వచ్చే అవకాశం ఉందని నిపుణుల వివరణలో పేర్కొన్నారు. ప్రసవం తర్వాత థైరాయిడ్ సమస్యకు సంబంధించిన లక్షణాలు ఒకే విధంగా ఉండవు. సాధారణంగా ఇది వివిధ దశల్లో కనిపిస్తుంది. మొదటి దశలో థైరాయిడ్ హార్మోన్లు అధికంగా విడుదల అవుతాయి. ఈ సమయంలో మహిళలు అలసటగా ఉన్నప్పటికీ, అదే సమయంలో అసహనంగా లేదా అధిక ఉత్సాహంతో ఉన్నట్లుగా అనిపిస్తుంది. నిద్ర సరిగా పట్టకపోవడం, ఒత్తిడిగా అనిపించడం, జుట్టు రాలడం వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి. అయితే కొత్తగా తల్లైన మహిళల్లో సాధారణంగా కనిపించే అలసట లేదా ఒత్తిడిగానే వీటిని భావించే అవకాశం ఉంటుంది. రెండో దశలో థైరాయిడ్ హార్మోన్ల స్థాయిలు తగ్గుతాయి. అప్పుడు తీవ్రమైన అలసట, ఎప్పుడూ శక్తి లేనట్లుగా అనిపించడం, భావోద్వేగంగా నీరసంగా ఉండటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇవి ప్రసవానంతర డిప్రెషన్ లక్షణాలను పోలి ఉండటంతో అసలు కారణాన్ని గుర్తించడం కొన్నిసార్లు కష్టమవుతుంది. అందుకే ప్రసవం తర్వాత ఇలాంటి లక్షణాలు కొనసాగితే వాటిని కేవలం ప్రసవం వల్ల వచ్చిన అలసటగా భావించకుండా వైద్యుల సలహాతో పరీక్షలు చేయించుకోవడం అవసరం. అయితే ప్రతి మహిళలో ఈ సమస్య జీవితాంతం కొనసాగదు. చాలా మందిలో మూడో దశలో థైరాయిడ్ పనితీరు క్రమంగా సాధారణ స్థితికి చేరుకుంటుంది. అలాంటి సందర్భాల్లో జీవితాంతం థైరాయిడ్ మందులు తీసుకోవాల్సిన అవసరం ఉండదు. కానీ కొంతమంది మహిళల్లో మాత్రం థైరాయిడ్ సమస్య శాశ్వతంగా మారే అవకాశం ఉంటుంది. అందుకే ప్రసవం తర్వాత థైరాయిడ్ సమస్యను గుర్తించిన వెంటనే అది జీవితాంతం ఉంటుందని నిర్ణయించకుండా, నిరంతర పర్యవేక్షణతో పరిస్థితిని అంచనా వేయడం ముఖ్యం. థైరాయిడ్ పెరోక్సిడేజ్ (TPO) యాంటీబాడీల స్థాయి ఈ విషయంలో ఒక ముఖ్యమైన సూచికగా ఉంటుంది. గర్భధారణ ప్రారంభ దశలోనే TPO యాంటీబాడీలను పరీక్షించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.



# ఒకసారి తగ్గిన తరువాత చికున్‌గున్యా మళ్లీ వస్తుందా..

కీళ్ల నొప్పులు, వాపు, బిగుతు వంటి లక్షణాలు చికున్‌గున్యా నుంచి కోలుకున్న తర్వాత కూడా కొన్ని వారాలు, నెలలు కొనసాగడం కొంతమందిలో కనిపిస్తుంది. జ్వరం, దద్దుర్లు తగ్గిపోయిన తర్వాత కూడా నొప్పి తిరిగి రావడంతో చాలామందికి మళ్లీ చికున్‌గున్యా సోకిందా అనే అనుమానం కలుగుతుంది. అయితే, సాధారణంగా ఇది కొత్తగా వైరస్ సోకడం కాకుండా, గతంలో వచ్చిన ఇన్ఫెక్షన్ తర్వాత కీళ్లలో కొనసాగుతున్న వాపు, రోగనిరోధక వ్యవస్థలో మార్పుల కారణంగా ఏర్పడే సమస్యగా నిపుణులు చెబుతున్నారు. చికున్‌గున్యా రెండోసారి సోకడం చాలా అరుదుగా జరుగుతుంది. ఒకసారి ఇన్ఫెక్షన్ నుంచి కోలుకున్న తర్వాత శరీరంలో వైరస్‌ను నిరోధించే యాంటీబాడీలు దీర్ఘకాలం పాటు రక్షణ కల్పిస్తాయి. అందువల్ల నెలలు లేదా సంవత్సరాల తర్వాత మళ్లీ కీళ్ల నొప్పులు కనిపిస్తే, అది కొత్త ఇన్ఫెక్షన్ కంటే పోస్ట్–చికునగున్యా కీళ్ల వాపు కారణంగా ఉండే అవకాశమే ఎక్కువగా ఉంటుంది. చికున్‌గున్యా సమయంలో వైరస్ రక్తంలో చురుకుగా ఉన్న దశ సాధారణంగా కొద్దికాలమే ఉంటుంది. అయితే వైరస్‌కు సంబంధించిన ఆర్ఎన్ఏ అవశేషాలు, ప్రోటీన్లు కీళ్లలోని కొన్ని కణజాలాల్లో మిగిలిపోవడం వల్ల స్థానికంగా మళ్లీ మళ్లీ వాపు ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉందని పరిశోధనలు చెబుతున్నాయి. ముఖ్యంగా కీళ్లలోని సైనోవియల్ కణాలు, మాక్రోఫేజ్‌లలో వైరస్‌కు సంబంధించిన అవశేషాలు ఉండటం ఈ సమస్యకు ఒక కారణంగా చెబుతున్నారు. మరోవైపు, చికున్‌గున్యా సమయంలో శరీరంలో ఏర్పడే తీవ్రమైన రోగనిరోధక ప్రతిస్పందన కొంతమందిలో క్రమంగా నియంత్రణ తప్పుతుంది. ఫలితంగా కీళ్లను ప్రభావితం చేసే వాపు కొనసాగుతుంది. ఇంటర్‌ల్యూకిన్–6, టీఎన్ఎఫ్–ఆల్ఫా వంటి వాపును పెంచే సైటోకైన్లు ఎక్కువగా ఉండటం వల్ల రుమటాయిడ్ ఆర్థరైటిస్ తరహా లక్షణాలు కూడా కనిపిస్తాయి. అలాగే చికున్‌గున్యా తర్వాత వచ్చే కీళ్ల సమస్యలు అందరిలో ఒకే విధంగా ఉండవు. కొంతమందిలో నొప్పి, బిగుతు కొంతకాలం కనిపించి తగ్గిపోతే, మరికొందరిలో అవి మళ్లీ మళ్లీ తిరిగి వస్తాయి. అందుబాటులో ఉన్న అధ్యయనాల ప్రకారం సుమారు 10 నుంచి 15 శాతం మందిలో ఇన్ఫెక్షన్ తర్వాత ఏడాదికి పైగా కీళ్ల సమస్యలు కొనసాగే అవకాశం ఉందని తేలింది. కొన్ని అధ్యయనాల్లో మూడు సంవత్సరాల వరకు కూడా కీళ్ల నొప్పులు తిరిగి వచ్చిన సందర్భాలు నమోదయ్యాయి. 45 ఏళ్లకు పైబడినవారు, మహిళలు, ఇప్పటికే ఆస్టియోఆర్థరైటిస్ వంటి కీళ్ల సమస్యలు ఉన్నవారిలో ఈ తరహా దీర్ఘకాలిక సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది.



# కార్డియో చేస్తున్నప్పటికీ బరువు తగ్గడం లేదా.. అయితే అందుకు కారణాలు ఇవే..

బరువు తగ్గేందుకు కార్డియో వ్యాయామాలు మంచి మార్గంగా వైద్య నిపుణులు చెబుతుంటారు. నడక, పరుగు, సైక్లింగ్ వంటి ఏరోబిక్ వ్యాయామాలు గుండె వేగాన్ని పెంచడంతోపాటు శరీరం ఎక్కువ కేలరీలను ఖర్చు చేసేలా చేస్తాయి. శరీరంలో నిల్వ ఉన్న శక్తిని వినియోగించడం ద్వారా బరువు తగ్గించే ప్రక్రియకు ఇవి సహాయపడతాయి. అయితే ప్రతిరోజూ కార్డియో చేస్తున్నంత మాత్రాన బరువు తప్పకుండా తగ్గుతుందని చెప్పలేం. ఆహారం, మెటబాలిజం, కండరాల పరిమాణం, ఒత్తిడి, రోజువారీ కదలికలు వంటి అంశాలు కూడా బరువు నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తాయి. కార్డియో వ్యాయామాల సమయంలో శరీరం ఎక్కువ శక్తిని ఖర్చు చేస్తుంది. అయితే వ్యాయామం పూర్తయిన తర్వాత ఆ అదనపు కేలరీల ఖర్చు అదే స్థాయిలో కొనసాగదు. అందువల్ల కార్డియోపై మాత్రమే ఆధారపడకుండా ఆహారం, శక్తి వినియోగం, కండరాల ఆరోగ్యం వంటి అంశాలను కూడా సమతుల్యం చేసుకోవాలి. ప్రతిరోజూ కార్డియో చేస్తున్నప్పటికీ బరువు తగ్గకపోవడానికి ఒక కారణం వ్యాయామం తర్వాత ఎక్కువగా తినడమే. కార్డియో చేసిన తర్వాత ఆకలి పెరగడం సాధారణం. ఈ సమయంలో అవసరానికి మించి కేలరీలు తీసుకుంటే వ్యాయామం ద్వారా ఖర్చైన కేలరీలను తిరిగి భర్తీ చేసే అవకాశం ఉంటుంది. ఫలితంగా బరువు తగ్గడానికి అవసరమైన కేలరీ లోటు ఏర్పడదు. మరో కారణం మెటబాలిక్ అడాప్టేషన్. శరీరం ఒకే రకమైన వ్యాయామానికి అలవాటు పడినప్పుడు అదే వ్యాయామాన్ని గతంలో కంటే మరింత సమర్థవంతంగా చేయడం ప్రారంభించవచ్చు. దాంతో అదే స్థాయి వ్యాయామానికి శరీరం తక్కువ శక్తిని ఖర్చు చేసే అవకాశం ఉంటుంది.



# ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలను పిల్లలకు ఇవ్వకండి..



ఇటీవలి కాలంలో ఈ–బైక్‌లు, ఈ–స్కూటర్లు వంటి విద్యుత్ ఆధారిత ద్విచక్ర వాహనాల వినియోగం విపరీతంగా పెరిగింది. యువత నుంచి డెలివరీ సిబ్బంది వరకు వీటిని విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. అయితే వీటి వినియోగం పెరుగుతున్న కొద్దీ, ముఖ్యంగా పిల్లలు ప్రమాదాలకు గురై తీవ్రంగా గాయపడటం, మరణాలు సంభవించడం ఆందోళన కలిగిస్తోంది. దీంతో ఈ–బైక్‌ల వినియోగంపై కఠినమైన నిబంధనలు తీసుకురావాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి. పిల్లలు ఈ–బైక్‌లు, ఈ–స్కూటర్లు, ఇతర విద్యుత్ వాహనాలతో ప్రమాదాలకు గురవుతున్న ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో కొన్ని ప్రాంతాల్లో అధికారులు తల్లిదండ్రుల బాధ్యతపైనా దృష్టి సారిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ పిల్లలు ఈ వాహనాలు నడపడానికి అనుమతించే తల్లిదండ్రులపై చర్యలు తీసుకునే పరిస్థితి ఏర్పడింది. అయితే అన్ని ప్రాంతాల్లో ఒకే విధమైన నిబంధనలు లేకపోవడంతో తల్లిదండ్రులు, పిల్లలు ఏ వాహనం చట్టబద్ధమైనది, ఏది ప్రమాదకరమైనది అనే విషయంలో గందరగోళానికి గురవుతున్నారు. ఇటీవల ఓ టీనేజర్ చట్టవిరుద్ధమైన ఈ–వాహనంతో ప్రమాదానికి గురై మరణించడం ఈ అంశంపై మరోసారి చర్చకు దారితీసింది. దీంతో నిబంధనలకు విరుద్ధంగా ఈ–బైక్‌లను విక్రయిస్తున్న సంస్థలపైనా అధికారులు దృష్టి సారిస్తున్నారు. నిబంధనలకు మించి వేగం లేదా శక్తి కలిగిన ఈ–బైక్‌లను విక్రయిస్తే ఒక్కో విక్రయానికి భారీగా జరిమానాలు విధించే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఈ–బైక్ నడిపేవారికి కనీస వయస్సుతో పాటు లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ వంటి నిబంధనలను తప్పనిసరి చేయాలని చూస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో నిర్దిష్ట వయస్సు కంటే తక్కువ ఉన్నవారు అధిక వేగంతో ప్రయాణించే ఈ–బైక్‌లను నడపకుండా పరిమితులు విధిస్తున్నారు. వేగ పరిమితులు, హెల్మెట్ వినియోగం, వాహన సామర్థ్యానికి సంబంధించిన నిబంధనలు కూడా ప్రాంతాన్ని బట్టి మారుతున్నాయి. కొన్ని చోట్ల కొత్త నిబంధనలు తీసుకురాగా, మరికొన్ని ప్రాంతాల్లో ఇలాంటి చర్యలపై చర్చ జరుగుతోంది. ప్రమాదాలపై నిర్వహించిన పలు అధ్యయనాలు ఈ–బైక్‌లు, ఈ–స్కూటర్లు, ఇతర మోటరైజ్డ్ వాహనాల వల్ల ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగినట్లు వెల్లడించాయి. అయితే కేవలం ప్రమాదాల సంఖ్య పెరగడం కంటే గాయాల తీవ్రత, ముఖ్యంగా పిల్లల్లో తీవ్ర గాయాలు ఎక్కువగా నమోదవుతుండటం మరింత ఆందోళనకరమని పరిశోధకులు చెబుతున్నారు.




## యమహా వైజెడ్ఎఫ్-ఆర్2



అంతర్జాతీయ విపణి కోసం తేలికపాటి స్పోర్ట్‌బైక్ వైజెడ్ఎఫ్–ఆర్2ను యమహా మోటార్ ఇండియా విడుదల చేసింది. ప్రారంభ ధర రూ.2.30 లక్షలు (ఎక్స్–షోరూమ్). టాప్ వేరియంట్ ఆర్2ఎం ధర రూ.2.53 లక్షలు (ఎక్స్‌షోరూమ్). ఈ బైక్ డెలివరీలు సెప్టెంబరు నుంచి ప్రారంభమవుతాయి. కొత్తగా అభివృద్ధి చేసిన 200 సీసీ లిక్విడ్ కూల్డ్, సింగిల్ సిలిండర్ ఇంజిన్ ఈ బైక్‌కు అమర్చారు. దీనికి 6 స్పీడ్ గేర్‌బాక్స్‌తో పాటు స్లిప్ అండ్ అసిస్ట్ క్లచ్‌ను స్టాండర్డ్‌గా ఇచ్చారు. స్ట్రీట్, రెయిన్, స్పోర్ట్స్, కస్టమ్ అనే రైడింగ్ మోడ్స్ ఇచ్చారు. టాప్ వేరియంట్‌లో అదనంగా టీఎఫ్‌టీ తెర, స్మార్ట్ కీ వంటి అధునాతన ఫీచర్లను జోడించారు.

# ఇ-20 పెట్రోల్ స్థానంలో.. ఇ-10ని తెచ్చే నిర్ణయం తీసుకోలేదు




ఇ–20 పెట్రోల్ (20% ఇథనాల్ కలిపిన పెట్రోల్) స్థానంలో ఇ–10 పెట్రోల్‌ను తెచ్చే నిర్ణయం తీసుకోలేదని భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) తెలిపింది. 'ఇ–20 పెట్రోల్‌కు అనుగుణంగా లేని పాత వాహనాల ఇంజిన్లలో కొన్ని విడి భాగాలు దెబ్బతినే అవకాశం ఉన్నందున, తక్కువ ఇథనాల్ కలిపిన పెట్రోల్‌ను అందు బాటులోకి తేవాలా? ప్రస్తుత ఇంధన పంపిణీ నెట్‌వర్క్ ద్వారా, రెండు రకాల పెట్రోల్ ఎలా సరఫరా చేయవచ్చనే' అంశంపై చర్చ జరుగుతోందని స్పష్టం చేసింది. ఒకవేళ ప్రభుత్వం కనుక ఇథనాల్ మిశ్రమ విధానాన్ని మార్చాలని నిర్ణయిస్తే, ఇ–20 పెట్రోల్ నుంచి ఇ–10కి మారడంలో ఎలాంటి నిర్వహణపరమైన లేదా లాజిస్టికల్ సవాళ్లు ఉండవని బీపీసీఎల్ ఛైర్మన్, ఎండీ సంజయ్ ఖన్నా స్పష్టంచేశారు. ఇ–20 పెట్రోల్‌స్థానంలో ఇ–10 పెట్రోల్ సరఫరా చేస్తామని తాను ఎక్కడా చెప్పలేదని అన్నారు. పెట్రోల్ బంకుల్లో ఇ–20తో పాటు ఇ–10 పెట్రోల్ అందుబాటులో ఉంటే పాత వాహనాల యజమానులకు మేలు కలుగుతోందనే విస్తృత చర్చల మధ్య సంజీవ్ ఖన్నా ఈ వ్యాఖ్యలు చేశారు.

# లాభాల్లో ముగిసిన సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. అతర్జాతీయ మార్కెట్‌ల నుంచి సానుకూల సంకేతాలకు తోడు ఐటీ, ఫార్మా, మెటల్ స్టాక్స్ రాణించాయి. దీంతో సూచీల రెండ్రోజుల వరుస నష్టాలకు బ్రేక్‌పడింది. సెన్సెక్స్ 300 పాయింట్లకు పైగా లాభపడగా.. నిఫ్టీ 24,150 ఎగువన స్థిరపడింది.
సెన్సెక్స్ ఉదయం 77,128.05 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,933.59) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 77,357.97 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 330.92 పాయింట్ల లాభంతో 77,264.51 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 84.80 పాయింట్ల లాభంతో 24,175.65 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.39గా ఉంది.
సెన్సెక్స్ 30 సూచీలో టీసీఎస్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టైటాన్ షేర్లు లాభాల్లో ముగిశాయి. ఐసీఐసీఐ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, ఏషియన్ పెయింట్స్, ఐటీసీ, మారుతీ సుజుకీ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 88.30 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4603 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



# టెంప్‌సెన్స్ ఇన్‌స్ట్రుమెంట్స్ బంపర్ లిస్టింగ్..



టెంప్‌సెన్స్ ఇన్‌స్ట్రుమెంట్స్ సంస్థ.. స్టాక్ మార్కెట్ లిస్టింగ్‌లో అదరగొట్టింది. శుక్రవారం ఈ కంపెనీ షేర్లు ఏకంగా 111 శాతం ప్రీమియంతో లిస్టయ్యాయి. అంటే ఐపీఓలో మదుపర్లు పెట్టిన సొమ్ముకు రెట్టింపు కంటే ఎక్కువ ప్రతిఫలం అందించింది. ఐపీఓ ఇష్యూ ధర రూ.300 కాగా.. ఎన్ఎస్ఈలో ఈ కంపెనీ షేర్లు రూ.634 వద్ద ట్రేడింగ్‌ను ఆరంభించాయి. ఆపై రూ.634.85 వద్ద గరిష్ఠాన్ని తాకిన షేరు విలువ.. తర్వాత 8 శాతం మేర పతనమై రూ.582 వద్ద కనిష్ఠాన్ని తాకింది. మొత్తం రూ.650 కోట్లు సమీకరించే లక్ష్యంతో ఈ నెల 20న ప్రారంభమైన ఈ పబ్లిక్ ఇష్యూ 24న ముగిసింది. ఐపీఓలో ధరల శ్రేణిని రూ.285–300గా నిర్ణయించింది. పబ్లిక్ ఇష్యూలో రూ.555 కోట్లు ఆఫర్ ఫర్ సేల్ ద్వారా, రూ.95 కోట్లు ఫ్రెష్ ఇష్యూ ద్వారా షేర్లను జారీ చేశారు. మొత్తం 184 రెట్ల సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం నుంచి గ్రే మార్కెట్ ప్రీమియంలో మంచి ధర పలుకుతూ వచ్చింది. ఒక్కో షేరుకు రూ.300 లాభాన్ని అంచనా వేశారు. అందుకు అనుగుణంగానే షేర్లు నేడు బంపర్ ఎంట్రీ ఇచ్చాయి. థర్మల్ ఇంజినీరింగ్ ఉత్పత్తులు, స్పెషలైజ్డ్ కేబుళ్లను తయారీ చేసే ఈ కంపెనీ.. ఐపీఓ ద్వారా సమీకరించిన నిధులను కంపెనీ విస్తరణకు వినియోగించనుంది.

# ఐపీఓకు ఆరాజెన్ సన్నాహాలు

aragen

హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఒప్పంద పరిశోధన, అభివృద్ధి, తయారీ సంస్థ (సీఆర్‌డీఎంఓ) ఆరాజెన్ లైఫ్ సైన్సెస్ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు వచ్చేందుకు అనుమతి కోరుతూ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది. ఈ ప్రకారం రూ.800 కోట్ల విలువైన తాజా షేర్లను సంస్థ జారీ చేయనుంది. దీంతోపాటు ప్రస్తుత వాటాదారు గోల్డ్‌మన్ శాక్స్ క్యాపిటల్ హోల్డింగ్స్, ప్రమోటర్లు 2.73 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) మార్గంలో విక్రయిస్తారు. సమీకరించే నిధులను సంస్థ విస్తరణకు, అప్పులు తీర్చేందుకు వినియోగిస్తారు. హైదరాబాద్‌లోని కంపెనీ ల్యాబ్, తయారీ కేంద్రాలకు కొత్త యంత్రాలు, పరికరాలు కొనుగోలు చేస్తారు. బెంగళూరులోని కంపెనీ అనుబంధ సంస్థ ఆరాజెన్ బయోలాజిక్స్‌లో సదుపాయాల విస్తరణకు, సాధారణ కార్పొరేట్ అవసరాల నిమిత్తం కొంత మొత్తం కేటాయిస్తారు. 2000లో ఏర్పడిన ఈ కంపెనీకి, మనదేశంతో పాటు అమెరికా, ఐరోపా, జపాన్‌లలో కలిపి 591 మంది అంతర్జాతీయ వినియోగదారులున్నారు. 4,362 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.


# బ్యాంకెక్స్ పుట్ రూ.6 నుంచి రూ.986కి



గురువారం ఎక్స్‌పైరీ రోజున బ్యాంకెక్స్ 65000 ఆగస్టు పుట్ ప్రీమియం ధర రూ.6 నుంచి నిమిషాల వ్యవధిలోనే రూ.986కి పెరిగింది. బ్యాంకెక్స్ లాట్ పరిమాణం 30. అంటే రూ.180 పెట్టుబడి ఏకంగా రూ.29,580 అయ్యిందన్నమాట. అయితే చివరికి ఈ పుట్ కాంట్రాక్టు రూ.687 ధర వద్ద స్థిరపడగా, విలువ రూ.20,610గా ఉంది. సెన్సెక్స్ ఆప్షన్స్‌లోనూ ఇదే జరిగింది. సెన్సెక్స్ 77000 ఆగస్టు పుట్ రూ.7 నుంచి ఒక దశలో రూ.284.85ని తాకింది.
సాధారణంగానే ఎక్స్‌పైరీ రోజున ఆప్షన్స్ కాంట్రాక్టులు తీవ్ర హెచ్చుతగ్గులకు లోనవుతుంటాయి. దీనికి క్లోజింగ్ ఆక్షన్ సెషన్ (సీఏఎస్) ప్రక్రియ తోడవడంతో.. బ్యాంకెక్స్, సెన్సెక్స్ పుట్ ఆప్షన్స్ భారీగా పెరిగినట్లు ట్రేడర్లు చెబుతున్నారు.
ఎక్స్‌పైరీ రోజుల్లో బ్యాంకెక్స్ వంటి అస్థిర సూచీ కాంట్రాక్టుల విషయంలో ఆప్షన్‌ల కదలికలు అత్యంత సున్నితంగా ఉంటాయి. క్లోజింగ్ ఆక్షన్ సమయంలో ప్రామాణిక సూచీ లేదా దానిలోని కంపెనీ షేర్లు అకస్మాత్తుగా తీవ్ర అస్థిరతకు గురైనప్పుడు అవుట్ – ఆఫ్– ద– మనీ (ఓటీఎం) లేదా డీప్ ఓటీఎం ఆప్షన్‌లు తక్షణమే ఇన్– ది – మనీగా మారొచ్చు. సూచీ ప్రస్తుత ధరకు దూరంగా స్ట్రైక్ ప్రైస్ ఉన్న ఆప్షన్ కాంట్రాక్టులను అవుట్ – ఆఫ్– ద– మనీగాను, ప్రస్తుత ధరకు మించి స్ట్రైక్ ప్రైస్ ఉండే కాంట్రాక్టులను ఇన్– ద– మనీ ఆప్షన్స్‌గా చెబుతారు. ఇలా ఒక్కసారిగా ఇన్ ద మనీ ఆప్షన్స్‌గా మారినప్పుడు ఆ కాంట్రాక్టు ప్రీమియం ధర స్థిరపడటానికి ముందే భారీగా పెరుగుతాయి. గురువారం బ్యాంకెక్స్ 65000 ఆగస్టు పుట్ రూ.986కి పెరిగి, ఆ తర్వాత రూ.687 వద్ద స్థిరపడినట్లుగా అన్నమాట.
ఆకస్మికంగా భారీ మార్కెట్ ఆర్డర్లు లేదా ఎగ్జిక్యూషన్‌లో అసాధారణత వల్ల కూడా కొన్ని సెకన్లలోనే ప్రామాణిక సూచీల రెఫరెన్స్ ధర తీవ్రంగా మారుతోంది. ఈ పరిణామం కూడా ఆప్షన్స్ కాంట్రాక్టుల ప్రీమియం భారీగా పెరిగేందుకు దారితీస్తాయని విశ్లేషకులు చెబుతున్నారు. గురువారం బ్యాంకెక్స్ పుట్ కాంట్రాక్టుల్లో కనిపించిన ఈ భారీ పెరుగుదలకు సంబంధించిన గ్రాఫ్‌లను ట్రేడర్లు, మార్కెట్ పరిశీలకులు ఎక్స్ ప్లాట్‌ఫామ్‌లో పోస్ట్ చేయడంతో.. సీఏఎస్ విధానం మళ్లీ చర్చనీయాంశం అయ్యింది.




## రక్షా బంధన్ ఎప్పటికీ నా ఫేవరెట్: ఇర్ఫాన్ పఠాన్



సోదర – సోదరీమణుల మధ్య అనుబంధానికి ప్రతీకగా రక్షాబంధన్ నిర్వహించుకుంటాం. ఈ సందర్భంగా భారత మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ పోస్టు పెట్టాడు. ఈ బంధం ఎప్పటికీ విడదీయలేనిదని పేర్కొన్నాడు. ''నాకు ఎంతో ఇష్టమైంది రక్షా బంధన్. చాలా అందమైన పండగ. సోదర – సోదరీమణుల మధ్య విడదీయరాని అనుబంధానికి గుర్తుగా చేసుకుంటాం. ప్రేమ, మరిచిపోలేని జ్ఞాపకాలు, చిరునవ్వులు, అప్పుడప్పుడు ఫైట్లు, ఏడిపించుకోవడం, ఒకరికొకరు మద్దతుగా నిలవడం.. ఇలాంటివి ఎన్నో ఆప్యాయతలు అందులో ఉంటాయి. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు. హ్యాపీ రక్షా బంధన్. ఈ బంధం చెక్కుచెదరకుండా మరింత బలోపేతం కావాలని ఆకాంక్షిస్తున్నా'' అని పఠాన్ పోస్టు చేశాడు. టీమ్ఇండియా స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ సోదరి భావన రాఖీ పండుగ సందర్భంగా ప్రత్యేకంగా పోస్టు చేశారు. విరాట్ సోదరుడు వికాస్‌కు రాఖీ కడుతూ ఉన్న ఫొటోను ఆమె షేర్ చేస్తూ.. ''జీవితం మనల్ని ఏ స్థాయికి తీసుకెళ్లినా.. నా ఆశీస్సులు ఎప్పుడూ మీతోనే ఉంటాయి'' అని భావన పోస్టు పెట్టారు.

# మహిళల క్రికెట్‌లో అనయ బంగర్‌ను ఎలా ఆడిస్తారు?: కాప్ తీవ్ర అభ్యంతరం




అనయ బంగర్.. లింగ మార్పిడి చేయించుకుని అమ్మాయిగా మారిన ఓ అబ్బాయి. భారత మాజీ క్రికెటర్ సంజయ్ బంగర్ కుమార్తె. అంతకుముందు దేశవాళీలో సర్ఫరాజ్ ఖాన్, అభిషేక్ శర్మ వంటి యువ భారత ఆటగాళ్లతో కలిసి ఆడిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మహిళగా మారిన తర్వాత తన క్రికెట్ కలను నెరవేర్చుకొనేందుకు ఐసీసీపైనే పోరాటం చేసింది. అయితే, ఆస్ట్రేలియా క్రికెట్ సంఘం ఆమెకు మద్దతుగా నిలిచింది. మహిళల బిగ్‌బాష్ లీగ్‌లో ఆడేందుకు అవకాశం ఇచ్చింది. కానీ, ఇప్పుడు అనయ అవకాశాలకు గండిపడేలా ఉంది. దానికి కారణం దక్షిణాఫ్రికా ప్లేయర్ మరిజెన్నె కాప్ తీవ్ర స్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేయడం. ఈ మేరకు తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీగా పెట్టడం గమనార్హం. ''ఇలాంటి నిర్ణయం అత్యంత దారుణం. అనుమతి ఇవ్వడానికి వీల్లేదు. ట్రాన్స్‌జెండర్ క్రికెటర్ మహిళల బిగ్‌బాష్‌ను ఆడేందుకు ఎలా వీలవుతుంది'' అని కాప్ అభ్యంతరం వ్యక్తం చేసింది. మార్చి 2027లో మొదలయ్యే మహిళల బిగ్‌బాష్‌లో ఆడతానని ఇటీవల అనయ ప్రకటించిన తర్వాత కాప్ ఈ మేరకు పోస్టు చేసింది. ఆసీస్ బోర్డు నిర్ణయంపై వ్యతిరేకత వ్యక్తం చేసిన తొలి క్రికెటర్ కాప్. ఈ దక్షిణాఫ్రికా స్టార్ ఆల్‌రౌండర్ అయిన ఆమె బిగ్‌బాష్‌లోనూ ఆడుతోంది. ఐసీసీ (ICC) 2023 నుంచి అమలు చేస్తోన్న పాలసీ ప్రకారం.. ట్రాన్స్‌జెండర్ మహిళలకు అంతర్జాతీయ మహిళా క్రికెట్ ఆడేందుకు అనుమతి లేదు. కానీ, ఆస్ట్రేలియా దేశవాళీ నిబంధనలు ఇందుకు పూర్తిగా భిన్నం. కమ్యూనిటీ, ప్రీమియర్ క్రికెట్ ఆడేందుకు అనయకు అవకాశం కల్పించింది. అర్హత ప్రక్రియను అనుసరించే అనుమతి ఇచ్చినట్లు ఇటీవల ఓ ప్రకటనలో తెలియజేసింది. కాప్ విమర్శల నేపథ్యంలో.. ఇప్పుడు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి మరి!

## మాజీ క్రికెటర్ రహానే పేరిట స్కాలర్‌షిప్



భారత మాజీ క్రికెటర్ అజింక్య రహానేకు గొప్ప గౌరవం దక్కింది. ఆయన పేరిట ఓ స్కాలర్‌షిప్‌ను ఇచ్చేందుకు ముంబయి క్రికెట్ అసోసియేషన్ నిర్ణయం తీసుకుంది. ముంబయి అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌లో పలు కీలక అంశాలపై చర్చ జరిగింది. పురుష, మహిళా క్రికెటర్లకు వార్షిక కాంట్రాక్ట్‌లను అందించనుంది. అలాగే రహానే పేరిట అర్హులైన ఆటగాళ్లకు స్కాలర్‌షిప్‌ను ఇవ్వనుంది.
ముంబయి క్రికెట్ అసోసియేషన్ తరఫున 22 మంది క్రికెటర్లకు వార్షిక కాంట్రాక్ట్‌లు దక్కాయి. ఇందులో 14 మంది పురుషులు, 8 మంది మహిళా క్రికెటర్లు ఉన్నారు. గ్రేడ్ – Aలో రూ. 12 లక్షలు, గ్రేడ్ B ప్లేయర్లకు రూ.8 లక్షలు, గ్రేడ్ C వారికి రూ.6 లక్షలు అందనుంది. గ్రేడ్‌ఏలో సిద్దేశ్, షామ్స్ ములానికి అవకాశం వరించింది. యువ క్రికెటర్ల కోసం..
క్షేత్ర స్థాయిలో యువ క్రికెటర్లకు ప్రోత్సాహం అందించేందుకు స్కాలర్‌షిప్ ఫండ్‌కు ఎంసీఏ అపెక్స్ కౌన్సిల్ ఆమోద ముద్ర వేసింది. ఇటీవల అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన అజింక్య రహానే పేరిట ఈ స్కాలర్‌షిప్‌ను ఇవ్వనుంది. ముంబయి జట్టుకు రహానే సారథిగా రంజీ ట్రోఫీలను అందించిన చరిత్ర ఉంది. ఎంసీఏ మాజీ ప్రెసిడెంట్ శరద్ పవార్ భాగస్వామ్యం అందించనున్న ఈ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్‌కు రహానే పేరు పెట్టినట్లు ముంబయి క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు అజింక్య నాయక్ తెలిపారు.

## చరిత్ర సృష్టించిన ప్రజ్ఞానంద..

### తొలి భారత గ్రాండ్ మాస్టర్‌గా ఘనత



భారత యువ గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానంద చరిత్ర సృష్టించాడు. గ్రాండ్ చెస్ టూర్ విజేతగా నిలిచిన తొలి భారతీయుడిగా ఘనత సాధించాడు. డిఫెండింగ్ ఛాంపియన్ ఫాబియానో కరువానాపై ప్రజ్ఞానంద 15–13 తేడాతో విజయం సాధించాడు. ఆఖరి రోజు ఆట ప్రారంభంలో 6 పాయింట్ల వెనుకంజలో ఉన్న ప్రజ్ఞానంద.. వరుసగా రెండు ర్యాపిడ్ గేమ్‌లను గెలిచి ఆధిక్యంలోకి వచ్చాడు. దీంతో గ్రాండ్ చెస్ టూర్‌లో తొలి టైటిల్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. దాదాపు రూ.2 కోట్ల ప్రైజ్‌మనీని ప్రజ్ఞానంద గెలుచుకున్నాడు. దీంతో వచ్చే ఏడాది జరిగే గ్రాండ్ చెస్ టూర్‌కు నేరుగా అర్హత సాధించాడు.
భారత్–ఎ జట్టులో ఈ ఛాంపియన్స్ ప్లేయర్ షబ్నమ్ ''ఇవాళ నేను గెలిచే అవకాశాలు వస్తాయని అనుకోలేదు. ఆరు పాయింట్లు వెనుకబడి ఉన్నా. ఇలాంటప్పుడే ఎలా ఆడాలో చూపించా. ఫాబి వంటి ప్లేయర్‌పై ఒక్క మ్యాచ్ గెలవడమే కష్టం. ర్యాపిడ్‌లో రెండు గేమ్‌ల్లో విజయం సాధించా. గతేడాది నుంచి నా ర్యాపిడ్, బ్లిట్జ్ గేమ్‌లో మార్పులు చేసుకున్నా. ఇప్పుడు ఆ ఫలితం కనిపించింది. ఈ ఫార్మాట్‌లో మెరుగయ్యాననే అనుకుంటున్నా'' అని ప్రజ్ఞానంద తెలిపాడు.
ప్రజ్ఞానందకు ఈ ఏడాది ఆరంభం అంతగా కలిసిరాలేదు. క్యాండిడేట్స్ టోర్నీలో విఫలమైన అతడు.. నార్వే చెస్‌ను గెలిచాడు. అదీనూ మాగ్నస్ కార్ల్‌సన్ వంటి ప్రపంచ నంబర్‌వన్‌పై రెండుసార్లు విజయం సాధించాడు. ఆ తర్వాత సెయింట్ లూయిస్ ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్, సింక్‌ఫీల్డ్ కప్‌లను సొంతం చేసుకున్నాడు. కాండిడేట్స్‌లోనూ గెలిచి ఉంటే బాగుండేదని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించాడు.

# దినుషను డీకోడ్ చేయలేకపోయిన టీమ్ఇండియా..!

తొలి టెస్టులో అద్భుత విజయంతో జోరు ప్రదర్శించిన టీమ్ఇండియా రెండో టెస్టులో అంచనాలను అందుకోలేకపోయింది. దాదాపు ఓటమిలాంటి డ్రాతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. దీనికి కారణం ఒకేఒక్కడు. అతడే శ్రీలంక యువ బ్యాటర్ సోనాల్ దినుష . భారత బౌలర్లను ముప్పుతిప్పలు పెట్టి.. చివరి వరకూ క్రీజులో నిలిచాడు. తన అసాధారణ పోరాటంతో జట్టును గట్టెక్కించాడు. అతడి బ్యాటింగ్ స్టైల్‌ను డీకోడ్ చేయడంలో టీమ్ఇండియా పూర్తిగా విఫలమైంది.
ఫాలోఆన్ ఆడుతూ తన టీమ్‌కు మనోస్థైర్యాన్ని పెంచే డ్రాను అందించాడు సోనాల్ దినుష. అతడు ఆడింది ఐదో టెస్టే అయినా.. ఎంతో అనుభవమున్న ఆటగాడిలా సత్తాచాటాడు. తన వికెట్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ చేజార్చుకోకూడదన్న పట్టుదల.. ప్రతి షాట్‌లోనూ కనిపించింది. ఎంతో ఓపికగా అతడు క్రీజులో నిలిచి రెండు ఇన్నింగ్స్‌ల్లో అద్భుత శతకాలతో (103 & 133★) జట్టుకు ఓటమిని దూరం చేశాడు. ఈ ఏడాది జులైలో విండీస్‌తో జరిగిన టెస్టు మ్యాచ్‌లో కూడా ఏడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన



సోనాల్ దినుష 92 పరుగులు చేశాడు. నాటి మ్యాచ్ కూడా డ్రాగా ముగిసింది. అతడి ఆటతీరును చూసిన బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా సచిన్‌తో పోల్చుతూ ప్రశంసలు కురిపించడం గమనార్హం.
దినుష ఆట ఏదో గాలివాటం అనుకోవడానికి లేదు. టీమ్ఇండియాతో (Team India) ఈ టెస్టు సిరీస్‌లోనే మూడు సెంచరీలు, ఒక అర్ధ శతకం నమోదు చేశాడు. అతడి షాట్‌ల ఎంపిక కూడా బాగుంది. ముఖ్యంగా అతడి స్వీప్ షాట్లు భారత్ సహనానికి పరీక్ష పెట్టాయి. ఈ షాట్లతోనే టెస్టు క్రికెట్‌లో రికార్డు సృష్టించాడు. కేవలం స్వీప్‌షాట్లతోనే సిరీస్ మొత్తంలో 176 పరుగులు రాబట్టాడంటే అతడి సత్తా ఏంటో తెలుస్తోంది. ఓ టెస్టు సిరీస్‌లో ఇదే అత్యధికం. అంతకుముందు ఈ రికార్డు ఇంగ్లాండ్ స్టార్ ఆటగాడు జో రూట్ (168) పేరిట ఉండేది. అతడు శ్రీలంకపైనే ఈ ఘనత సాధించాడు. ఇక ఈ సిరీస్‌లో దినుష 121 స్వీప్ షాట్లకు ప్రయత్నించాడు. ఇది కూడా రికార్డే. ఇక రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో భారత్‌పై మూడు సెంచరీలు నమోదు చేసిన మూడో శ్రీలంక బ్యాటర్‌గానూ దినుష నిలిచాడు. రెండో టెస్టు చివరి రోజు ఇంకో నాలుగు వికెట్లు తీస్తే భారత్ విజయం ఖాయమనుకున్న సమయంలో.. దినుషను అడ్డుకోవడంలో టీమ్ఇండియా పూర్తిగా తేలిపోయింది. రెండో ఇన్నింగ్స్‌లో అతడిని నిలువరించేందుకు బౌలర్లను తరచూ మార్చినా ఫలితం లేకుండా పోయింది. ఏకంగా ఎనిమిది మందితో బౌలింగ్ వేయించాడు కెప్టెన్ గిల్. చివరికి తానే రంగంలోకి దిగినా.. అప్పటికే ఆట డ్రా వైపు మళ్లింది. దినుష బలహీనతలను గుర్తించి.. దెబ్బకొట్టడంలో టీమ్ఇండియా బౌలర్లు విఫలమయ్యారని పలువురు మాజీలు కూడా పేర్కొంటున్నారు.




# 'ఐయామ్ గేమ్' నుంచి 'లూజర్' సాంగ్ రిలీజ్..

**వుదయం సినిమా:** దుల్కర్ సల్మాన్ భారీ బడ్జెట్ ఫాంటసీ థ్రిల్లర్ 'ఐయామ్ గేమ్' నుంచి రెండో సింగిల్ 'లూజర్' విడుదలైంది. జేక్స్ బిజోయ్ స్వరపరిచిన ఈ పాటను మలయాళంలో దుల్కర్ సల్మాన్ స్వయంగా ఆలపించారు. సుహైల్ కోయా సాహిత్యం అందించారు. మలయాళ వెర్షన్‌లో కె. బాలసరంగన్, జేక్స్ బిజోయ్ కూడా వోకల్ అందించారు.ఈ పాటను మలయాళం, తమిళం, తెలుగు, హిందీ, కన్నడ భాషల్లో విడుదల చేశారు. తమిళ, తెలుగు వెర్షన్లను బెన్నీ దయాల్ ఆలపించగా, విఘ్నేష్ రామకృష్ణ(తమిళ్), సనారే(తెలుగు) సాహిత్యం అందించారు. హిందీ వెర్షన్‌ను బెన్నీ దయాల్ పాడగా, నుమాన్ ఖోకర్ సాహిత్యం అందించారు. కన్నడ వెర్షన్‌లో సాయి మాధవ్ రెళ్ల వోకల్ అందించగా, హృదయ శివ సాహిత్యం రాశారు. ఈ చిత్రం 2026 సెప్టెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.ప్రముఖ నిర్మాణ, డిస్ట్రిబ్యూషన్ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్ ఈ చిత్రాన్ని ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో గ్రాండ్‌గా విడుదల చేయనుంది.స్టైలిష్, ఎలక్ట్రిఫైయింగ్ మ్యూజికల్ స్టైల్‌లో రూపొందిన 'లూజర్' సాంగ్ యువతను ఆకట్టుకునేలా ఉంది. 'ఐయామ్ గేమ్'లోని స్టైలిష్ మూడ్, ఎనర్జీని ఈ పాట కనిపిస్తోంది. సినిమా వైబ్రెంట్ వరల్డ్‌కు సంగీతం ద్వారా ఓ ఆసక్తికరమైన పరిచయాన్ని అందిస్తోంది.'ఐయామ్ గేమ్' ఆడియో లాంచ్, ప్రీ-రిలీజ్ ఈవెంట్ ఆగస్టు 29న సాయంత్రం 6 గంటల నుంచి కక్కనాడలోని కిన్‌ఫ్రా ఇంటర్నే షనల్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో జరగనుంది. భారీ అంచనాలు నెలకొన్న ఈ చిత్రం రికార్డు స్థాయి రిలీజ్‌కు సిద్ధమవుతోంది. మలయాళం, తమిళం, తెలుగు, హిందీ, కన్నడ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది.ఇప్పటికే విడుదలైన ట్రైలర్, తొలి సాంగ్ కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. మలయాళంతో పాటు తమిళం, తెలుగు, హిందీ, కన్నడ భాషల్లో విడుదలైన ట్రైలర్ అద్భుతమైన విజువల్స్, హై-ఆక్టేన్ యాక్షన్, థ్రిల్లింగ్ ఛేజ్ సీక్వెన్స్‌లతో పాన్-ఇండియా స్థాయిలో అందరి దృష్టిని ఆకర్షించింది. సినీ ప్రేక్షకులు ఇంతకుముందు చూడని సరికొత్త స్టైలిష్ ఫాంటసీ థ్రిల్లర్ అనుభూతిని ఈ సినిమా అందించ బోతుంది. ఈ చిత్రానికి జీ మ్యూజిక్ మ్యూజిక్ రైట్స్ సొంతం చేసుకోగా, జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్నారు.దక్షిణ భారతదేశంలోని 100కు పైగా లొకేషన్లలో చిత్రీకరించిన 'ఐయామ్ గేమ్' దుల్కర్ సల్మాన్ కెరీర్‌లో 40వ చిత్రం. ఆయన కెరీర్‌లోనే అత్యంత భారీ చిత్రంగా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. దుల్కర్ సల్మాన్‌తో పాటు ఆంటోనీ వర్గీస్, తమిళ నటుడు-దర్శకుడు మిస్కిన్, కాయదు లోహర్, కతిర్, పార్థ్ తివారీ, తమిళ నటి సంయుక్త విశ్వనాథన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.మెగా బ్లాక్‌బస్టర్ 'లోకా చాప్టర్ 1: చంద్ర' తర్వాత వే ఫేరర్ ఫిల్మ్స్ నుంచి వస్తున్న 'ఐయామ్ గేమ్'. సూపర్‌హిట్ 'RDX' తర్వాత దర్శకుడు నహాస్ హిదాయత్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు.భారీ స్థాయి యాక్షన్, ఫాంటసీ అంశాలు, దుల్కర్ సల్మాన్ ప్రధాన పాత్రలో 'ఐయామ్ గేమ్' 2026 సెప్టెంబర్ 3న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది.




# బ్రిడ్జ్ ప్రొడక్షన్స్ క్రేజీ కాంబినేషన్‌లో కొత్త సినిమా



**వుదయం సినిమా:** 'ఇరుముడి'తో అద్భుతమైన విజయాన్ని అందుకున్న మాస్ మహారాజా రవితేజ మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌కు సిద్ధమవుతున్నారు. 'సరిపోదా శనివారం'తో బ్లాక్‌బస్టర్ అందుకున్న ట్యాలెంటెడ్ ఫిల్మ్‌మేకర్ వివేక్ ఆత్రేయతో రవితేజ జతకట్టనున్నారు.'ఇరుముడి' బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన విజయాన్ని సాధిస్తూ, రికార్డు స్థాయి వసూళ్లతో దూసుకెళ్తోంది. ఈ చారిత్రాత్మక విజయాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ప్రత్యేక వేడుకలో దర్శకుడు వివేక్ ఆత్రేయ, నిర్మాతలు లక్ష్మణ్, శ్రీని.. రవితేజను కలిసి బ్లాక్‌బస్టర్ విజయానికి అభినందనలు తెలిపారు.రవితేజ, వివేక్ ఆత్రేయ, లక్ష్మణ్, శ్రీని, బ్రిడ్జ్ ప్రొడక్షన్స్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న ఈ కొత్త చిత్రం ఇప్పటికే ఆసక్తిని రేకెత్తిస్తోంది.రవితేజ, వివేక్ ఆత్రేయ కలయికలో రాబోతున్న ఈ సినిమా ప్రత్యేకమైన కాంబినేషన్‌గా నిలవనుంది. వివేక్ ఆత్రేయ తనదైన ట్రీట్‌మెంట్‌తో రూపొందించే ప్రపంచంలోకి రవితేజ అడుగుపెట్టడం ద్వారా సరికొత్త సినీ అనుభూతి అందించనున్నారు. రవితేజ ఎనర్జీ, స్క్రీన్ ప్రెజెన్స్, లార్జర్-దేన్-లైఫ్ పర్సనాలిటీకి వివేక్ ఆత్రేయ స్టైల్ ప్రత్యేకంగా నిలవనుంది.దర్శకుడు హసిత్ గోలితో రవితేజ చేయనున్న సినిమా పూర్తయిన తర్వాత ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లనుంది.

# 'భోగి' నుంచి రాఖీ స్పెషల్ పోస్టర్



**వుదయం సినిమా:** 'చార్మింగ్ స్టార్' శర్వా హీరోగా, 'మాస్ మావెరిక్' సంపత్ నంది దర్శకత్వంలో రూపొందుతున్న ప్రతిష్టాత్మక పాన్-ఇండియా పీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి'. శ్రీ సత్య సాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె. రాధామోహన్ నిర్మిస్తున్న, లక్ష్మి రాధా మోహన్ సమర్పిస్తున్న ఈ చిత్రం భారీ స్థాయి అత్యున్నత నిర్మాణ ప్రమాణాలతో అంచ నాలను పెంచుతూనే ఉంది. శర్వాను ఇప్పటివరకు ఎప్పుడూ చూడని పవర్‌ఫుల్ లుక్‌లో పరిచయం చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌తో పాటు, గ్రామీణ యువతి గా అను పమ పరమేశ్వరన్ లుక్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. రాఖీ పండుగను పురస్కరించుకుని 'భోగి' నుంచి రాఖీ స్పెషల్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ స్పెషల్ పోస్టర్‌లో శర్వా పల్లెటూరి కుర్రాడి అవతార్ లో కనిపించారు. పోస్టర్‌లో పల్లెటూరి వాతావరణం, ఆత్మీయమైన కుటుంబ అనుబంధాలు ఆకట్టుకునేలా కనిపిస్తున్నాయి. శర్వా తన తోబుట్టువులతో కలిసి కూర్చుని తాటికాయలను కొట్టి అందరికీ పంచుతూ కనిపించడం ప్రత్యేకంగా నిలిచింది. తోబుట్టువుల మధ్య ప్రేమ, అనుబంధంతో పాటు పల్లె జీవన శైలిని ప్రతిబింబించేలా ఈ పోస్టర్‌ను అందంగా డిజైన్ చేశారు. రాఖీ పండుగ స్ఫూర్తిని చూపించిన ఈ పోస్టర్ అందరి నీ ఆకట్టుకుం ది. ఈ సినిమాకు టాప్ టెక్నికల్ టీమ్ పని చేస్తోంది. సినిమాటోగ్రాఫర్ కిషోర్ కుమార్ క్లైమాక్స్‌ను అద్భుతమైన విజువల్స్‌తో తెరపై ఆవిష్కరిస్తుండగా, భీమ్స్ సిసిరోలియో తన మాస్ బీజీఎమ్, ఎమోషనల్ స్కోర్‌తో యాక్షన్ సన్నివేశాలను మరింత ఎలివేట్ చేయనున్నారు.

## ప్రముఖ నటుడు, నిర్మాత జి.వి. నారాయణరావు

# పార్థివ దేహానికి నివాళులు అర్పించిన మెగాస్టార్



**వుదయం సినిమా:** ప్రముఖ నటుడు, నిర్మాత జి.వి. నారాయణరావు పార్థివ దేహానికి మెగాస్టార్ చిరంజీవి నివాళులు అర్పించారు. జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో జరిగిన అంత్యక్రియలకు హాజరైన చిరంజీవి, నారాయణ రావుతో తనకున్న అనుబంధాన్ని, ఆత్మీయ జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.ఈ సందర్భంగా మెగా స్టార్ చిరంజీవి మాట్లాడుతూ.. ఫిలిం ఇన్‌స్టిట్యూట్ రోజుల నుంచి మా ఇద్దరి పరిచయం. తను అప్పటికే ఇన్‌స్టిట్యూట్‌లో సీనియర్. మేము ట్రైనింగ్ అవుతున్నప్పుడు తను వచ్చి తన అనుభవాలను పంచుకునేవారు. అలా మాకు దగ్గరయ్యారు. ఇండస్ట్రీలో ఎవరికి వాళ్లం ఎదిగినప్పుడు, నాకు ఒక స్టార్ ఇమేజ్ వచ్చినప్పుడు "నేను నిర్మాతగా నిలబడాలనుకుంటున్నాను. నువ్వు సినిమాలు చేయాలని" అడిగారు. అలా ఆయన నిర్మాణంలో రెండు చిత్రాలు చేయడం జరిగింది. నా సినిమాల్లో తనకు నటుడిగా కూడా అవకాశాలు వచ్చే లా చేయడం జరిగింది. అలా మా అనుబంధం కొనసాగుతూ వచ్చింది. యాదృచ్ఛికంగా ఒక పది రోజుల క్రితం "నేను ఒక సినిమా చేశాను. మంచు పల్లకి ఇన్‌స్పిరేషన్‌తో ఐదుగురు కుర్ర వాళ్లు.. పెద్దవాళ్లు అయితే ఎలా ఉంటా రో అనే కథతో ఒక సినిమా చేశాను. ట్రైలర్ లాంచ్ చేయాలి. మీ సహకారం ఉంటే అందరికీ బాగుంటుంది" అని అన్నారు. కచ్చితంగా చేస్తానని చెప్పాను. ఆ క్షణంలో ఇద్దరం కలిసి ఒక ఫోటో దిగుదాం రమ్మని అడి గారు. బహుశా తన ఆఖరి చిత్రం అదేనేమో. ఆ సమయం లో చాలా సేపు మాట్లాడుకున్నాము. ఆరోగ్యం గురించి జాగ్రత్త తీసుకోవాలని చెప్పాను. ఆ క్షణంలో తనకి ఆల్ ది బెస్ట్ చెప్పాను. కానీ అదే మాట శాశ్వతంగా గుడ్‌బై అవుతుందని అనుకోలేదు.

# తారలు అసలు పేరు!







ఆమని అసలు పేరు మంజు.16-11-1972న బెంగళూరులో పుట్టింది. గంగమ్మ రాజు అనే అయన మొదట మీనా అని పెట్టారు. తర్వాత 1990లో పుదియ కాత్రి సినిమా కోసం మీనాచ్చి అని పేరు మార్చారు. 'జంబ లకిడి పంబ ' సినిమాలో దర్శకుడు ఈ.వి.వి. సత్యనారాయణ ముఖ్య పాత్ర ఇస్తూ ఆమని అని పేరు పెట్టడంతో అదే పేరుతో కొనసాగుతోంది. 1992 లో విడుదలైన ఈ సినిమాతో గుర్తింపు వచ్చింది.విశ్వ బ్రాహ్మణ కులస్థురాలైనా మాంసాహారం తినదు. సినిమాల్లో నటించడానికి తల్లి ఒప్పుకున్నా సినిమాల పంపిణీ దారుడైన తండ్రి ఒప్పుకోలేదని ఆత్మహత్య ప్రయత్నం చేసింది. 1990 లో నెగిటివ్ పాత్రలో 'ఆడది', చంద మామ కథలులో చిన్న పాత్ర చేసి సినీ రంగ ప్రవేశం చేసింది. చామన చాయగా వున్నా ఆకర్షణ ఆకృతి బాగా ఉండడం కలిసి వచ్చింది. బాపు దర్శకత్వంలో ఆమని నటించిన 'మిస్టర్ పెళ్ళాం'కు జాతీయ స్థాయిలో ఉత్తమ చిత్రం అవార్డు వచ్చింది. ఈ సినిమాకే ఉత్తమ నటిగా 1993లో నంది అవార్డు అందుకుంది. 'శుభ సంకల్పం ' సినిమాకు మరోసారి 1995లో నంది అవార్డు అందుకుంది. శుభలగ్నంలో డబ్బు మీద ఆశ ఎక్కువ వుండే పెళ్ళాంగా భర్తను వేరే స్త్రీ కి అమ్మివేసే పాత్రను పోషించి తరువాత బాధ పడిన దానిగా ఆకట్టుకుంది.అమ్మ దొంగ, వంశానికి ఒక్కడు, ఆ నలుగురు, మావి చిగురు సినిమా పాత్రల్లో మెప్పించింది. సెకండ్ ఇన్నింగ్స్ లో స్వామి రారా, మధ్యాహ్నం హత్య, ఆ నలుగురు హిట్ అయ్యాయి.తెలుగులో సుమారు 73,తమిళంలో 12,కన్నడంలో , మలయాళంలో రెండేసి సినిమాల్లో ఇప్పటి వరకు నటించిన ఆమని తెలుగు తమిళ టెలీ సీరియల్స్ లోను నటిస్తోంది.'ఇల్లు ఇల్లాలు పిల్లలు' టీవి సీరియల్లో వూతపదం శ్రీరామ శ్రీరామ : అంటే అన్నాను అంటారు గాని తో ఆకట్టుకుంటోంది.

శ్యామా లాహోర్ లో 7-6-1935లో ముస్లిమ్ ఆర్యన్ కుటుంబంలో పంజాబీ మాతృ భాషతో జన్మించి హిందీ పంజాబీ చిత్రాల్లో పేరు తెచ్చుకున్న శ్యామా అసలు పేరు ఖుర్షిద్ అక్తర్. 1945లో బేబీ ఖుర్షిద్ గా 'జీనత్ 'హిందీ సినిమాలో పరిచయమైంది. మీరా బాయి, పతంగా, షబ్నం, తరానా హిందీ చిత్రాల్లో చిన్న పాత్రల్లో చేసింది. పంజాబీ భాష మీద ఆమెకున్న పట్టు చూసిన నిర్మాత' పంజాబీ సినిమా 'పోస్తీ 'లో ముఖ్య పాత్ర ఇస్తే నటనకు పేరు అందానికి గుర్తింపు వచ్చిబాగా ఆడటంతో , 'కౌది షా'లోను నటించగా పేరు వచ్చింది. హిందీ సినిమా 'సాజా'చేసాక ముఖ్యపాత్ర పోషించిన గురుదత్ 'ఆర్ పార్' హిందీ సినిమా 1954లో విడుదలై ఇంకా పేరు వచ్చింది. శారద, బర్సాత్ కి రాత్, భాబీ మున్నగు చిత్రాలు ఆకర్షించే చూపులు, ఉత్సాహ బరిచే అందం చక్కని ఆకృతి వలన హీరోయిన్ గా మంచి పేరు తెచ్చాయి. 1966లో మిలన్ నుంచి కేరక్టర్ ఆర్టిస్టు అయి కొన్ని సినిమాలు చేసింది. 1989లో హత్యార్ సినిమా చేసి తారలను చేయరు పుడతారు అనే పేరు తెచ్చుకున్న శ్యామా రిటైరై14-11-2017న మృతి చెందింది.

సిమ్రాన్ సిమ్రాన్ అసలు పేరు రిషి బాలా నావల్. నిర్మాత, గాయని, కొరియా గ్రాఫర్ గా పేరు తెచ్చుకున్న ఈమె4-4-1976 న బొంబాయిలో పంజాబీ కుటుంబంలో అశోక్ నావల్ శారద దంపతులకు జన్మించింది. డిగ్రీ అయ్యాక మోడలింగ్ రంగం లోకి అడిగి డిన ఈమెకు సావన్ కుమార్ టక్ 'సిమ్రాన్' అని పేరు పెట్టారు.న్యూజి లాండ్ లో తొలిసారి 1995లో షూటింగ్ జరుపుకున్న తొలి భారతీయ చిత్రం 'సనమ్ హర్జాయ్' సిమ్రాన్ తొలిచిత్రం. తొలి మలయాళ సినిమా 'ఇంద్రప్రస్థం' 1996 లో విజయ వంతం కాకు న్నా సిమ్రాన్ నటనకు మంచి పేరొచ్చింది. 1997లోనే 'అబ్బాయి గారి పెళ్లి ' కన్నడ సినిమా ' సింహద మారి' తమిళ సినిమా 'ఒన్స్ మోర్ ' తో పరిచయమైంది. తమిళ సినిమాల్లో రాణిస్తూ పెళ్లి తరువాత బ్రేక్ తీసుకుని కొంతకాలం టెలీ సీరియల్స్ చేసి సినిమాల్లో రి ఎంట్రీ ఇచ్చింది.కలిసిందాం రా, నువ్వు వస్తావని, సీమ సింహం, ఒక్క మగాడు,డాడీ, పేరు తెచ్చాయి.ఒక ఆంగ్ల చిత్రంలోను నటించింది.స్లిమ్ పెర్సనాల్టీతో ఆకట్టుకునే సిమ్రాన్ ఇప్పటి వరకు 21 తెలుగు, 62 తమిళ,16 హిందీ, కన్నడ మలయాళ భాషల్లో రెండేసి చిత్రాల్లో నటించి ప్రస్తుతం 2తమిళ 1 హిందీ సినిమాల్లో నటిస్తోంది.

(ఇంకా వున్నారు.)

వి.ఎస్.ఆర్. కేశవరావు

# రాఖీ వేడుకల్లో మానవత్వాన్ని చాటుకున్న నటుడు సంజోష్




**వుదయం సినిమా:** హీరో సంజోష్ శ్రీమాత బ్లైండ్ ఫౌండేషన్‌కు చెందిన అమ్మాయిలతో రాఖీ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఉపయోగపడే గ్యాస్ స్టవ్‌ను బహూకరించి, అందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు."ఇకపై మీరందరూ నా చెల్లెళ్లే. మీకు ఏ అవసరం వచ్చినా నా వంతు అండగా ఉంటాను" అంటూ వారికి మాట ఇచ్చారు.ఇప్పటికే శ్రీమాత బ్లైండ్ ఫౌండేషన్ అమ్మాయిల కోసం రెండు సార్లు భోజనాలు ఏర్పాటు చేయడంతో పాటు, ఫ్రిజ్ డొనేషన్ కార్యక్రమంలో కూడా పాల్గొన్నారు.ఇది మాత్రమే కాదు... ఇప్పటివరకు 250 మందికి మొబైల్ ఐ క్యాంప్స్ ద్వారా క్యాటరాక్ట్ సర్జరీలు, 118 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందించారు. అలాగే 3 మంది విద్యార్థుల చదువు బాధ్యతను స్వయంగా తీసుకున్నారు.వరంగల్ నుంచి వచ్చి సినీ పరిశ్రమలో మంచి ఫ్యామిలీ కథలతో ప్రేక్షకులను అలరిస్తూనే... తన వంతుగా సమాజానికి తిరిగి ఇవ్వాలనే ఆలోచనతో సేవా కార్యక్రమాలు చేస్తున్న హీరో సంజోష్‌ను అభినందిద్దాం.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at LAKSHYAM TELUGU DAILY, D. No.1227/1, 11 GPR Flats, Pedakakani Village and Mandal, Guntur, Andhra Pradesh - 522509 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : Sirikonda Augustin, RNI No. APTEL/2014/57702. E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.